

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## సరస్వతీ నిలయంపై సైకో మూకల విషం!

గీతం వర్సిటీ భూములపై ఆరోపణలు-వాస్తవాలు...

5లో



2026-27 కేంద్ర బడ్జెట్‌లో ఏపీలో కేటాయించిన రేర్ ఎర్త్ కారిడార్ సహా వివిధ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రం మంజూరు చేసిన ప్రాజెక్టులతో పాటు దేశవ్యాప్తంగా ప్రకటించిన వాటిని ఏపీలో ఏర్పాటు చేసుకునే అంశంపై ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ కార్యక్రమాలను అనుసంధానం చేసుకుంటూ అదనపు నిధులు సాధించాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి చేసిన కేటాయింపులపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు.

2

## కేంద్ర ప్రాయోజిత పథకాల్లో అదనపు నిధులు సాధించాలి

- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులపై సీఎం సమీక్ష
- ప్రతిపాదిత ప్రాజెక్టులను ఏర్పాటుచేసే అంశంపై దిశానిర్దేశం
- ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం

# మా లక్ష్యం యువతకు ఉపాధి



"యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పని చేస్తున్నాం. ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది. భూముల కేటాయింపుల్లో మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు. విమర్శించాలనుకుంటే కప్ టీ గురించి విమర్శించవచ్చు. ఒక కప్పు కాఫీ కంటే నేను వారివద్ద ఏం తీసుకున్నట్టు అనిపించినా నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా సిద్ధం" అని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. పరిశ్రమలకు 99 పైసలకే భూ కేటాయింపులపై ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో గురువారం వాడివేడి చర్చ జరిగింది. వైసీపీ సభ్యుల ఆరోపణలకు మంత్రి ధీటుగా సమాధానమిచ్చారు. గతంలో 99 పైసలకే వేరే కంపెనీకి భూమి ఇచ్చినట్టు ఆరోపించారు. నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేస్తే పారిపోయారు. క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే 99 పైసలకు భూములు ఇస్తున్నాం తప్ప.. ఆయారాం గయారాం కంపెనీలకు ఇచ్చేందుకు సిద్ధంగా లేమన్నారు.

3

- ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం
- ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది
- భూ కేటాయింపుల్లో లాలూచీ పడాల్సిన అవసరం లేదు
- వైసీపీకి ధీటైన సమాధానమిచ్చిన మంత్రి నారా లోకేష్
- ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో వాడివేడి చర్చ

## ఆత్మీయ కలయిక.. ఇల్లే వేదిక



రాజకీయ చాణక్యతలోనే కాదు, గౌరవ మర్యాదల ప్రదర్శనలోనూ నారా లోకేష్ -గ్రేట్ లీడరే. తండ్రినేర్పిన క్రమశిక్షణ.. తల్లిపంచిన వినయ సంపన్నం -లోకేష్‌ను ఓ ప్రత్యేక స్థానంలో నిలబెడుతూనే ఉన్నాయి. 'ప్రేమిస్తే పోయేదేముంది.. మహా అయితే తిరిగి ప్రేమిస్తారు' అంటాడో హీరో ఒక సినిమాలో. 'చిన్నా పెద్ద తేడా చూడకుండా గౌరవిస్తే పోయేదేముంది.. మహా అయితే తిరిగి గౌరవిస్తారు' అంటున్నాడు ఈ పొలిటికల్ రియల్ హీరో. రాజకీయాల్లో ఎక్కడా వినని, కనని కొంత సంప్రదాయానికి శ్రీకారం చుట్టాడు యువనేత లోకేష్. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధుల కుటుంబాలకు విందునివ్వడమే కాదు, ఆయా కుటుంబాల్లోని సభ్యులను తనదైన కుటుంబం చేసుకుని -ఆహ్లాదకర వాతావరణంలో ఒకింత సేదతీరుతూ ఆత్మీయతను పెంచే గొప్ప సంప్రదాయానికి శ్రీకారం చుట్టడం -రాష్ట్ర రాజకీయాన్ని కొత్త మలుపు తిప్పడమే. ఆత్మీయ కలయికకు తన ఇల్లే వేదిక చేసి.. నావాళ్లు, నాఅన్నవాళ్లంటూ.. 'సకుటుంబ పరివారాన్ని' ఆత్మీయ బహుమానాలతో సంతోషపెట్టిన మంత్రి లోకేష్ -టీడీపీ కుటుంబానికే కాదు, రాష్ట్ర ప్రజానీకానికీ -ఆత్మబంధువే!

4



## ఈ పిల్లలు మనల్ని చూసి ఏం నేర్చుకుంటారు!?

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో గురు వారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడిన మాటలు కేవలం సభాధ్యక్షుడి హెచ్చరికలు మాత్రమే కావు. అవి ప్రజాస్వామ్యంపట్ల గౌరవమున్న ఒక అనుభవజ్ఞుడైన నాయకుడి అంతర్మథనం. ముఖ్యంగా విద్యార్థుల సమక్షంలో నిన్న సభ దిగజారిన తీరును ఆయన వివరించిన విధానం ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసేలా ఉంది. సభను చూడటానికి వచ్చిన వందలాది విద్యార్థుల గురించి ఆయన ప్రస్తావించినప్పుడు, ఆయన స్వరం గద్గదమైంది. "ఈ పిల్లలు మనల్ని చూసి ఏం నేర్చుకుంటారు?" అన్న ఆయన ప్రశ్నలో ఒక తండ్రికి ఉండే ఆందోళన కనిపిస్తుంది. రాజకీయ నాయకులను రోల్ మోడల్స్‌గా చూడాల్సిన భావితరం, సభలో జరుగుతున్న అరుపులు, కాగితాలు చింపి వేయడం చూసి అసహ్యించుకునే పరిస్థితి రావడం ఆయనను తీవ్రంగా కలిచివేసింది.



2

## బాలయ్య బాబు... కళ్యాణ్ బాబు...

నందమూరి బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్.. ఇద్దరూ సినీ నటులు మాత్రమే కాదు రాజకీయ నాయకులు కూడా. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శాసనసభలో ఎదురుపడే వీరిద్దరూ గురువారం తాజాగా భేటీ అయ్యారు. బాలయ్య చొరవగా డిప్యూటీ సీఎం చాంబర్‌కు వెళ్లి పవన్‌ను కలిశారు. హిందూపురం నియోజకవర్గ సమస్యలపై ఆయనతో చర్చించారు.




## కేంద్ర ప్రాయోజిత పథకాల్లో

# అదనపు నిధులు సాధించాలి

- కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులపై సీఎం సమీక్ష
- ప్రతిపాదిత ప్రాజెక్టులను ఏర్పాటుచేసే అంశంపై దిశానిర్దేశం
- ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో సమావేశం

అమరావతి (చైతన్యరథం): కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకునేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. గత పాలకులు కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు ఖర్చు పెట్టకుండా పథకాలను నిర్వీర్యం చేశారని.. యుటిలిటీ సర్టిఫికెట్ల విషయంలో సమస్యలు తలెత్తాయన్నారు. ప్రభుత్వ శాఖలు అన్నీ వివిధ పథకాలకు కేటాయించిన నిధుల్ని ఖర్చు చేయగలిగితే అదనపు నిధుల్ని కూడా డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వచ్చే బడ్జెట్‌లోగా గరిష్ఠ కేటాయింపులు చేసుకునేలా ప్రణాళికలు ఉండాలని అధికారులకు సూచించారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన చాలెంజ్ విధానంలోనూ మరికొన్ని నిధులు సాధించుకునేలా కార్యాచరణ చేసుకోవాలన్నారు. కేంద్రం ప్రకటించిన రేర్ ఎర్త్ కారిడార్‌ను శ్రీకాకుళం- విజయనగరం- విశాఖ జిల్లాల్లో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటితో పాటు ఇతర విలువైన ఖనిజాలకు సంబంధించి వ్యాల్యూ చైన్ పరిశ్రమల్ని ఏర్పాటు చేసే ఆలోచన చేయాలన్నారు. ఈస్ట్‌కోస్ట్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటులోనూ తీర ప్రాంతంలో ఉన్న మూలపేట నుంచి దిగువన కృష్ణపట్నం వరకు ప్రతిపాదన చేయాలన్నారు. కంటైనర్ మాన్యుఫాక్చరింగ్, ఎక్విప్మెంట్ మాన్యుఫాక్చరింగ్ ప్రాజెక్టులను త్వరితగతిన ఏర్పాటు చేసుకునేలా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. మెగాటెక్స్ టైల్ పార్కును పల్నాడు ప్రాంతంలోను, స్పోర్ట్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌ను తిరుపతిలో ఏర్పాటుచేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0 లో భాగంగా సెమీ కండక్టర్ డిజైన్ తదితర ప్రాజెక్టులను అమరావతిలో ఏర్పాటుచేసేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. వీటితో పాటు రాజధాని ప్రాంతంలోని హెల్త్ సిటీలో బయోడిజైన్, మెడ్‌టెక్ పార్క్, బయో ఫార్మా శక్తి మిషన్ లాంటి ఎకోసిస్టం వస్తుందన్నారు. మెడికల్ టూరిజం-హీల్ ఇన్ ఏపీ అన్న విధానంలో అమరావతిలో ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. హిందూపురంలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ తయారీని ప్రతిపాదించాలన్నారు. తిరుపతిని టూరిజం డెస్టినేషన్ కింద అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. కేంద్రం మంజూరు చేసిన 1000 ఎలక్ట్రిక్ బస్సులను సద్వినియోగం చేసుకుని మరిన్ని ఇ-బస్సులు సాధించేలా ప్రణాళిక చేయాలన్నారు. కొబ్బరి, కోకో, కాజు, కాఫీ పంటలకు ఎక్కువ నిధులను సాధించుకునే అవకాశం ఉందన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులను కూడా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు ఆస్కారం ఉందన్నారు.




# అక్రమార్కులకు దండన తప్పదు

- కళాశాలల అనుమతుల్లో అక్రమాలను సహించేది లేదు
- త్వరలో వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నియామకం చేపడతాం
- శాసనసభలో విద్య, ఐటీ మంత్రి లోకేష్ స్పష్టీకరణ



అమరావతి (చైతన్య రథం): ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో అక్రమాలకు సంబంధించి ఆధారాలు పంపితే తప్పనసరిగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ పరిధిలో కళాశాలల అనుమతుల్లో అవకతవకలపై రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అడిగిన ప్రశ్నకు మంత్రి నారా లోకేష్ సమాధానమిచ్చారు. “గతంలో ఈ విషయమై ఎమ్మెల్యే వినతిపత్రం కూడా ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించి అనుమతులు పొందిన కళాశాలల వివరాలు పంపితే చర్యలు తీసుకుంటాం. అఫ్లియేషన్‌కు ఒక్కొక్క యూనివర్సిటీ పరిధిలో ఒక్కో విధానం పాటిస్తున్నారు. దానిని స్టాండర్డైజ్ చేయడానికి యూనిఫైడ్ యాక్ట్ తేవడానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తోంది. అఫిలియేషన్ స్ట్రీమ్‌లైన్ చేసి డిజిటలైజేషన్, జియో ట్యాగింగ్, ఫోటోస్, వీడియోస్‌తో సహా ఆన్ లైన్‌లో పెట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో పకడ్బందీ నిబంధనలు రూపొందించి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నియామక ప్రక్రియ చేపడతాం” అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ... “నన్నయ్య వర్సిటీ ప్రతిష్టాత్మకమైనది. 400కుపైగా అఫిలియేటెడ్ కళాశాలలు ఉన్న ఏకైక యూనివర్సిటీ. గత ప్రభుత్వంలో మితిమీరిన అక్రమాలు జరిగాయి. ఏవిధమైన మౌలిక సదుపాయాలు, కావాల్సిన సిబ్బంది లేకున్నా.. ముడుపులు తీసుకొని అధికారులు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకే అధ్యాపకుడు అయిదారు కాలేజీల్లో కూడా పనిచేస్తున్నట్టు చూపి అనుమతులు ఇచ్చారు. యూనివర్సిటీ అధికారులు కుమ్మక్కై ఈ అవకతవకలకు పాల్పడి విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు. మంత్రి నారా లోకేష్ నేతృత్వాన విద్యావ్యవస్థలో ప్రక్షాళన తెస్తున్న నేపథ్యంలో ఇప్పుడు కూడా అధికారులు అక్రమాలకు పాల్పడటం దారుణం. అనుమతులు ఇచ్చే సమయంలో టెంపరరీ సినిమా సెట్టింగ్ వేస్తున్నారు. యూనివర్సిటీ అధికారులు కుమ్మక్కై అనుమతులు ఇచ్చేస్తున్నారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ప్రతి మూడేళ్లకు ఒకసారి మారుతుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నన్నయ్య యూనివర్సిటీకి కౌన్సిల్ నియమించారు. మంత్రి అనుచరుడు ఒకరు, మాజీ ఎమ్మెల్యే మామ ఒకరిని సభ్యులుగా నియమించారు. వీరితో యూనివర్సిటీ అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. నన్నయ యూనివర్సిటీ ఏర్పాటునుంచి అవకతవకలకు అడ్డాగా మారింది. టెండర్ల విషయంలో వారికి నచ్చిన వారికి టెండరు దక్కేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. వారి అక్రమాలకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మద్దతు ఇస్తోంది. గత ప్రభుత్వంలో అక్రమాలకు రాచబాట వేశారు. గతంలో చేపట్టిన ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం ఇప్పటికీ పూర్తికాలేదు. బిల్లులు మాత్రం పెద్దఎత్తున డ్రా చేసుకున్నారు. ఫీజుల విషయంలో డీడీలు క్లోనింగ్ చేసి దారుణమైన దోపిడీకి పాల్పడ్డారు. ఎగ్జామినేషన్ ఫీజుకు ఇచ్చిన ఒకే డీడీని పదిహేను కాలేజీలకు అదే నెంబరుతో సబ్‌మిట్ చేశారు. సీనియర్లను పక్కనబెట్టి చాలామంది జూనియర్లకు ప్రమోషన్లు ఇస్తున్నారు. ఈ అక్రమాలపై చర్యలు తీసుకోండి” అని ఎమ్మెల్యే బలరామకృష్ణ ఐటీ మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు.



## ఈ పిల్లలు మనల్ని చూసి

# ఏం నేర్చుకుంటారు!?

- భయం, బాధతో చలించిపోయిన సభాపతి
- వైసీపీ నేతల దిగజారుడు తీరుపై మనస్తాపం
- మంటగలిసిన సభా మర్యాదపై ఆందోళన
- ఒక తండ్రిలా ఆలోచిస్తూ బాధపడిన అయ్యన్న
- స్పీకర్ వేదనపై లోతుగా ఆలోచిస్తోన్న రాష్ట్ర ప్రజలు

అమరావతి (చైతన్యరథం): స్పీకర్‌గా సభను హుందాగా నడపడం ఆయన బాధ్యత. కానీ వైసీపీ సభ్యులు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటూ సభా మర్యాదలను కాలరాస్తుంటే అయ్యన్నపాత్రుడు అనుభవించిన మనోవేదన వర్ణనాతీతం. “పసిపిల్లల మనసుల్లో చట్టసభలంటే చులకనభావం ఏర్పడితే, దాన్ని మళ్లీ మార్చలేం” అని ఆయన అన్నప్పుడు, వ్యవస్థ కూలిపోతుందన్న ఒక రకమైన ‘భయం’ మరియు ‘బాధ’ ఆయన మాటల్లో స్పష్టంగా కనిపించాయి. జీతభత్యాల కోసం వచ్చి... అలా వికృతంగా ప్రవర్తించి వెళ్లిపోయిన వైసీపీ సభ్యుల నుద్దేశించి... ఈ రోజు సభకు రాకున్నా “ఆత్మవిమర్శ చేసుకోండి” అని చెప్పడంవెనుక ఒక పెద్దరికం ఉంది. అది కేవలం రాజకీయ విమర్శ కాదు, సభ్యులలోని మానవత్వాన్ని మేల్కొలిపే ప్రయత్నం. సభలో మనం ప్రదర్శించే అహంకారం, బయట మనల్ని చూసే సమాజం దృష్టిలో మనల్ని ఎంత చిన్నవారిని చేస్తాయో ఆయన గుర్తు చేశారు.

బయట నుంచి వచ్చిన విద్యార్థులు క్రమశిక్షణతో కూర్చుని చూస్తూ ఉంటే, లోపల ఉన్న వైసీపీ ‘పెద్దలు’ విచ్చలవిడిగా ప్రవర్తించడం చూస్తే..ఎవరికి క్రమశిక్షణ అవసరమో అర్థమవుతోంది. అసెంబ్లీని ఒక వీధి పోరాటంగా మార్చేసి, “మేము ఇలాగే ఉంటాం” అన్నట్లుగా వైసీపీ నేతలు వ్యవహరించడం వారి రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం.

అత్యంత అనుభవజ్ఞుడైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తన కొడుకును లిక్కర్‌స్కాములో మందలించలేని అశక్తత ఉండవచ్చు. కానీ కొడుకు అడ్డంగా దొరికిపోయి జైలులో ఉండి బెయిలు మీద వచ్చాడు. తట్టుకోలేని తండ్రిగా ‘అత్త మీద కోపం దుత్త మీద’ అన్నట్లుగా... నిన్న ఒక ఆకు రౌడీలా సభలో గవర్నర్ ప్రసంగం ప్రతిని చింపి దూసుకుని వెళ్లి తన కోపాన్ని చల్లార్చుకున్నాడు. అవమానపడిన తండ్రి అక్కసు, వైసీపీ సభ్యుల వికృత ప్రవర్తన అక్కడకు వచ్చిన పిల్లల మనసుల్లో ముద్రపడి ఉంటాయి. దానిని గమనించి సున్నిత మనస్కుడైన అయ్యన్న పడిన ఆవేదన ఆంధ్ర రాష్ట్ర ప్రజలను ఆలోచింపజేస్తోంది.

# ట్రిపుల్ ఐటీలకు మహర్దశ

- పూర్తిస్థాయి సౌకర్యాల కల్పనకు కృషిచేస్తున్నాం
- సాస్కీ పథకం కింద నిధులు రాబట్టే ప్రయత్నం
- పుట్టపర్తి ట్రిపుల్ ఐటీ ఏర్పాటుపై సీఎంతో చర్చిస్తా
- సభ్యుల ప్రశ్నలకు సమాధానమిచ్చిన ఐటీ మంత్రి లోకేష్

అమరావతి (చైతన్య రథం): “రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటిల్లో శాశ్వత సదుపాయాలకు అవసరమైన నిధుల కోసం ఆర్థిక మంత్రితో మాట్లాడాం. ఇందుకోసం కేంద్రం కొత్తగా సాస్కీ స్కీమ్ తీసుకొచ్చింది. డీపీఆర్‌లు తయారుచేసి సాస్కీ కింద నిధులు రాబట్టేందుకు కృషిచేస్తున్నాం”అని రాష్ట్ర విద్య, ఐటీ,ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు అవకాశాలపై ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. “ఏపీలో ప్రస్తుతం ట్రిపుల్ ఐటీలకు సంబంధించి 4 ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లు పనిచేస్తున్నాయి. నూజివీడు క్యాంపస్‌లో పర్మినెంట్ ఫెసిలిటీస్ పూర్తిచేయడానికి రూ.60కోట్లు, అరకు వ్యాలీలో రూ.40 కోట్లు, ఒంగోలు క్యాంపస్‌కు రెండు విడతలకు కలిపి రూ.600 కోట్లు, శ్రీకాకుళం క్యాంపస్ పూర్తికి రూ.300 కోట్లు నిధులు అవసరం. ఏ జిల్లాలో ట్రిపుల్ ఐటీ చదివే పిల్లలు అక్కడే పూర్తి చేయాలన్నది మా ఆలోచన. టెంపరరీ అకాడమీ కోసం వేర్వేరు జిల్లాలకు పంపాల్సి వస్తోంది. కేంద్రం నుంచి నిధులు తెచ్చి శాశ్వత సౌకర్యాలను కల్పించి... ఏ క్యాంపస్‌లో పిల్లలు చేరారో అదే క్యాంపస్‌లో కోర్సు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటాం” అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# మా లక్ష్యం.. యువతకు ఉపాధి

- ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం
- ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది..
- విశ్వసనీయ కంపెనీలకే రూ.99 పైసలకు భూ కేటాయింపులు
- ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉద్యోగాల కల్పన
- భూ కేటాయింపుల్లో లాలూచీ పడాల్సిన అవసరం లేదు
- విమర్శించాలనుకుంటే కప్ టీ గురించి నన్ను విమర్శించండి
- అంతకుమించి ఎక్కువ తీసుకునివుంటే నిరూపించాలి
- అప్పుడు ఎలాంటి చర్యలకైనా నేను సిద్ధం
- వైసీపీకి ధీటైన సమాధానమిచ్చిన మంత్రి నారా లోకేష్
- ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో వాడీ వేడి చర్చ
- మండలి నుంచి వైసీపీ సభ్యుల వాకౌట్

అమరావతి(చైతన్య రథం): "యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99 పైసలకు భూములు కేటాయించాం. ఐదు కంపెనీల ద్వారా 65వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. భూముల కేటాయింపుల్లో మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు. విమర్శించాలనుకుంటే కప్ టీ గురించి విమర్శించవచ్చు. ఒక కప్పు కాఫీకంటే నేను వారివద్ద ఏం తీసుకున్నట్టు అనిపించినా నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా సిద్ధం" అని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. పరిశ్రమలకు 99 పైసలకే భూ కేటాయింపులపై ప్రశ్నోత్తరాల సమయంలో మండలిలో వాడీవేడి చర్చ జరిగింది. వైసీపీ సభ్యుల ఆరోపణలకు మంత్రి ధీటుగా సమాధానమిచ్చారు. గత 20 నెలల కాలంలో పరిశ్రమలు,వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థలకు 99పైసలకు కేటాయించిన భూముల వివరాలు, కుదుర్చుకున్న ఎంవోయిలు, పరిశ్రమల వారీగా భూముల కేటాయింపులు, ధరల వివరాలపై శాసన మండలిలో వైసీపీ సభ్యులు తూమాటి మాధవరావు, వరుదు కల్యాణి, డా.పండుల రవీంద్రబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. "రాష్ట్రంలో 5 కంపెనీలకు 99పైసలకు భూమి కేటాయించాం. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, కాగ్నిజెంట్, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్, రహేజా, మదర్సన్ ఇంటర్నేషనల్ కంపెనీలకు 99 పైసలకే మొత్తం భూములు కేటాయించాం. ఏయే కంపెనీ ఎన్ని ఉద్యోగాలు కల్పించనుందో కూడా ప్రభుత్వ సమాధానంలో పొందుపర్చాం. కాగ్నిజెంట్‌కు భూమి కేటాయించినప్పుడు 8వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. కానీ భూమిపూజ సమయంలో 25వేల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. ఎనర్జీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఐఎన్ఐ, ఐటీ అండ్ కామర్స్, ఏపీసీఆర్డీయే, టూరిజం, ఫుడ్ ప్రాసెసింగ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, టెక్స్ టైల్, ఎడ్యుకేషన్, హెల్త్ పాలసీల కింద ఆయా సంస్థలకు భూములు కేటాయించడం జరిగింది. ఐదు కంపెనీలకు మాత్రమే 99 పైసలకు భూములు కేటాయించాం" అని మంత్రి పునరుద్ఘాటించారు.

### పరిశ్రమలకు భూ కేటాయింపుపై వాడీ వేడి చర్చ

విశాఖలో కోట్లాది రూపాయల విలువైన భూములను 99 పైసలకే ప్రైవేటు సంస్థలకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు ఎలా కేటాయిస్తారంటూ వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ, ఇతర వైసీపీ సభ్యులు మాధవ రావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. దీనిపై మంత్రి నారా లోకేష్ ధీటుగా సమాధానమిస్తూ.. "హైదరాబాద్ లో రహేజా మైండ్ స్పేస్‌కు ఆనాడు 97 ఎకరాలను చంద్రబాబు కేటాయించారు.వారు 21బిల్డింగ్‌ల ద్వారా 10వేల మిలియన్ స్క్వేర్ ఫీట్ నిర్మాణం చేశారు. నేడు ఒక్క మైండ్ స్పేస్‌లోనే ఐటీ రంగంలో లక్షమంది పని చేస్తున్నారు. అనేక ప్రముఖ కంపెనీలు అక్కడ కొలువుదీరాయి. రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలు జీసీసీలకు అవసరమైన భవనాలు నిర్మించి అద్దెకు ఇవ్వడం జరుగుతుంది.వారు ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తారు. వారికి పారదర్శకంగా భూములు కేటాయించాం. బెంగళూరులో ఏఎన్ఎస్ఆర్ సంస్థ నిర్మించిన జీసీసీ సెంటర్‌ను నేను స్వయంగా చూశా. ఈ ఒక్క కంపెనీ 150 జీసీసీ లను నిర్మించింది. సుమారు లక్షా 40వేలమంది ఆయా జీసీసీల్లో పనిచేస్తున్నారు. భూముల కేటాయింపు విష యంలో ప్రతి కంపెనీని అధికారుల కమిటీ, ఎస్ఐపీబీ, మంత్రుల సంఘం క్షుణ్ణంగా సమీక్షించడం జరుగు తుంది. అనంతరం కేబినెట్ ఆమోదంతో భూములను కేటాయిస్తున్నాం" అని సమాధానమిచ్చారు.

### క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే భూ కేటాయింపు

"గతంలో 99 పైసలకే వేరే కంపెనీకి భూమి ఇచ్చినట్టు ఆరోపించారు. నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ చేస్తే పారిపోయారు. క్రెడిబులిటీ ఉన్న కంపెనీలకే 99 పైసలకు భూములు ఇస్తున్నాం తప్ప.. ఆయారాం గయారాం కంపెనీలకు ఇచ్చేందుకు సిద్ధంగా లేం. అంతకుముందు వైసీపీ సభ్యుల తీరును మంత్రి అచ్చెన్నాయుడు తప్పుబట్టారు. పరిశ్రమలకు భూ కేటాయింపులపై చర్చకు సిద్ధమని, ప్రశ్నోత్తరాలు గంటలోనే ముగించాలని నిర్ణయం తీసుకున్నందున బీఏసీలో చర్చించి ఈఅంశంపై లఘు చర్చ చేపట్టాలని చెప్పారు. ప్రశ్నకు సంబంధం లేనివి అడగడంవల్ల సమయం వృధా అవుతోందన్నారు.

### వైసీపీ పిల్‌పై కోర్టు మొట్టికాయలు

మంత్రి లోకేష్ సమాధానంపట్ల వైసీపీ సభ్యులు అభ్యంతరం లేవనెత్తారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. "టీసీఎస్, కాగ్నిజెంట్, మదర్సన్, రహేజా, ఏఎన్ఎస్ఆర్ సంస్థలకు భూములు ఇవ్వకూడదా అని ప్రశ్నించారు. భూముల కేటాయింపుపై వైసీపీనే కోర్టుల్లో పిల్ వేయించారని, కోర్టు కూడా మొట్టికాయలు వేసిందని గుర్తు చేశారు. విశాఖలో రహేజా రియల్ ఎస్టేట్ సంస్థకు 99 పైసలకే 27.1 ఎకరాలను ఎలా కేటాయిస్తారని వైసీపీ సభ్యులు మాధవరావు, వరుదు కల్యాణి ప్రశ్నించారు. అడ్రస్‌లేని ఉర్సా కంపెనీకి 99 పైసలకే భూములు కట్టబెట్టాలని ప్రయత్నించారని ఆరోపించారు. వైసీపీ సభ్యుల ఆరోపణలను మంత్రి లోకేష్ ధీటుగా తిప్పికొట్టారు. తాము 5 కంపెనీలకే 99 పైసలకు భూములు కేటాయించామని, ఆరో కంపెనీ పేరు ప్రస్తావించినందున ఆధారాలు బయట పెట్టాలని, ఆరోపణలు చేసి బయటకు వెళ్లడం కాదని సవాల్ చేశారు. లేనిపక్షంలో తమ ప్రకటనను ఉపసంహరించుకోవాలని మంత్రి లోకేష్ పట్టుబట్టారు. ఉర్సాకు తాము ఎలాంటి భూములు కేటాయించలేదని మరోసారి స్పష్టం చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే పరిశ్రమలకు తక్కువ రేటుకు భూములు ఇస్తున్నామని చెప్పారు. ఉర్సా విషయంలో వైసీపీ సభ్యుల ఆరోపణలను నిరూపించాలని సవాల్ చేశారు.

### లెక్కల్లోకి వెళితే 151కాస్తా 11 అయ్యాయి

వైసీపీ సభ్యుల అరుపులనేపథ్యంలో మంత్రి లోకేష్ జోక్యం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ సభ్యులు వినేందుకు ఓపిక పడితే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నాం. వైసీపీ సభ్యులు ఎందుకు అరుస్తున్నారు.సమాధానం చెప్పాలా, వద్దా? నేడు దేశానికి వస్తున్న రూ.100 పెట్టుబడుల్లో 25.3రూపాయలు ఏపీకి వస్తున్నాయ న్నారు. వైసీపీ సభ్యులు అరుపులపై స్పందిస్తూ.. లెక్కల్లోకి వెళితే 151 కాస్తా 11 అయ్యాయి. టీం 11 తయారైంది. దీనిపైనా చర్చిద్దామా? 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వం ఏవిధంగా వ్యవహరించిందో చూశాం. రాష్ట్రంలో ఆర్థిక ఉగ్రవాదం నడిచింది. అమర్ రాజాను రాష్ట్రంనుంచి తరిమేశారు. ఆర్సెల్లార్ మిట్టల్ ఎక్కడికీ వెళ్లలేదు. వైసీపీ సభ్యులు వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదు. ఆర్సెల్లార్ మిట్టల్ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రకు వస్తుంది.మేం భూములు కేటాయించాం. పర్యావరణ అనుమతులు వచ్చాయి. 17 నెలల్లోనే మేం వారిని రాష్ట్రానికి తీసుకువచ్చాం. దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ రాబోతోంది. విశాఖలోనే రెండో స్టీల్ ప్లాంట్‌ను నిర్మించబోతున్నాం. వైసీపీ సభ్యులు ఎందుకు కంగారు పడుతున్నారు. అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతాం. మాధవరావుకి కొంచెం బీపీ ఎక్కువైంది. బీపీ బిళ్లలు ఇవ్వండి. అప్పుడే కామ్‌గా ఉంటారు" అంటూ మంత్రి లోకేష్ హుందాగా చమత్కరించారు.

### ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది

"ఏపీకి పరిశ్రమలు రాకూడదనే లక్ష్యంతో వైసీపీ ఉంది. పరిశ్రమలను తరిమేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. టీసీఎస్‌కు భూమి ఇవ్వడం తప్పా? అని నేను సూటిగా ప్రశ్నిస్తున్నా. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా భూములు కేటాయిస్తున్నాం. పక్క రాష్ట్రాలతో పోటీ పడాల్సిన అవసరం ఉంది. విశాఖలో ఐటీ ఎకో సిస్టమ్ లేదు. ఇది నిజం. వైసీపీ ఐదేళ్లకాలంలో విశాఖకు ఒక్క పరిశ్రమ కూడా తేలేదు. మేం 18 నెలల్లోనే అనేక పరిశ్రమలను విశాఖకు తీసుకువచ్చాం.విశాఖలో మౌలిక సౌకర్యాల కల్పనకు కృషిచేస్తున్నాం. ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 1994–2004 మధ్య చంద్రబాబు అతితక్కువ ధరకు ఆనాడు హైదరాబాద్‌లో భూములు కేటాయించారు. అందుకే ఐఎస్‌బీ, మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్, టీసీఎస్ హైదరాబాద్‌లో ఉన్నాయి. నేడు హైదరాబాద్ జీసీసీ కేపిటల్ అయ్యిందంటే దానికి కారణం ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడం వల్లే"నని మంత్రి లోకేష్ విస్పష్టంగా చెప్పారు.

### యువతకు ఉద్యోగ కల్పన లక్ష్యం మాది

"ఏపీఐఐసీని కాదని రియల్ ఎస్టేట్ సంస్థలకు ఎందుకు భూములు కేటాయిస్తున్నారన్న వైసీపీ సభ్యుల ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. "ఆనాడు పశ్చిమ బెంగాల్‌లో టాటా నానో ఫ్యాక్టరీని తరిమేశారు. దీంతో ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ 99 పైసలకే భూమి ఇస్తామని ఆఫర్ చేయడంతో ఆ ఫ్యాక్టరీని గుజరాత్‌కు తీసుకెళ్లారు. దీంతో మొత్తం ఎకో సిస్టమ్ ఏర్పడింది. దానిని ఆదర్శంగా తీసుకుని విశాఖను ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. ఏపీఐఐసీ ఎప్పుడూ ఐటీ భవనాలు నిర్మించలేదు. మిలీనియం టవర్స్ ఒక్కటే నిర్మించారు. ఆ భవనాన్ని ఇప్పటికే లీజ్‌కు ఇవ్వడం జరిగింది. లీజ్‌వల్ల వచ్చే ఆదాయం చాలా తక్కువ. అందుకే భూమిని అభివృద్ధికి ఇవ్వాలని పాలసీగా పెట్టుకున్నాం. యువతకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో మేం పనిచేస్తున్నాం. ప్రభుత్వానికి రెండు రూపాయలు ఆదాయం తగ్గినా ఫర్వాలేదు. ఇచ్చిన హామీ ప్రకారం 20లక్షల ఉద్యోగాలు మేం కల్పిస్తాం. ఇది మా విధానం. ఆదాయం ఎక్కువ కావాలనుకుంటే అది మీ పాలసీ. ఉద్యోగాల కల్పన అనేది మా ప్రభుత్వ పాలసీ. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌లను అభివృద్ధి చేస్తాం. ప్రైవేట్ పార్క్‌లను కూడా ప్రోత్సహిస్తాం. సత్వా గ్రూప్ విషయానికి వస్తే.. ఒక్కసారి హైదరాబాద్ వెళ్లి చూడాలి. ఇవన్నీ క్రెడిబులిటీ ఉన్న కంపెనీలు. ఐదారు రాష్ట్రాల్లో అభివృద్ధి చేస్తున్నారు. గ్రేడ్-ఏ ఐటీ ఆఫీస్ కార్యాలయాలు నిర్మిస్తారు. దీంతో ఎకో సిస్టమ్ ఏర్పడుతుంది. అప్పుడే జీసీసీలు వస్తాయి. విశాఖలో గ్రేడ్-ఏ ఐటీ ఆఫీస్ స్పేస్ లేదు" అని లోకేష్ వివరించారు.



### విశ్వసనీయత ఉంటేనే.. భూకేటాయింపులు

"మొదట దావోస్ సమావేశంలో నేను కాగ్నిజెంట్ సీఈవో రవిని కలిసినప్పుడు 99 పైసలకే భూమి ఇస్తానని కమిట్ అయ్యాను. ఇది నా టెక్నిక్. మొన్నటి దావోస్‌కు వెళ్లినప్పుడు విశాఖలో ఎకో సిస్టమ్ అభివృద్ధిపై అడిగారు. ఐటీ కంపెనీలను తీసుకురావడమే కాదు, మొత్తం ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తేనే ఇవి సస్టైన్ అవుతాయి. విశ్వసనీయత ఉన్న కంపెనీలకే రూ.99 పైసలకు భూములు కేటాయించాం. మరిన్ని కంపెనీలను తీసుకువస్తాం. ఇప్పటికే ఐదేళ్లు నష్టపోయాం. 18 నెలల్లో ఎవరూ ఊహించని విధంగా పెద్దపెద్ద కంపెనీలను తీసుకువచ్చాం. 99పైసలకే భూములు కేటాయించిన ఐదు కంపెనీలు 65వేల మందికి ఉద్యోగాలు కల్పించబోతున్నాయి. విశాఖలో ఒక్క ఐటీ రంగం ద్వారా 2029నాటికి 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇవన్నీ వైసీపీకి నచ్చకపోవచ్చు" అని లోకేష్ ఎద్దేవా చేశారు.

### విశాఖలో ఐదు లక్షల ఐటీ ఉద్యోగాల కల్పన లక్ష్యం

భూ కేటాయింపుల్లో పారదర్శకత లేదని, విశాఖలో వారి కుటుంబానికి ఏవిధంగా భూములు కేటాయిస్తారంటూ విపక్ష నేత బొత్స ప్రశ్నించారు. ఇందుకు నిరసనగా సభనుంచి వాకౌట్ చేశారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ.. ఐదు కంపెనీలకు మాత్రమే మేం 99 పైసలకు భూములు కేటాయించాం. ఉర్సాకు భూముల కేటాయింపై ఛాలెంజ్ చేస్తే సమాధానం చెప్పలేదు. ఇంకొకరికి ఎవరికో భూమి ఇచ్చారన్నారు. అసలు కేటాయింపే జరగలేదు. వాకౌట్ చేస్తారు. విపక్ష నేతలు సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారు. ఒక్క ఐటీ ఉద్యోగంవల్ల ఐదారుగురికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. 65వేల ఐటీ ఉద్యోగాలవల్ల సుమారు మూడున్నరనుంచి నాలుగున్నర లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. 50వేల ఐటీ ఉద్యోగాలు రావడంవల్ల సిటీలో డైరెక్ట్‌గా సుమారు బిలియన్ డాలర్లు ప్రతి ఏడాది ఎకానమీ వస్తుంది. మా లక్ష్యం 5 లక్షల ఐటీ ఉద్యోగాలు. తద్వారా 10 బిలియన్ డాలర్ల మేర ఎకనామిక్ యాక్టివిటీస్ విశాఖలో జరగాలనేది లక్ష్యం" అని పేర్కొన్నారు.

### కప్ టీ గురించి నన్ను విమర్శించవచ్చు

"వైసీపీ సభ్యులు ఎందుకు వాకౌట్ చేశారో అర్థం కాలేదు. బొత్సకు అదొక ఫ్యాషన్. ఈ తలుపు నుంచి వచ్చి ఆ తలుపునుంచి వెళతారు. మేం చాలా పారదర్శకంగా భూ కేటాయింపులు చేశాం. వారి దగ్గర నుంచి ఏం తీసుకున్నానని ఆరోపించారు. నన్ను విమర్శించాలనుకుంటే ఒక్క విషయంలో విమర్శించవచ్చు. టాటా సన్స్ ఛైర్మన్ చంద్ర ఒకసారి కలవాలని అడిగారు. నేను బాంబే హౌస్‌కు వెళ్లాను. బాంబే హౌస్‌లో కప్ టీ ఇచ్చారు. నన్ను విమర్శించాలనుకుంటే కప్ టీ గురించి విమర్శించవచ్చు. నో ప్రాబ్లమ్. కాగ్నిజెంట్ విషయంలో కూడా నన్ను విమర్శించవచ్చు.వాళ్లు నాకు ఓ కప్ కేక్ ఇచ్చారు. దావోస్‌లో వారి ఆఫీసుకు వెళ్లినపుడు ఆ రోజు నా పుట్టినరోజు. వారు మర్యాద పూర్వకంగా కప్ కేక్‌లో క్యాండిల్ పెట్టి నాతో బ్లో చేయించారు. సింపుల్. అంతేగానీ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారు.ఉద్యోగాలు కల్పించాలనేది మా లక్ష్యం. మేం ఎక్కడా లాలూచీ పడాల్సిన అవసరం లేదు. ఒక్క కియా పరిశ్రమవల్ల ఆ ప్రాంత రూపురేఖలు మారాయి. క్లస్టర్ విధానంలో మేం ముందుకు వెళ్తున్నాం. మేం ప్రతి పరిశ్రమను గ్రౌండింగ్ చేస్తాం. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఒక కప్పు కాఫీ కంటే నేను వారి వద్ద ఎక్కువ తీసుకుని ఉంటే నిరూపించాలి. అప్పుడు ఏ చర్యకైనా నేను సిద్ధం" అని మంత్రి లోకేష్ ఛాలెంజ్ చేశారు. వైసీపీ సభ్యులు ఆరోపణలు చేసి పారిపోవడం సరికాదని మంత్రి ఎద్దేవా చేశారు.

# స్వామి మొక్కు తీర్చుకున్నా..!

- సీఎం చంద్రబాబును కలిసిన సినీ నిర్మాత బండ్ల గణేష్
- తిరుమల పాదయాత్రను వివరించిన వైనం.
- సంతోషంగా ఆలింగనంతో సత్కరించిన చంద్రబాబు
- ఉండవల్లిలో ఐటీ మంత్రి లోకేష్‌నూ కలిసిన బండ్ల





అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో సినీ నిర్మాత బండ్ల గణేష్ గురువారం కలిశారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై 2023లో అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపింది. సీఎం చంద్రబాబు జైలునుంచి విడుదలై ముఖ్యమంత్రి అయితే తిరుమలకు పాదయాత్రగా వస్తానని బండ్ల గణేష్ అప్పట్లో మొక్కుకున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం సాధించి చంద్రబాబు నాల్గవసారి సీఎం అయ్యారు. సంకల్ప యాత్ర పేరిట షాద్‌నగర్ ఇంటినుంచి జనవరి 19న పాదయాత్ర చేపట్టి ఈ నెల 10న బండ్ల గణేష్ తిరుమలకు చేరుకున్నారు.

23 రోజులపాటు 535 కి.మీమేర పాదయాత్ర సాగింది. రెండ్రోజుల క్రితం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని బండ్ల గణేష్ మొక్కును చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు.

తిరుమల నుంచి తీసుకువచ్చిన శ్రీవారి ప్రసాదాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. బండ్ల గణేష్‌ను సీఎం చంద్రబాబు ఆత్మీయంగా పలకరించి ఆలింగనం చేసుకున్నారు. పాదయాత్ర సాగిన తీరును సీఎంతో బండ్ల గణేష్ పంచుకున్నారు. దారి పొడవునా పార్టీ కార్యకర్తలు అండగా నిలిచి తనతో నడిచారని, వారి ప్రోత్సాహంతో తాను మరింత ఉత్సాహంగా పాదయాత్ర చేస్తూ తిరుమలకు చేరుకున్నానని బండ్ల గణేష్ తెలిపారు.

**మంత్రి లోకేష్‌నూ కలిసిన వైనం**

అనంతరం ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ మంత్రి లోకేష్‌ను నిర్మాత బండ్ల గణేశ్ కలిశారు. పాదయాత్ర సాగిన తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు. శ్రీవారి ప్రసాదం స్వీకరించారు.

# ఆత్మీయ కలయిక.. ఇల్లే వేదిక





- విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సరికొత్త సంప్రదాయం
- పార్లమెంటు వారీగా ప్రజాప్రతినిధులు, కుటుంబాలకు విందు
- మచిలీపట్నం పార్లమెంటు ప్రజాప్రతినిధులు, కుటుంబాలతో ముచ్చట్లు
- ఆడపడుచులకు మంగళగిరి పట్టుచీరలు పెట్టిన వైనం
- ప్రజాప్రతినిధుల వినతుల తాజాస్థితిపై నివేదిక అందచేత

అమరావతి (చైతన్యరథం): పార్లమెంటు నియోజక వర్గాలవారీగా కూటమి ప్రజా ప్రతినిధులను కుటుంబ సభ్యులతో తన ఇంటికి ఆహ్వానించి, ఆహ్లాదకర వాతావరణంలో విందు ఏర్పాటుచేసి... మాటలు, ముచ్చట్లతో గడిపే సరికొత్త సంప్రదాయానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శ్రీకారం చుట్టారు. గురువారం రాత్రి ఆయన మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని కూటమి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కుటుంబసభ్యులను తన ఇంటికి విందుకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా పండగ వాతా వరణం నెలకొంది. అంతా ఒకేచోట కూర్చుని భోజనం చేశారు. ప్రజాప్రతినిధుల కుటుంబసభ్యులందరినీ పేరుపేరునా పలకరించిన లోకేష్... ఎలా ఉన్నారు? ఏం చేస్తున్నారు? అంటూ ఆత్మీయంగా మాటలు కలిపారు. ఎటువంటి రాజకీయ చర్చలకూ తావు లేకుండా పూర్తిగా కుటుంబంలో జరిగే శుభకార్యంలా నిర్వహించారు. తన ఇంటికి వచ్చిన ఆడపడుచులకు లోకేష్ తన నియోజకవర్గం మంగళగిరి చేనేత కళాకారులు నేసిన పట్టుచీరలను బహూకరించారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల అభివృద్ధి, వివిధ సమస్యలపై తనకు ఇచ్చిన వినతుల తాజా స్థితి ఏమిటో తెలియజేస్తూ మంత్రి లోకేష్ వారికే నివేదిక రూపంలో అందించారు. ఇందులో తాను పరిష్కరించినివి, పరిష్కార దశలో ఉన్నవి, చేయలేకపోయినవి.. కారణాలు పేర్కొంటూ ఇచ్చిన నివేదికను చూసి ప్రజాప్రతినిధులు ఆశ్చర్యపోయారు. ఇంత ట్రాన్సపరెన్సీ రాజకీయాల్లో చూడటం ఇదే మొదటిసారి అంటూ తమ సహచరులకు చెబుతూ సంతోషం వ్యక్తం చేశారు. కుటుంబ విలువలకు అత్యంత ప్రాధాన్యమిచ్చే తెలుగుదేశం పార్టీ కార్యకర్త నుంచి నాయకుడి వరకూ అందరినీ కుటుంబ సభ్యులుగా భావిస్తుంది. ఎన్టీఆర్‌తో మొదలైన ఈ సంప్రదాయాన్ని చంద్రబాబు మరోస్థాయికి తీసుకెళ్లారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నారా లోకేష్ ప్రజాప్రతినిధుల కుటుంబాలను ఇంటికి పిలిచి గౌరవించి పంపించే సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు.

పార్లమెంటు సమావేశాల్లో ఉండటంతో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి (జనసేన), అమెరికా పర్యటనలో ఉన్న కారణంగా గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆత్మీయ కలయికకు హాజరు కాలేదు. మంత్రి, మచిలీపట్నం ఎమ్మెల్యే కొల్లు రవీంద్ర, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ (జనసేన), పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కుటుంబసభ్యులతో తరలివచ్చి ఆనందంగా గడిపారు.










## సరస్వతీ నిలయంపై

# సైకో మూకల విషం!

## గీతం వర్సిటీ భూములపై ఆరోపణలు - వాస్తవాలు

అమరావతి (చైతన్య రథం): ప్రముఖ పారిశ్రామిక వేత్త దివంగత ఎమ్.వి.వి.ఎస్ మూర్తి 1980లో గీతం ఇంజనీరింగ్ కళాశాలను మహాత్మాగాంధీ పేరిట విశాఖలో ప్రారంభించారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటైన మొదటి ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలగా నాణ్యతా ప్రమాణాలతో గీతం పేరు సాధించింది. కళాశాల విస్తరణ నిమిత్తం 1981లో విశాఖ శివారు ప్రాంతంగా కొండలతో, గుట్టలతో ఉన్న రుషికొండ సమీపాన భూములను అప్పటి కలెక్టర్ అనుమతితో మార్కెట్ ధరకు కొనుగోలు చేశారు. ఇందులో కొంత జిరాయితీ భూమి, కొంత ప్రభుత్వ డి-ఫామ్ భూమి ఉన్నాయి. ప్రభుత్వ రికార్డులలో సహితం ఈ వివరాలు నమోదయ్యాయి. కేవలం విద్యా అవసరాల కోసం వినియోగించే విధంగా 1996లో రాష్ట్ర ప్రభుత్వం 71 ఎకరాలకు ఎలివేషన్ జిఓను ఇచ్చింది. దీనికిగాను నాటి ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఎకరా భూమికి రూ.16,000 నుంచి రూ.18,000 వేల వరకు గీతం చెల్లించింది. ఈ లావాదేవీలపై స్పష్టమైన ప్రభుత్వ జిఓలు, రికార్డులు ఉన్నాయి. 2004లో అప్పటి ప్రభుత్వం రుషికొండ ప్రాంతంలో సర్వేలు నిర్వహించి 14 ఎకరాలు అదనపు భూమి ఉన్నట్లుగా, ముఖ్యంగా అభూమి కొండ వాలు, చిన్న చిన్న బిట్ల రూపంలో వేలానికి సహితం పనికిరాని విధంగా ఉన్నట్టు గుర్తించారు.

### 20ఏళ్ల క్రితమే ప్రభుత్వానికి గీతం దరఖాస్తు

దీనికి సంబంధించి ఎండాడలో సర్వే నెంబర్లు 16, 17, 18, 20 మరియు రుషికొండ వద్ద సర్వే నెంబర్లు 37, 38లలో ఈ అదనపు భూమిని గుర్తిస్తూ నాటి కలెక్టర్ ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై సిసిఎల్ఎ స్థాయిలో మూడు విడతలుగా సమావేశం నిర్వహించింది. విద్యా సంస్థ అవసరాలకు ఈ భూమిని మార్కెట్ ధరకు కేటాయించాల్సిందిగా గీతం అప్పట్లోనే విజ్ఞప్తి చేసింది. ఇదే సమయంలో కొంతమంది ప్రవేటు వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి పట్టా భూమి అంటూ కోర్టును ఆశ్రయించారు. అలాగే నకిలీ డాక్యుమెంట్లతో డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు చేశారు. దీనిపై లోతుగా పరిశీలించిన కోర్టు.. సుధాకర్ రాజు అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్లతో వేసిన కేసును కొట్టి వేసింది. ఈ అంశంపై సిఐడి విచారణ అనంతరం ఒక ఎస్ఆర్‌ను సస్పెండ్ చేయడంతోపాటు పలువురిని అరెస్టు చేయడం జరిగింది. అదే సమయంలో కొందరు వ్యక్తులు ఎండాడ సర్వే నెంబర్ 15లో తమ పూర్వీకుల ఆస్తి అంటూ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. ఈ తరహా ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఎలివేషన్ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఈ పరిస్థితిని గమనించి 2012లో అప్పటి కలెక్టర్ ఐదు విడతలుగా తనిఖీలు జరిపి ఎండాడ సర్వే నెంబర్ 15లో సుమారు 24 ఎకరాలు, రుషికొండ సర్వే నెంబర్లు 37, 38 లలో సుమారు 12 ఎకరాల భూమి చిన్న చిన్న బిట్లుగా ఉందని, దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని సూచించారు.

### విద్యాసంస్థ విస్తరణకు వరుస విజ్ఞాపనలు

అప్పటికి నగర శివారు ప్రాంతమైన రుషికొండ పరిసరాలలో క్రమేపీ వృద్ధి చెందుతున్న గీతం కళాశాల ఒకవైపు కొండలు మరోవైపు ప్రభుత్వ భూమి మాత్రమే ఉండటంతో తమ విస్తరణకు అవసరమైన భూములను ప్రభుత్వంనుంచి కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని విజ్ఞప్తి చేసింది. అక్కడక్కడ చిన్న బిట్లుగా ఉన్న 50ఎకరాల భూమిని తాము కొనుగోలు చేస్తామని 2004 నుంచి ప్రభుత్వాలకు ఎప్పటికప్పుడు గీతం విద్యా సంస్థ లిఖిత పూర్వకంగా కోరుతూ వస్తోంది. స్వర్గీయ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్ననాటి నుంచి టిడిపి సహా అన్ని ప్రభుత్వాలకు క్రమం తప్పక గీతం విద్యా సంస్థ విజ్ఞప్తులను పంపుతూ వచ్చింది. గీతం ఇంజనీరింగ్ కళాశాలగా ప్రారంభమై, 2007 నాటికి డీమ్డ్ వర్శిటీగా ఎదగడంతో వివిధ రాష్ట్రాల నుంచి, దేశాలనుంచి వచ్చి ప్రవేశం పొందుతున్న విద్యార్థులతో రాష్ట్రంలోనే అతి పెద్ద విద్యా సంస్థగా రూపుదాల్చింది. దాదాపు 20 వేలమంది విద్యార్థులతో, ఆసుపత్రులతో విస్తరించింది. పెరుగుతున్న విద్యా,వసతి అవసరాల కారణంగా ఇప్పటికీ ప్రభుత్వానికి భూమి విషయంలో విజ్ఞప్తులు చేయడం కొనసాగిస్తోంది.

### ఎన్నడూ ఉచితంగా ఇవ్వమని కోరలేదు

గీతం విశ్వవిద్యాలయం ప్రభుత్వ భూమిని ఉచితంగా ఎప్పుడూ కోరలేదు. ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధరకే కొనుగొలు చేస్తామని, కేవలం విద్యా సంస్థ అవసరాలకి తప్ప వాణిజ్య అవసరాలకు ఉపయోగించమని స్పష్టం చేస్తూ వస్తోంది. నిజానికి గీతం ప్రభుత్వ భూములను కోరడం కొత్త విషయం కాదు. గత 25సంవత్సరాలుగా ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేస్తూ వస్తోంది. 2017 సంవత్సరంలో రాష్ట్ర క్యాబినేట్లో ఒక అంశంగా సహితం చేర్చబడింది. 2019 నుంచి 2024 వరకు గత ప్రభుత్వ కాలంలో మూడు సార్లు జరిపిన తనిఖీలలో ఈ భూములలో ఏ విధమైన నిర్మాణాలు లేవని గుర్తించడం జరిగింది.రాష్ట్రంలో గత 10సంవత్సరాలుగా ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఏర్పాటు అవుతున్న నేపధ్యంలో గీతం విద్యా సంస్థ కేవలం తన విద్యావ్యాప్తికి మరో మారు ప్రభుత్వ భూములను కొనుగోలు చేసే ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచింది.

### విశాఖకే గర్వకారణం గీతం

నాలుగు దశాబ్ధాలకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన గీతం విద్యాసంస్థ లక్షలాది మంది యువతకు బంగారు భవిష్యత్తును అందించింది. ఇంజనీరింగ్ కళాశాల స్థాయి నుంచి దేశంలో ఏ గ్రేడ్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించింది. చదువులు చెప్పడం ఒక్కటే కాకుండా పరిశ్రమలకు కన్సల్టెన్సీ అందించడం, గ్రామీణ యువత, మహిళలకు ఉపాధి అందించే శిక్షణ కార్యక్రమాలు, పరిశోధనలు నిర్వహిస్తోంది. గీతం విద్యాసంస్థను కేంద్రప్రభుత్వం సైంటిఫిక్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(సైరో)గా గుర్తించింది. గీతం విద్యా సంస్థలో వంద కోట్ల రూపాయల వ్యయంతో మూర్తి ప్రయోగ శాలలు ఏర్పాటు అయ్యాయి. వీటికి దేశం నలుమూలల నుంచి శాస్త్రవేత్తలు పరిశోధనలకు హాజర వుతున్నారు. భారత ప్రభుత్వ స్టడీ ఇండియా కార్య క్రమంలో గీతం విద్యాసంస్థ చేర్చబడింది.దాదాపు 500 మంది విదేశీవిద్యార్థులు గీతంలో చదువుకుంటున్నారు.

### ప్రకృతి విపత్తుల్లోనూ గీతం సేవలు

హుద్ హుద్ సమయంలోనే కాక ప్రకృతి విపత్తుల సమయంలో గత ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు గీతం విరాళంగా అందజేసింది. కోవిడ్ -19 సమయంలో గీతం వసతి గృహలను క్వారంటైన్ కేంద్రాలుగా మార్చడంతో పాటు 3 వేల మందికి పైగా విశాఖ ప్రజలకు గీతం ఆసుపత్రి కోవిడ్ చికిత్స కేంద్రంగా అండగా నిలిచింది. విశాఖ నగరంతో పాటు సమీప జిల్లాలలో ఉచిత వైద్య శిభిరాల నిర్వహణతో పాటు 500 వందలకు పైగా కుటుంబాలను గీతం ఆసుపత్రి విద్యార్థులు దత్తతకు స్వీకరించారు. గీతం విశ్వవిద్యాలయాన్ని వ్యవస్థాపకులు ఏనాడు తమ కుటుంబ ఆస్తిగా పరిగణించలేదు. గీతం విస్తరణలో అంతర్జాతీయ ప్రమాణాలను మన విద్యార్థులకు అందించే అంశంలో వ్యవస్థాపకులు నేటికీ నిబద్దతతో వ్యవహరిస్తున్నారు.

### గీతం విద్యాసంస్థపై ఎందుకీ కక్ష?

గీతం విద్యా సంస్థ ప్రారంభించే నాటికి స్వర్గీయ డాక్టర్ ఎమ్.వి.వి.ఎస్ మూర్తి విశాఖలో తొలితరం పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. గీతం ప్రారంభించే సమయంలో ఆయన రాజకీయవేత్త కూడా కాదు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంకంటే ముందు గీతం విద్యా సంస్థ వ్యవస్థాపకులుగా ఆయన విశాఖ ప్రజలకు పరిచయమున్న ప్రముఖులు. గీతం విద్యాలయాన్ని ప్రపంచ శ్రేణి విద్యా సంస్థగా తీర్చిదిద్దడంలో ఆయన పాటించిన ప్రణాళిక కారణంగా విశాఖకు గర్వకారణంగా గీతం అభివృద్ధి చెందింది. గీతం విశ్వవిద్యాలయం నేటికి పాటిస్తున్న ఉన్నత ప్రమాణాలకు గుర్తింపుగా నాక్ ఎం౦ గ్రేడు తో పాటు ఎన్బీఎ గుర్తింపు, టైమ్స్ ప్రపంచ ర్యాంకింగ్లలో స్థానం సంపాధించింది. ఇంజనీరింగ్ విద్యతో పాటు ఆర్కిటెక్చర్, సైన్స్, ఫార్మశీ, మేనేజ్మెంట్, లా, పారామెడికల్ కోర్సులు, దంత వైద్యం, వైద్య విద్యా కోర్సులను నిర్వహిస్తోంది. యుజిసి సహ పలు చట్ట బద్దమైన సంస్థల గుర్తింపుతో గీతం నిర్వహించే వివిధ కోర్సులకు దేశ వ్యాప్తంగా విద్యార్థులు ఆకర్షితులవు తున్నారు. ఇతర రాష్ట్రాలలో ప్రాంగణాలను నెలకొల్ప డానికి ఆయా ప్రభుత్వాలు గీతంను ఆహ్వానించిన సందర్భాలు ఉన్నాయి.

### వసతుల్లేక దూరవిద్యా కేంద్రం మూత

విశ్వవిద్యాలయం విస్తరణకు భూమి కేటాయింపులో తరువాతి కాలంలో విశాఖలో అడుగు పెట్టిన ఇతర విద్యా సంస్థలకు ఇచ్చిన ప్రాధాన్యత గీతంకు ఇవ్వక పోవడం విశాఖ ప్రజలు గమనిస్తున్నారు. గీతంపట్ల ప్రజలలో ముఖ్యంగా యువతలో గల ఆదరణ కారణంగా గీతం విద్యా సంస్థకు అనుబంధంగా ఏర్పాటైన దూర విద్యా కేంద్రం సరైన వసతి సదుపాయం లేకపోవడంతో అర్ధాంతరంగా మూసివేశారు. ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో విశాఖలోని దొండపర్తి ప్రాంతంలో కొంతకాలం తాత్కాలిక వసతితో ఈ కేంద్రాన్ని నిర్వహించారు. విద్యార్థులు సంఖ్య లక్షను దాటిపోవడం సరైనవిధంగా వసతి అందుబాటులో లేకపోవడంతో దూర విద్య కార్యకలాపాలను నిలిపివేస్తూ విశ్వవిద్యాలయం నిర్ణయం తీసుకుంది. గీతం విద్యా సంస్థ సమీపంలోని ఎండాడ గ్రామంలో 2009లో ఏర్పాటైన ఒక విద్యా సంస్థకు 7.35 ఎకరాల భూమిని ప్రభుత్వం ఎకరం 25 లక్షల రూపాయలు చొప్పున విక్రయిస్తూ 20-02-2009న జివోను నాటి ప్రభుత్వం విడుదల చేసింది. అలాగే పలు ప్రైవేటు విద్యా సంస్థలకు తదనంతర కాలంలో భూకేటాయింపులు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో గీతం పరిసరాల్లో 40 ఎకరాల భూమిని తాము స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.800 కోట్ల రూపాయలు అని నాడు వైసీపీ నేతలు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అదే వ్యక్తులు గీతం సంస్థ భూమిని కబ్జా చేసిందని వాటి విలువ రూ.5,000 కోట్ల రూపాయలు అని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. ఎకరం రూ.12 వేలు ఉన్నప్పటి నుంచి గీతం రుషికొండ, ఎండాడ పరిసరాలలోని ప్రభుత్వ భూములను మార్కెట్ రేటుకు కొంటామని విజ్ఞప్తి చేస్తూ వస్తోంది. కేవలం రాజకీయ కారణాలతో ఒక ఉన్నత విద్యా సంస్థ ఎదుగుదలకు అడ్డం పడటం సరైన పద్ధతి కాదు.

# త్వరలో మెస్ ఛార్జీల పెంపు

- బీసీ బిడ్డలకు నాణ్యమైన విద్య, ఆహార భద్రతే లక్ష్యం
- కొత్తగా 10 గురుకులాల ఏర్పాటుకు చర్యలు
- గత పాలనలో ఎంజేపీ స్కూళ్ల మరమ్మతులు పట్టించుకోలేదు
- తాము వచ్చాక డైట్ బకాయిలు రూ.110 కోట్లు చెల్లించాం
- అసెంబ్లీలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



అమరావతి(చైతన్యరథం): బీసీ ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ హాస్టళ్లు..గురుకులాల్లో ఉండే విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మెనూ అందించేలా మెస్ ఛార్జీలు పెంచే ఆలోచన చేస్తున్నామని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవి త తెలిపారు. ఇదే విషయమై నోడల్ శాఖ అయిన సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చర్చలు జరుపుతున్నామని, త్వరలోనే ఛార్జీల పెంపు విషయమై ప్రకటన చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా 10 ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించనున్నామన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా రెండో రోజైన గురువారం ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్ మెస్ ఛార్జీల పెంపుపై ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి అడిగిన ప్రశ్నకు మంత్రి సవిత పైవిధంగా స్పందించారు. రాష్ట్రంలో బీసీ ప్రీ మెట్రిక్ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుతున్న 3, 4 తరగతి విద్యార్థులకు నెలకు రూ.1,150లు, 5 నుంచి 10 తరగతి విద్యార్థులకు రూ.1,400లు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు, గురుకులా ల్లో ఇంటర్, ఇతర ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు రూ.1,600 మెస్ ఛార్జీలు చెల్లిస్తున్నామన్నారు. అన్ని పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు ఒకేలా రూ.1,600 మెస్ చార్జీలు చెల్లిస్తున్నామన్నారు. నోడల్ శాఖ సాంఘిక సంక్షేమ శాఖ మెస్ ఛార్జీ రేట్లు సవరించడం, పెంపు దలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందన్నారు. ఇటీవల సీఎం చంద్ర బాబు ఆధ్వర్యంలో సంక్షేమ శాఖ మంత్రులు, సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు బలవర్ధకమైన ఆహారం అందించాలని ఆదేశించా రు. విద్యార్థుల ఆరోగ్యం మెరుగుదలకు న్యూట్రిషన్ నిపుణులతో చర్చించి మెనూ రూపొందించాలని తెలిపారు. నోడల్ శాఖ ఆధ్వర్యంలో మెస్ ఛార్జీల పెంపుపై త్వరలో నిర్ణయం తీసుకుం టామని తెలిపారు. 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం 66 శాతం మేర మెస్ ఛార్జీలు పెంచిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు.

**రాష్ట్రంలో కొత్తగా 10 గురుకులాల ఏర్పాటు**

ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి అడిగిన మరో ప్రశ్నకు మంత్రి సవిత సమాధానమిస్తూ గత ప్రభుత్వం పెట్టిన రూ.110 కోట్ల రూపాయల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. గత ప్రభుత్వంలో బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో కనీస మరమ్మతులు చేయకపోవడంతో బీసీ బిడ్డలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ హాస్టళ్లు, గురుకులాల మరమ్మతు లకు నిధులు మంజూరు చేశామన్నారు. కొందరు శాసన సభ్యులు తమ సొంత నిధులతో బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో మరమ్మతులు చేయించినట్టు చెప్పారు. బీసీ బిడ్డలకు నాణ్యమైన విద్య, ఆహారం అందించడంతో పాటు సౌకర్యాలు కూడా అంది స్తున్నామన్నారు. సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, యూపీఎస్‌లు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాయలసీమ, శ్రీకాకుళం వంటి ప్రాంతాల్లో ఎంజేపీ స్కూళ్ల ఏర్పాటుకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. ఇదే విషయం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్రంలో కొత్తగా 10 బీసీ గురుకుల పాఠశాలల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. 2014-19లో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎంజేపీ స్కూళ్ల భవనాల నిర్మాణాలకు రూ.80 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థుల సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఎంజేపీ స్కూళ్లలో సీట్ల కోసం విపరీతమైన డిమాండ్ ఉందని...మరిన్ని అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పేద పిల్లలను పైకి తేవడమే సీఎం చంద్రబాబు లక్ష్యం



- అంబేద్కర్ స్ఫూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలి
- పీ4 ద్వారా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు కృషి
- మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి

అమరావతి(చైతన్యరథం): పేద పిల్లలు ఐఏఎస్, ఐపీఎస్, ఇంజనీర్లు, డాక్టర్లు కావాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. తాడేపల్లి ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో సివిల్స్ ఉచిత ఆన్‌లైన్ శిక్షణను మంత్రి ప్రారంభించారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే ఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా ఫిజిక్స్ వాలా ఆన్‌లైన్ కోచింగ్‌తో పాటు ట్యాబ్‌లు, మెటీరియల్స్ పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను నిర్వీర్యం చేసింది. నేడు స్టడీ సర్కిల్ ద్వారా విజయవాడ, విశాఖ, తిరుపతి కేంద్రా లుగా సివిల్స్‌కు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నాం. రెసిడెన్షియల్‌సివిల్స్ శిక్షణకు అర్హత సాధించలేని అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్ శిక్షణ ఇస్తు న్నాం. అవకాశాలు అందిపుచ్చుకుని అంబేద్కర్ స్ఫూర్తితో కష్ట పడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.పీ4 ద్వారా రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబ కృషి చేస్తున్నారని తెలిపారు.

# జీవో 3 పునరుద్ధరణకు మేధోమథన సమావేశం

- 2000లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో జీవో తెచ్చారు
- గత ప్రభుత్వంలో రద్దుతో గిరిజనులకు అన్యాయం
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి సంధ్యారాణి సమాధానం



అమరావతి(చైతన్యరథం): అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగుల బదిలీలపై ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అడిగిన ప్రశ్నకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి సమాధానమిచ్చారు. 10-01-2000న జీవో 3 ప్రకారం గతంలో గిరిజన ఉద్యోగులను కేవలం గిరిజన ప్రాంతాల్లోనే నియమించడం లేదా బదిలీ చేయ డం జరిగేది. ఆ జీవోను గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి దృష్టి సారిం చకపోవడం వల్ల సుప్రీంకోర్టు 2020లో కొట్టివేసింది. ఆ తరువాత గిరిజన ఉద్యోగుల బదిలీలు, నియామకాలు ప్రభుత్వ నిబంధ నలకు లోబడి గిరిజన..గిరిజనేతర ప్రాంతాలకు కూడా నిర్వహించ బడుతున్నాయి.

గిరిజనులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే జీవో 3ను చంద్రబాబు తీసుకొస్తే..జగన్‌రెడ్డి ప్రభుత్వంలో రద్దు చేశారు. షెడ్యూల్ ప్రాంతాల్లోని విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో స్థానిక షెడ్యూల్ తెగలకు (ఎస్టీ) 100% రిజర్వేషన్ కల్పిస్తూ 10-01-2000 తేదీ గల జీవో నెంబర్ 3ను చేబ్రోలు లీలా ప్రసాద రావు వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టులోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2020లో రద్దు చేసింది. 40 లక్షల మంది గిరిజనులు జీవో 3కి ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఎన్టీఆర్ పాలనలో 05-11-1986 తేదీన జారీ చేసిన జీవో 275 ద్వారా షెడ్యూల్ ప్రాంతాల్లోని అన్ని ఉపాధ్యాయ పదవులను ఎస్టీలకు కేటాయించారు. 10-01-2000న ముఖ్యమంత్రి చంద్రబాబు రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ 5(1) ప్రకారం స్థానిక ఎస్టీలకు 100% రిజర్వేషన్ కల్పిస్తూ జీవో 3 జారీ చేశారు. గత జగన్ ప్రభుత్వం కోర్టు కేసుల పరిష్కారంలో తగిన చొరవ తీసుకోక పోవడం వల్ల జీవో 3 రద్దుకు దారి తీసిందని మంత్రి విమర్శించారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16(4) ప్రకారం 100% రిజర్వేషన్ అనుమతించ బడదని, 50% పరిమితిని మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. 5వ షెడ్యూల్ 5(1) ప్రకారం గవర్నర్‌కు ఉన్న అధికారాలు కొత్త చట్టాలను రూపొందించే వరకు విస్తరించ వు. 1986 నుంచి జరిగిన నియామకాలను కోర్టు షరతులతో సమర్థించింది. అయితే భవిష్యత్తులో రిజర్వేషన్ పరిమితులను ఉల్లంఘించరాదని హెచ్చ రించింది.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు జీవో 3 పునరుద్ధరణపై ప్రజా సంప్రదింపులు జరిగాయి. వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, యూనియన్లు, న్యాయవాదులు, మీడియా ప్రతినిధుల అభిప్రాయాల సేకరణ జరిగి ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయి. 100% రిజర్వేషన్ పునరుద్ధరణకు పరిష్కారాలపై చర్చించేందుకు గిరిజన ప్రతినిధులతో ఒక మేధోమథన సమావేశం నిర్వహించాలనే ప్రణాళిక ఉందని చెప్పారు

# వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీపై సదస్సు

- పాల్గొన్న ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్‌కృష్ణ
- ఆర్‌వీఆర్‌జేసీ కాలేజీలో విద్యార్థులకు అవగాహన



గుంటూరు (చైతన్యరథం): ఏపీటీఎస్ ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో నిర్వహిస్తామని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ తెలిపారు. లోకేష్ వినూత్న ఆలోచనతో భారతదేశంలోనే తొలిసారిగా ప్రజలకు వాట్సాప్‌లోనే 920 ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు విజన్‌తో భారతదేశంలోనే బెస్ట్ సైబర్ సెక్యూరిటీ మానిటరింగ్ సెంటర్(ఏపీసీఎస్‌వోసీ) ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఆధ్వర్యంలో గుంటూరు ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చంద్రబాబు ప్రోత్సాహంతో లోకేష్ చొరవతో దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవర్నెన్స్ 'మన మిత్ర' అందుబా టులోకి వచ్చింది. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా టెక్నాలజీతో పాలనను నేరుగా మీ మొబైల్‌కే చేర్చారు. ప్రజలు తమ మొబైల్‌లో 95523 00009 నెంబర్‌ను సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపి సేవలు పొందవచ్చని వివరించారు. అత్యాధునిక టెక్నాలజీతో బెస్ట్ సైబర్ సెక్యూరిటీ మానిటరింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఏపీటీఎస్ సెక్యూరిటీలో ఇంటర్న్ షిప్స్ ఇస్తూ రాష్ట్రంలో సైబర్ సెక్యూరిటీ నిపుణులను తయారుచేయటంలో కీలకపాత్ర పోషిస్తోంది. ఎంపికైన వారికి ట్రైనింగ్‌తో పాటు ప్రతి నెలా రూ.10 వేలు స్టైఫండ్ ఇస్తున్నట్టు వివరించారు.

**ఏపీకే ఫైల్స్ వద్దు..లింక్‌లపై క్లిక్ చేయొద్దు**

గూగుల్ ప్లే స్టోర్ వెలుపల లభించే ఫైల్స్ వాడకండి..ఇవి మీ ఫోన్లో ఉన్న డేటాను హ్యాకర్లకు ఇస్తాయి. ముఖ్యంగా యువత ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. లోన్ యాప్స్ ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులకు లేదా పోలీసులకు తెలపాలని విద్యార్థులకు చెప్పారు. వీడియో లైక్ చేస్తే డబ్బులు అనే మెసేజ్‌లు నూటికి నూరు శాతం అబద్ధం. రైల్వే స్టేషన్లు, కేఫ్‌లలో దొరికే ఉచిత వైఫై ద్వారా బ్యాంకింగ్ పనులు చేయొద్దని తెలిపారు. లాటరీ లేదా అకౌంట్ బ్లాక్ పేరుతో వచ్చే లింకులను అస్సలు క్లిక్ చేయరాదని సూచించారు. మీ వ్యక్తిగత డేటా రక్షణలో ఏపీటీఎస్ నిరంతరం నిఘా ఉంచుతూ హ్యాకర్లను అడ్డుకుంటోంది. ఆన్‌లైన్ మోసగాళ్ల చేతిలో డబ్బులు పోగొట్టుకున్నా లేదా సైబర్ వేధింపులకు గురైనా 1930 నెంబర్‌కు కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఏపీటీఎస్ ప్రతినిధులు శ్రీనివాస్, దినేష్, మదన్‌రాజ్, కాలేజ్ ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్స్ శ్రీనివాస్‌రావు, కొమ్మినేని రవీంద్ర విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరు మున్సిపల్ చైర్మన్‌పై అనర్హత వేటు

**- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి నారాయణ**



అమరావతి (చైతన్యరథం): పుత్తూరు మున్సిపల్ చైర్మన్ తప్పుడు కుల ధృవీకరణ పత్రాలతో పదవి పొందినందువల్ల రెండు సార్లు వివరణ తర్వాత ఆయనపై అనర్హత వేటు వేసి తొలగించినట్లు పురపాలక మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. తొలగింపునకు దీనికి సంబంధించి ఈనెల 9న జీవో 135 జారీ చేసినట్లు చెప్పారు.ఆయనపై తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోవచ్చనేది పరిశీలిస్తామని తెలిపారు.

## హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా బాలాజి ప్రమాణస్వీకారం



అమరావతి(చైతన్యరథం): ఏపీ ఉన్నత న్యాయస్థానం అదనపు న్యాయమూర్తిగా బాలాజి మెడమల్లి గురువారం బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు మొదటి కోర్టు హాల్‌లో గురువారం ఉద యం జరిగిన కార్యక్రమంలో అదనపు న్యాయమూర్తిగా బాలా జి మెడమల్లి చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణ స్వీకారం చేయించారు. అదనపు న్యాయమూర్తి బాలాజి మెడమల్లి కడప జిల్లా రాజంపేటలో జన్మించారు. హైదరాబాద్‌లో న్యాయశాస్త్ర విద్యను పూర్తి చేసుకున్న ఆయన న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వద్ద జూనియర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. 2004 నుంచి 2006 వరకు ఏజీపీగా పనిచేశారు. 2018లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. ఈ కార్యక్రమంలో పలువు రు న్యాయమూర్తులు, అదనపు సొలిసిటర్ జనరల్ చల్ల ధనంజ య, అడ్వకేట్ జనరల్ డి.శ్రీనివాస్, బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాథ్‌రెడ్డి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, పలువులు రిజిస్ట్రా ర్లు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్రశ్రేణి క్రీడా హబ్‌గా ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

**- ఢిల్లీ పర్యటనలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**
**- స్పోర్ట్స్ అథారిటీ జేఎస్ వినీల్ కృష్ణతో సమావేశం**
**- అదనపు నిధుల మంజూరు అంశాలపై చర్చ**



అమరావతి(చైతన్యరథం): ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ గురువారం జాతీయ యువజన వ్యవహారాలు, ఎస్ఏఐ జాయింట్ సెక్రెటరీ వినీల్ కృష్ణతో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాయచోటి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన నిధులు, ఖేలో ఇండియా పథకం కింద ప్రతిపాద నల ఆమోదం, అలాగే ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రశ్రేణి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ప్రభు త్వానికి అదనపు నిధుల మంజూరు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ జాతీయ నాయకులు సాయి లోకేష్ పాల్గొన్నారు.

# లిక్కర్ స్కామ్ క్షమించరాని భారీ నేరం

- **ఈ రోజు సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో నేరతీవ్రత స్పష్టమైంది**
- **జగన్‌రెడ్డి క్షమాపణ చెప్పి రాజకీయాల నుంచి వైదొలగాలి**
- **టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



అమరావతి(చైతన్యరథం): లిక్కర్ స్కామ్ క్షమించరాని భారీ నేరమని, ఈ రోజు సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో నేరతీవ్రత స్పష్టమైం దని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులతో పాటు అధికారుల అండతోనే స్కామ్ జరిగిందని సాక్షాత్తు సుప్రీంకోర్టు వ్యాఖ్యానిం చిందని తెలిపారు. ఇంత భారీ పాపానికి ఒడిగట్టిన జగన్ రెడ్డి ప్రజలకు తలదించుకుని క్షమాపణ చెప్పి రాజకీయాల నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఏపీ లిక్కర్ స్కామ్ విషయంలో సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన తీర్పునిచ్చింది. అది రూ.3500 కోట్ల స్కామ్ అని.. రాజ్ కసిరెడ్డికి బెయిల్ ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. రాజకీయ నాయకులతో పాటు అధికారుల అండతో ఈ భారీ స్కామ్ జరిగిందని వ్యాఖ్యానించింది. స్కామ్ వెనుక పొలిటి కల్ బ్యాక్ గ్రౌండ్ ఉందని సాక్షాత్తు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఆ రోజు ముఖ్యమంత్రిగా ఉన్నది జగన్మోహన్ రెడ్డి కాదా? రూ.200 కోట్ల ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఆనాటి సీఎం కేజ్రీవాల్‌తో పాటు డిప్యూటీ సీఎం సిసోడియా, తెలంగాణలో సీఎం కుమార్తెను, తమిళనాడులో సీఎం సోదరిని జైళ్లకు పంపారు. అప్పటి ఏపీ సీఎం జగన్‌రెడ్డికి ప్రత్యేకమైన చట్టాలున్నాయా? ఆరోపణలు వచ్చిన రోజే తలదించుకుని ప్రజలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేసి ఉండాలి. సిట్ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ధనుంజయరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తదితర ప్రముఖులందరూ ఈ కేసులో జైలుకి పోయి బెయిల్ పై బయటకు వచ్చారు. రాజ్ కసిరెడ్డి 10 నెలలుగా జైలులోనే ఉన్నారు. ఈ స్కామ్ విలువ కేవలం రూ.3500 కోట్లు మాత్రమే కాదు...వేలాది ప్రాణాలతో ముడిపడిందని పేర్కొన్నారు. కల్తీ మద్యాన్ని పైశాచికంగా నిరుపేదల గొంతులో పోసి నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ డ్రామాలాడిన జగన్‌రెడ్డి, ఇన్ని పాపాలు చేసిన వైసీపీ నాయకులు ప్రజలకు ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇంతపెద్ద పాపానికి ఒడికట్టిన జగన్మోహన్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పి రాజకీయాల నుంచి తప్పుకో వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయాలని కోరారు.

# వైసీపీ మాజీ ఎంపీపీ నిర్వాకం

**- అక్రమంగా ఆయన పేరుపైకి భూమి ఆన్‌లైన్**
**- గత పాలనలో లాయర్ ముసుగులో మోసం**
**- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుడి ఫిర్యాదు**

మంగళగిరి(చైతన్యరథం): గత ప్రభుత్వంలో వైసీపీ మాజీ ఎంపీపీ నిర్వాకంపై బాధితుడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన ప్రజావినతుల కార్యక్రమంలో పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం చిట్టిపోతులవారిపాలెం గ్రామానికి చెందిన రమేష్‌కుమా ర్ ఫిర్యాదు చేశారు. అలవాల గ్రామంలోని సర్వే నెం.54/1ఎలో పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమి ఉంది. దీనికి సంబంధం చి తన పేరిట 0.80 సెంట్లు (ఖాతా నెం. 563), తల్లపనేని అంజయ్య పేరిట 0.80 సెంట్లు (ఖాతా నెం. 635) పట్టాదారు పాసుపుస్తకాలు కూడా ఉన్నాయి. వీటితో పాటు వీరి కుటుంబానికి మరో 7.90 ఎకరాల పూర్వార్జిత భూమి, గతంలో మట్టి కోసం ఇచ్చి తిరిగి స్వాధీనం చేసుకున్న 6.15 ఎకరాల భూమి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఎంపీపీగా పనిచేసిన గడ్డం వెంకట్రావు అనే వ్యక్తి అధికారులతో చేతులు కలిపి ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోయినా రీ-సర్వే సమయంలో తమ భూమిని తన పేరు మీద ఆన్‌లైన్ ఎక్కించుకున్నాడు. ఈ అక్రమ నమోదుపై రొంపిచర్ల తహశీల్దార్‌ను వివరణ కోరగా "గతంలో పనిచేసిన వారు చేశారు. వీఆర్వోను అడగండి అంటూ బాధ్యతారాహిత్యంగా సమాధానం చెబుతున్నారు. గత ఐదేళ్లుగా తహశీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఆధారాలు సమర్పించినా, "కోర్టుకు వెళ్లి తేల్చుకోండి" అని అధికారులు చెబుతున్నారే తప్ప, అక్రమంగా ఆన్‌లైన్ అయిన పేరును తొలగించడం లేదు. మొత్తం భూమిలో కేవలం 2 ఎకరాలపైనే మాత్రమే కోర్టులో వివాదం ఉంది. మిగిలిన 14.05 ఎకరాలకు ఎలాంటి వివాదం లేకపోయినా అధికారులు కాలయాపన చేస్తున్నారు. గుంటూరు మేయర్, జోన ల్ కోఆర్డినేటర్ కోవెలమూడి నాని, ఏపీ నూర్ బాషా, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ కసునూరి నాగుల్ మీరా అర్జీలు స్వీకరించారు.

### లాయర్ ముసుగులో మోసం

అనంతపురం జిల్లా రాయదుర్గానికి చెందిన లక్ష్మీ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. విజయ్‌కుమార్ అనే వ్యక్తి తాను లాయర్‌ని అని పరిచయం చేసుకుని నమ్మకం కలిగించారు. తనకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చి, మానసికంగా నమ్మ బలికి మోసం చేశారు. అతని



నమ్మకంపై తన పేరుమీద ఉన్న ఇల్లు (ప్లాట్ నెం.14), బంగారం, రూ.40,000 నగదు బ్యాంక్ ద్వారా ఇచ్చాను. ఈ లావాదేవీకి సంబంధించిన బ్యాంక్ రసీదు తన వద్ద ఉన్నాయి. అదేవిధంగా ఆ వ్యక్తితో జరిగిన ఫోన్ సంభాషణల రికార్డులు కూడా తన వద్ద ఉన్నాయి. ఇటీవల అతనిని ప్రశ్నించగా అధికారికంగా ఫోన్ చేస్తే తానే ఆ ఇల్లు కొనుగోలు చేశానని చెప్పుతూ పత్రాలను వాట్సాప్ ద్వారా పంపుతున్నాడు. పెద్దల ద్వారా సంప్రదించినప్పుడు స్పందించడంలేదు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

### ప్రభుత్వ భూమిలో తారు మిక్సింగ్ యంత్రం

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం మాచపురం గ్రామానికి చెందిన దానమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామ పరిధిలో ఉన్న సర్వే నంబర్లు 192/2, 142/3, 143, 149, 125 ప్రాంతాలలో ప్రభుత్వ భూమిని గౌస్ మొహిద్దీన్ అక్రమంగా ఆక్రమించి తారుమిక్సింగ్ యంత్రాన్ని ఏర్పాటు చేశాడు. ఈ భూమి కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారి సమీపంలో ఉండటంతో యంత్రం నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ కారణంగా రహదారి సరిగా కనిపించక పోవడం తో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అదేవిధంగా సమీపం లోని సర్వే నెం. 142/12లో నాటిన కొబ్బరి, మామిడి తోటలు తారు కాలుష్య ప్రభావంతో ఎండిపోతున్నాయి. వారిపై చర్యలు తీసుకోని కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

### బావ వేధిస్తున్నారని మహిళ ఫిర్యాదు

వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం కల్లూరు గ్రామానికి చెందిన సుష్మిత గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తన భర్త గత ఏడాది (06-12-2025) మరణించారు. భర్త మరణానంతర కార్యక్రమాలు ముగిసినప్పటి నుంచి తన భర్త అన్న అయినా తమ బావ జయరాజు శారీరకంగా నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నాడు. అందుకు నిరాకరించడంతో తన పసిబిడ్డను బలవంతంగా లాక్కొని వెళ్లి ఒక రోజంతా బందీగా ఉంచుకున్నాడు. ఈ విషయంపై పోలీసులను ఆశ్రయించగా బిడ్డను తనకు అప్పగించిన పోలీసులు.. నిందితుడు జయరాజును మందలించాల్సింది పోయి అతనికే మద్దతుగా నిలిచారు. తనను కించపరిచేలా మాట్లాడటమే కాకుండా అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

### నష్టపరిహారం చెల్లించాలి

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం దొప్పర్ల గ్రామానికి చెందిన వరహాలు రావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో 2010లో బార్క్ టౌన్‌షిప్ భూసేకరణకు ఏపీఐఐసీ అధికారులు సుమారు 100 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ నేటికీ ఆ భూములన్నీ రైతుల స్వాధీనంలోనే ఉన్నాయి. ఈ భూమిలే ఆధారంగా వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ కోసం ఇదే సర్వే నంబర్ (168/1)లో 5 ఎకరాలు సేకరించినప్పుడు, 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎకరా నికి రూ. 39.50 లక్షలు చెల్లించేందుకు కలెక్టర్ అంగీకరించి ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. కానీ ప్రస్తుతం ఆర్డీవో కేవలం రూ.20లక్షలు మాత్రమే ఇస్తామంటున్నారు. ప్రస్తుతం దొప్పర్ల గ్రామంలో ఎకరం మార్కెట్ విలువ బహిరంగంగా రూ. 2 కోట్లు పలుకుతోంది. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువ కూడా రూ. 27.50 లక్షలుగా ఉంది. పొరుగున ఉన్న నక్కపల్లి, తుర్లువాడ ప్రాంతాల్లో 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించినప్పుడు తమకు ఎందుకు నిరాకరిస్తున్నారు. ఈ భూసేకరణపై రైతులం దరూ కలిసి హైకోర్టును ఆశ్రయించగా, 2013 చట్టం ప్రకారం 'స్టేటస్ కో' ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వం తమపై దయ ఉంచి 2013 భూసేకరణ చట్టం నిబంధనల ప్రకారం ప్రస్తుత మార్కెట్ విలువకు అనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని కోరాడు.





# శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

## మల్లన్నకు పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం - భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడి

శ్రీశైలం(చైతన్యరథం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో గురువారం సాయం త్రం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారికి పట్టు వస్త్రాలు ఘనంగా సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ శ్రీశైలం క్షేత్రం దేశవ్యాప్తంగా విశిష్ట స్థానం కలిగిన శైవ క్షేత్రమని, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభు త్వం తరపున పట్టువస్త్రాల సమర్పణ చేయడం ఆనందంగా ఉంద న్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సంద ర్భంగా శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం, దేవస్థానం సమ న్వయంతో చర్యలు కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ మంత్రికి వివరించా రు. ఆలయ ఏర్పాట్లు, భక్తులకు అందిస్తున్న సదుపాయాలపై మంత్రికి వివరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజ కుమారి గణియా, స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, దేవస్థా నం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# కడప నుంచి విమాన సేవలను విస్తరించాలి

### బెంగళూరు-కడప రైల్వేలైన్ ఏర్పాటు చేయాలి - కేంద్రమంత్రులకు మంత్రి మండిపల్లి వినతి

అమరావతి (చైతన్యరథం): కేంద్ర మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడును గురువారం ఢిల్లీలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కలిశారు. కడప విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు విమానాల సేవలను పెంచాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో కడప విమానాశ్రయం ద్వారా కడప జిల్లాకు మెరుగైన విమాన కనెక్టివిటీ కల్పిస్తే రాయలసీమ ప్రాంత అభివృద్ధికి, వ్యాపార, పర్యాటక రంగాల పురోగతికి దోహదపడు తుందని వివరించారు. బెంగళూరు-కడప రైల్వే మార్గంపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ని కలిశారు. ప్రాంత అభివృద్ధికి కీలకమైన రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. బెంగళూరు-కడప రైల్వే మార్గం ఏర్పాటు చేస్తే రాయలసీమ ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. ఈ ప్రాంత ప్రజల దీర్ఘకాలిక



ఆకాంక్ష అయిన ఈ రైల్వే మార్గాన్ని త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. రైల్వే లైన్ ఏర్పాటుపై సానుకూలంగా స్పందించారు. మంత్రి వెంట ఎంపీ పురందేశ్వరి, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షులు సాయి లోకేష్ ఉన్నారు.

# మహిళలను అవమానించడంలో బ్రాండ్ అంబాసిడర్ వైసీపీ

- **సభ్య సమాజం తలదించుకునేలా అంబటి తీరు**
- **దమ్ముంటే ప్రజా సమస్యలపై చర్చకు రావాలి**
- **కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



అమరావతి(చైతన్యరథం): మహిళలను అసభ్య పదజాలంతో దూషించడం, సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం చేయడం, కూటమి నేతలపై రెచ్చగొట్టే వ్యాఖ్యలతో దాడులు చేయడమే వైసీపీ అజెండాగా మారిందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మండిపడ్డారు. యథా లీడర్- తథా క్యాడర్ అన్న ట్టు వైసీపీ తీరుంది. వైసీపీ మూక రప్పా రప్పా రాజకీయాలు, తగ్గేదేలే అంటూ డైలాగులన్నీ జగన్‌రెడ్డి డైరెక్షన్‌లోనే జరుగుతు న్నాయి. జైలుకు వెళ్లినా అంబటి రాంబాబు బుద్ధి మారలేదు. సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరిస్తున్నాడు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించలేని వైసీపీ నేతలు తమ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఎంతటి నీచా నికైనా దిగజారుగుతున్నారు. గడిచిన ఐదేళ్లలో మహిళల గురించి దారుణంగా మాట్లాడిన వారికి పదవులు కట్టబెట్టిన సంస్కృతి జగన్ రెడ్డిది. ప్రజలు ఛీకొట్టి 11 సీట్లకే పరిమితం చేసినా బుద్ధి రాలేదు. ఏ మాత్రం హుందాతనం అనేది లేకుండా చిల్లర రాజకీయాలు, దిగజారుడు మాటలు మాట్లాడుతున్న వైసీపీ నేతలు సమాజానికి ఏం సందేశం ఇస్తున్నట్టు? వైసీపీ ఆటలు సాగవు. ప్రజాస్వామ్యానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కూటమి ప్రభుత్వం ఉపేక్షించదు. న్యాయబద్ధంగా కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

# ఉయ్యాలవాడ, వెంగళరెడ్డి సేవలు మరువం వారికి సముచిత గౌరవం కల్పిస్తాం

- **అధికారిక క్యాలెండర్‌లో జయంతి, వర్ధంతి**
- **పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**
- **శాసనమండలి సమావేశాల్లో సమాధానం**



అమరావతి (చైతన్యరథం): ఏపీ శాసనమండలి 49వ సెషన్ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్సీలు అడిగిన ప్రశ్నలకు పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ సమాధానమిచ్చారు. రేనాటి గడ్డపై జన్మించిన వీరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, దాతృత్వ శిఖరం బుడ్డా వెంగ ళరెడ్డిల సేవలను ప్రభుత్వం సముచిత రీతిలో గౌరవిస్తుందని ఆయన స్పష్టం చేశారు. 1857 సిపాయిల తిరుగుబాటుకు పదేళ్ల ముందే భారత ప్రజల స్వేచ్ఛ కోసం బ్రిటీష్ పాలకులపై పోరాడిన ధీశాలి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కొనియాడా రు. రేనాడు ప్రాంత ప్రజల కోసం ఆయన చేసిన త్యాగం వెలకట్టలేనిదని పేర్కొ న్నారు. అదేవిధంగా 1866లో రాయలసీమలో సంభవించిన భయంకరమైన కరువు సమయంలో తన యావదాస్తిని ప్రజల ఆకలి తీర్చడానికి ధారబోసిన మహాను భావుడు బుడ్డా వెంగళరెడ్డి అని గుర్తుచేశారు. ఆయన చూపిన చొరవ చరిత్రలో నిలిచిపోతుం దన్నారు. మ్యూజియంల ఏర్పాటు అనేది పురావస్తు ఆధారాలు, చరిత్రపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఆధునిక సాంకేతికతను జోడించి వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ వంటి పద్ధతులలో చారిత్రక ఘట్టాలను భవిష్యత్తు తరాలకు అందించే అంశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అధికా రికంగా నిర్వహించే జయంతి, వర్ధంతి కార్యక్రమాల క్యాలెం డర్‌లో ఈ ఇద్దరు మహానాయకుల వివరాలను పొందుపరు స్తామని, వారిని తగు రీతిలో గౌరవించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మహనీయుల సేవలపై కూటమి ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందని, వారి కీర్తిని పది కాలాల పాటు నిలిపేలా చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు.



# పిల్లల పండుగ... పెద్ద వేడుక

**సిలికానాంధ్ర ఆధ్వర్యంలో దేసాన మిడిల్ స్కూలులో అంగరంగ వైభవంగా 'మన బడి'**

**తెలుగు మాట, పాట, సంస్కృతి సమ్మేళనంతో మంత్రముగ్ధులైన ఆహుతులు**

అల్ఫరెట్ట, జార్జియా: దేసాన మిడిల్ స్కూల్‌లో సిలికానాంధ్ర మన బడి అల్ఫరెట్ట, రివర్‌డేల్, పీచ్‌ట్రీ సిటీ, హోలీ స్ప్రింగ్స్, డన్వుడి కేంద్రాల వారి పిల్లల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. 300 మంది పిల్లలు, వారి కుటుంబాలతో మొత్తం 1,200 మంది పెద్ద వేడుకలా జరుపుకున్నారు.

జార్జియా రీజియన్-1 సిలికానాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త నగేష్ దొడ్డక మన బడి పిల్లలని వేదిక పైకి ఆహ్వానించారు. పిల్లలు శోభాయాత్రతో కార్యక్రమాన్ని ఆరంభించారు. జార్జియా పురోగతి సమన్వయకర్త విజయ్ రావిళ్ళ, ముఖ్య అతిథి లక్ష్మీపద్మావతిలతో ఉపాధ్యాయుల చేతుల మీదుగా బాలబడి చిట్టి పిల్లలకు భాషా జ్యోతిని అందించారు. మన తెలుగు భాషా జ్యోతి వెలిగిస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు. మా తెలుగు తల్లికి పాటతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బాల బడి చిన్నారులు... చిట్టి చిలకమ్మా, మా తాత గుండు, ఎర్రని పువ్వు మందారపువ్వు, బుడిబుడి నడకల పాట, ముద్దు ముద్దు అమ్మ పాట, కోతీ బావకి పెళ్ళంట, ఎవరు ఎగిరేది, పలక నాది నల్లన, శబ్దాలు, జంతువుల అరుపుల పాట, జంతువుల పరిచయం, ముల్లు పోయి కత్తి వచ్చే పద్యం, ఆటలంటే మాకిష్టం పాటలతో ప్రేక్షకులను అలరించారు.

మాకు మేమె సాటి అంటూ, తెనాలి రామకృష్ణ, ఐకమత్యమే మహాబలం, పరమానందయ్య శిష్యుల కథ, రాజుగారి ఏడు చేపల కథ, జానపద నృత్యం, నా ప్యాంటు కథ, రాజకుమారి నాటకం, కోడిపిల్ల అమ్మను వెతికిన కథ, ద్రోణాచార్యుడు పరీక్ష, అంజమ్మ-కపిలయ్య, పంచతంత్ర కథ, నాయనా పులివచ్చే నాటకాలతో ప్రేక్షకుల మనసులు గెలుచుకుని, భాషా భాగాలపై విద్వత్తుతో పిల్లలు అబ్బురపరిచారు.



కోపమునను, మన తెలుగు-మన గర్వం, కష్టబెట్టబోకు, బ్రతికినన్నినాళ్లు, తగిలినంతమేర, దొరంలీదోచలేయరు, వీదుపరులవాడు, అడవిగాల్పువేళ, ఎప్పటికెయ్యది, గుమ్మాడమ్మ గుమ్మాడి... లాంటి పద్యాలతో పిల్లలు శ్రోతల్ని ఆనందపరిచారు.

ముఖ్యంగా దశావతారం, మనమెవ్వరం, స్వాతంత్ర సమరయోధుల ఏకపాత్రాభినయనంలతో ప్రేక్షకులను అబ్బురపరిచారు. అలంకారాలతో నాటకం వేయచ్చు అనే ఆలోచనతో పిల్లలు తెలుగు భాషా పటిమను ప్రదర్శించారు.

కార్యక్రమ వక్తలుగా మన బడి పూర్వ విద్యార్థులు సహస్ర, నిత్య, శ్రీ, స్మృతి, విహాన్, శ్రీధరన్, అక్షిత్,



అర్ణవ్, శ్రావ్య, ఇషాని, మహిక, జోషిత తమ తెలుగు ఉచ్చారణతో అందరి మనసులను ఆకట్టుకున్నారు.

మన బడికి ప్రాంతీయంగా సహకారం అందిస్తున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటా బోర్డు చైర్మన్ మధుకర్ యార్లగడ్డ, అధ్యక్షురాలు సునీత పొట్నూరు, కాబోయే అధ్యక్షుడు తిరు చిల్లపల్లి, కార్యవర్గం, మన బడి కార్యదర్శులైన నగేష్ దొడ్డాక, యశ్వంత్ జొన్నలగడ్డ, శ్రావణి పల్లపోలు, సుధీర్ కోట, విజయ్‌కుమార్, ప్రియాంక నీలంలను అభినందించారు. అన్ని పట్టణాల నుంచి వచ్చిన మనబడి ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు.

జార్జియా రీజియన్-2 నుంచి వచ్చిన ప్రాంతీయ సమన్వయకర్తలు సుచేత, గౌరిధర్ సంఘీభావం తెలిపారు. చిన్నారుల తెలుగు మధుర ప్రవాహంతో పిల్లల పండుగ అద్భుతంగా, అనందంగా జరిగింది.



సిలికానాంధ్ర మన బడి పిల్లల పండుగ విజయవంతమవ్వడానికి సహకరించిన వారిని, ముఖ్యంగా ముందుకు వచ్చి సహాయం అందించిన తల్లిదండ్రులను యశ్వంత్ జొన్నలగడ్డ పేరుపేరునా అభినందించి ధన్యవాదాలు తెలిపారు.



---

**ఆ యువతికి 23 ఏళ్లకే నిండు నూరేళ్లూ నిండిపోయాయి. కన్నతల్లి పేగు తల్లడిల్లింది. న్యాయం కోసం గుండె ఘోషించింది. చివరికి మృతురాలి పక్షానే న్యాయ దేవత నిలిచింది.**




**2023లో అమెరికాలో పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొని ప్రాణాలు కోల్పోయిన కర్నూలు బిడ్డ జాహ్నవి కందుల కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. 'ఆమె ప్రాణానికి విలువ లేదు.. ఒక చెక్ రాసిస్తే సరిపోతుంది' అని ఆనాడు జాహ్నవి మరణాన్ని అమెరికా పోలీసు అధికారి ఎగతాళి చేయగా.. నేడు అదే అమెరికా అక్షరాలా రూ.262 కోట్ల భారీ నష్టపరిహారాన్ని చెల్లించేందుకు సిద్ధమైంది. కన్నకూతురిని పోగొట్టుకున్న ఆ తల్లికి ఏ సంపదా ఓదార్పునివ్వలేదు. కానీ ఈ భారీ పరిహారం అమెరికా చరిత్రలో ఒక కీలక మైలురాయిగా మిగిలిపోనుంది.**




**జాహ్నవి కందుల మృతి కేసులో కుటుంబానికి**

# రూ.262 కోట్ల పరిహారం

సియాటెల్:

**అసలేం జరిగింది?:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి కందుల (23) ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లింది. సౌత్‌లేక్ యూనియన్‌లోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మాస్టర్స్ డిగ్రీలో చేరింది. 2023 జనవరి 3న రాత్రి ఆమె రోడ్డు దాటుతుండగా పోలీస్ పెట్రోలింగ్ కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో జాహ్నవి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే చనిపోయింది. ఈ ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డవే, మరో అధికారి డేనియల్ అడరర్.. జాహ్నవి మృతి పట్ల అమానవీయంగా ప్రవర్తించడమే కాదు, జోకులు వేసుకున్నారు.

**వివాదానికి దారితీసిన దృశ్యాలు:**

'ఆమె ఒక సాధారణ వ్యక్తి.. ఈ మరణానికి విలువే లేదు' అంటూ పోలీస్ అధికారి అన్న మాటలు, ఆయన ప్రవర్తించిన తీరు కెమెరాలో రికార్డయ్యాయి. ఈ వీడియోలు బయటకు రావడంతో భారత్‌తో పాటు అమెరికాలోనూ పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. కెవిన్ తీరుపై అమెరికాలోనూ విమర్శలు రావడంతో ఆయన్ని విధుల నుంచి తొలగించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో కేవలం 40 కిలోమీటర్ల జోన్ ఉంది. కానీ, కెవిన్ గంటకు 119 కిలోమీటర్ల వేగంతో




వాహనం నడిపి జాహ్నవి మరణానికి కారణమయ్యాడు. అయితే కారుతో ఢీకొట్టిన తర్వాత అధికారి చాలా దుర్మార్గంగా వ్యవహరించాడు. పశ్చాత్తాపం లేకుండా అమానుషంగా మాట్లాడాడు. "ఆమె చనిపోయింది. ఆమె చాలా మామూలు మనిషి. 11 వేల డాలర్లు ఇస్తే సరిపోతుంది హహహ.." అంటూ వెకిలి నవ్వుతూ అపహాస్యం చేశాడు. ఇందుకు సంబంధించిన వ్యాఖ్యలు మరో అధికారి బాడీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. ఈ మాటలు భారతీయుల హృదయాలను కదిలించేశాయి. ఇంత దుర్మార్గమా? అంటూ న్యాయ పోరాటానికి దిగారు. తమ బిడ్డకు న్యాయం జరగాలని జాహ్నవి కుటుంబం పోరాటం చేసింది.

ఇక ఈ కేసులో గత శుక్రవారం కింగ్ కౌంటీ సుపీరియర్ కోర్టులో ఇరుపక్షాలు పరిష్కార నోటీసు దాఖలు చేశాయి. మూడేళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం తర్వాత జాహ్నవికి న్యాయం జరిగింది. ఆమె కుటుంబానికి 26 మిలియన్ డాలర్లు (భారతీయ కరెన్సీలో రూ.262 కోట్లు) భారీ పరిహారం చెల్లించేందుకు సియాటెల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ బుధవారం నాడు ప్రకటన చేశారు. 'జాహ్నవి కందుల మరణం ఎంతో బాధాకరం. ఈ పరిహారం ఆమె కుటుంబానికి కాస్తయినా ఊరటనిస్తుందని ఆశిస్తున్నాం' అని సియోటెల్ అటార్నీ ఒక ప్రకటనలో పేర్కొంది. కాకపోతే దీనిపై జాహ్నవి కుటుంబం తరుపు అటార్నీ నుంచి ఇప్పటివరకు స్పందన రాలేదు.

## న్యాయం గెలిచింది

తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలని ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్లిన జాహ్నవిని మృత్యువు వెంటాడింది. తల్లిదండ్రులకు ఇచ్చే ఈ పరిహారం ఆమెను వెనక్కి తీసుకురాలేదని.. కానీ, 'ఆమె ప్రాణాలనికి విలువ లేదు' అన్న అధికారుల అహంకారపూరిత వ్యాఖ్యలకు భారీ జరిమానా ఒక గట్టి సమాధానంగా నిలిచింది' అని ఎన్ఆర్ఐలు అభిప్రాయపడుతున్నారు. చట్టం ముందు అందరూ సమానమే, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించే అధికారులకు ఇదో హెచ్చరికగా మిగిలిపోతుందంటున్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1200 కోట్లు విడుదల శుభపరిణామం

**• విశాఖలో వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసిన విద్యార్థి సంఘాలు**



విశాఖపట్నం (చైతన్యరథం): ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రభుత్వం రూ.1200 కోట్లు విడుదల చేయడం శుభపరిణామమని వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ వ్యాఖ్యానించారు. గురువారం డాబా గార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం వద్ద వి.ఎం.ఆర్.డి.ఎ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసిన రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ... భారీ కేక్ కట్ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూ. 1,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసిన మంత్రి నారా లోకేష్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు తీసుకున్నందుకు నారా లోకేష్‌కి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల తరుపున కృతజ్ఞతా పూర్వకమైన అభినందనలు తెలియజేస్తున్నామని తెలిపారు. పెండింగ్ బకాయిలను మంజూరు చేసి విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కల్పించారని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి కట్టుబడి ఉన్న నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఎల్లప్పుడూ విద్యార్థుల పక్షాన నిలిచే వ్యక్తి అని, రాష్ట్రవ్యాప్తంగా యువత అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న నాయకుడిగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నిలిచారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్యకు ప్రాధాన్యం ఇచ్చిన నిర్ణయం శ్లాఘనీయమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్మెంట్ ఫీజు చెల్లించకుండా విద్యార్థులను అనేక ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు సీ.హెచ్ పట్టాభిరామ్ మాట్లాడుతూ... విద్యార్థుల అవసరాలను తెలుసుకొని వారికి అండగా నిలిచిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్య వైశ్యా కార్పొరేషన్ డైరెక్టర్ కే.రూప, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కోట నరేష్, టీడీపీ కమిటీ సభ్యులు పోతన్నరెడ్డి, సభ్యులు జి.సత్య, జనసేన నాయకులు డాక్టర్ మర్రివేముల శ్రీనివాస్, రాజేష్, పోతు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో మరో ప్రతిష్టాత్మక సంస్థ ఏర్పాటు

విశాఖపట్నం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో ప్రతిష్టాత్మక సంస్థ కొలువుదీరనుంది. విశాఖపట్నంలో దివ్యాంగుల కోసం స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటు కానుంది. ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. విశాఖపట్నంలో దివ్యాంగుల క్రీడా కేంద్రం (దివ్యాంగుల స్పోర్ట్స్ సెంటర్) నెలకొల్పేందుకు సహకరించాలంటూ.. టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కేంద్రాన్ని కోరారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్‌తో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశంలో వివిధ ప్రాంతాల్లో దివ్యాంగుల కోసం క్రీడా కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయంపై చర్చించారు. ఈ క్రమంలోనే విశాఖపట్నంలో దివ్యాంగుల క్రీడా కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారని.. ఇందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ముందడుగు వేసిందన్నారు.

దివ్యాంగుల క్రీడా కేంద్రం నిర్మాణం కోసం విశాఖపట్నం జిల్లా బక్కన్నపాలెంలో ఏపీ ప్రభుత్వం 22.64 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా గుర్తించిన విషయాన్ని ఎంపీ కృష్ణదేవరాయలు.. కేంద్ర మంత్రికి వివరించారు. 2025 మార్చి నెలలో కేంద్ర ప్రభుత్వ అధికారులు.. స్థల పరిశీలన కూడా చేశారన్నారు. దివ్యాంగుల క్రీడా కేంద్రం ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని పత్రాలు సమర్పించి పూర్తి సహకారం అందించినట్లు వివరించారు.

ఈ నేపథ్యంలో విశాఖలో దివ్యాంగుల క్రీడా కేంద్రం త్వరితగతిన ఏర్పాటు చేసేలా.. కేంద్ర ప్రభుత్వం అవసరమైన ఆర్థిక సహాయం, పరిపాలనా ఆమోదాలు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే.. ఆంధ్రప్రదేశ్‌లోని దివ్యాంగ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ సదుపాయాలు లభిస్తాయని.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు.

మరోవైపు రూ.200 కోట్లతో విశాఖలో దివ్యాంగుల స్పోర్ట్స్ సెంటర్ నిర్మించేందుకు కేంద్రం గతంలో అంగీకరించింది. ఈ సెంటర్ నిర్మాణం పూర్తి అయ్యి అందుబాటులోకి వస్తే.. భారతదేశంలోనే రెండో దివ్యాంగుల క్రీడా కేంద్రంగా నిలుస్తుంది. అలాగే దక్షిణ భారతదేశంలోనే తొలి దివ్యాంగుల క్రీడా కేంద్రంగా గుర్తింపు సంపాదించుకుంటుంది. అయితే గతేడాది మార్చి నెలలో కేంద్ర బృందం పరిశీలన తర్వాత.. ఈ ప్రాజెక్టుపై అడుగులు ముందుకు పడలేదు. దీంతో దివ్యాంగుల క్రీడా కేంద్రం నిర్మాణానికి అయ్యే ఆర్థిక సాయం, అనుమతులు మంజూరు చేయాలంటూ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు కేంద్ర మంత్రిని కోరారు.

# పార్వతీపురంలో చెరువులను రక్షించండి : ఎమ్మెల్యే బోనెల



పార్వతీపురం (చైతన్యరథం): గత ప్రభుత్వ హయాంలో అన్యాక్రాంతమైన చెరువులను పరిరక్షించాలని ఎమ్మెల్యే బోనెల విజయ్చంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం డిప్యూటీ స్పీకర్ రామకృష్ణరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్వతీపురంలోని అనేక చెరువులను కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని. స్థానికులు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అధికారులతో కలిసి అక్కడ పరిశీలించగా భారీ ఎత్తున ఆక్రమణలను గుర్తించినట్లు సభకు వివరించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత రెవెన్యూ రికార్డులు కనిపించడంలేదని, గత ప్రభుత్వంలో నాయకుల ఇళ్లల్లో ఆ రికార్డు ఉన్నట్లు తెలిసిందన్నారు. జిల్లా కలెక్టర్ సైతం ఏమీ చేయలేని పరిస్థితిలో పార్వతీపురంలో ప్రభుత్వ భూములు పరిస్థితి ఉందని ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై రెవెన్యూ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేశామని, ప్రస్తుతం ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. తక్షణమే ఎంక్వైరీ కమిషన్ ద్వారా దర్యాప్తు చేపట్టి ప్రభుత్వ చెరువులను కాపాడాలని ఎమ్మెల్యే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# చీకట్లో మగ్గిపోతున్న గిరిజనులు... కాగడాల మధ్య జీవనం



అల్లూరి జిల్లాలోని ఆ ఏజెన్సీ గ్రామం చీకట్లో మగ్గిపోతోంది. సూర్యాస్తమయం అయితే కాగడాల వెలుతురులోనే వాళ్ళ జీవనం. ఎన్నో ఏళ్ల పోరాటంతో.. ఇటీవల వీరికి సోలార్ ప్యానల్‌తో విద్యుత్ వెలుగులు అందాయి. గతంలో ఎన్నడూ లేని విద్యుత్ కాంతులు అనడంతో ఒక్కసారిగా ఆ గిరిజనులు ఎగిరి గంతేశారు. కానీ ఆ ఆనందం ఎంతకాలం నిలవలేదు. సోలార్ ప్యానల్ కూడా మూలాన చేరడంతో.. సమస్య మళ్ళీ మొదటికి వచ్చింది. దీంతో కాగడలు చేత పట్టుకుని తమ గ్రామానికి విద్యుత్ వెలుగులు నింపండి మహా ప్రభో అని వేడుకుంటున్నారు. ఈపీడీసీఎల్ సిఎండి స్వీకరించిన తర్వాత.. దయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే ఆ గిరిజనులు.. సిఎండికి ఫోన్ చేసి. హలో సార్ మాకు కరెంటు లేదండి.. విద్యుత్ సౌకర్యాన్ని కల్పించండి సారూ అంటూ వేడుకున్నారు. అనంతగిరి మండలం మారుమూల దబ్బలపాడు విద్యుత్ సౌకర్యానికి దూరమై స్థానిక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండలపై దట్టమైన అటవీ ప్రాంతంలోని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. రాత్రివేళల్లో కాగడాలతో వెలుతురులో కాలం వెళ్లదీస్తున్నారు. గ్రామంలో 2013-14 లో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. మూడేళ్ల వరకు బాగానే పనిచేసింది. ఆ తరువాత మూలకు చేరింది. అయితే, అప్పటి నుంచి గిరిజనులు చీకటి పడితే.. కాగడాల మధ్య జీవనాన్ని సాగించాల్సి వస్తోంది. గతంలో ఈ ప్రాంతంలో 24 కుటుంబాలు జీవనం సాగించేవి. గ్రామంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పెదరావకొండ కిందకు 15 కుటుంబాల గిరిజనులు దిగి వచ్చేశారు. మిగిలిన కుటుంబాలు కొండపైనే జీవనం సాగిస్తున్నాయి. విద్యుత్ సౌకర్యం లేక రాత్రివేళల్లో వన్యప్రాణుల మధ్య కాలాన్ని భయం భయంగా వెళ్లదీయాల్సి వస్తోందని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సోలార్ విద్యుత్ ప్లాంట్ కు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని అభ్యర్థిస్తున్నారు. లేకుంటే తమ గ్రామానికి శాశ్వత విద్యుత్ సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్నారు. తమ మొర ఆలకించి సమస్య తీర్చాలని ఆ గిరిజనులు కోరుతున్నారు.

# ఏపీలో కొత్తగా రెండు ఆర్టీసీ బస్ డిపోలు...

## 750 బస్సులు ఏపీకి కేటాయించిన కేంద్ర ప్రభుత్వం



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో నిధులతో పాటుగా ఆయా పథకాల కింద లబ్ది పొందుతోంది. 'పీఎం- ఈబస్ సేవ' పథకం కింద ఏపీఎస్ఆర్టీసీకి కేంద్రం విద్యుత్ బస్సులు కేటాయించిన సంగతి తెలిసిందే. మొత్తం 750 ఎలక్ట్రికల్ బస్సుల్ని 11 నగరాలకు కేటాయించారు. ఈ మేరకు విద్యుత్ బస్సుల కోసం ఆయా డిపోల్లో సివిల్, విద్యుత్ పనులు దిశగా అడుగులుపడుతున్నాయి. ఈ 750 కొత్త బస్సుల్లో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరుకు 100 బస్సుల చొప్పున కేటాయించారు. రాజమహేంద్రవరం, కాకినాడ, మంగళగిరి, తిరుపతి (మంగళం), అనంతపురం, కడప, కర్నూలుకు 50 బస్సుల చొప్పున కేటాయించారు. ఏపీకి కేటాయించిన ఈ 750 బస్సుల్ని పుణెకు చెందిన పినాకిల్ సంస్థ నడపుతుంది. రాష్ట్రానికి కేటాయించిన ఈ బస్సుల కోసం డిపోల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలి. కేంద్రం వాటా కింద సివిల్ పనుల్లో రూ.64 కోట్లు విడుదల చేశారు. అలాగే హై టెన్షన్ కరెంట్ లైన్లు, సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.101 కోట్లు కూడా మంజూరు చేశారు. ఈ పనులకు సంబంధించి ఆయా డిపోల వారీగాపనులు చేపట్టేందుకు టెండర్లు పిలవనున్నారు. ఈ డిపోల్లో ఆర్టీసీ సివిల్ ఇంజనీరింగ్ విభాగం సివిల్ పనుల్ని చేపడుతుంది. విద్యుత్‌శాఖ విద్యుత్‌కు సంబంధించిన పనులు చేపట్టనుంది. 2027 మార్చి నాటికి ఈ పనులు పూర్తి చేసి ఎలక్ట్రికల్ బస్సులు ప్రారంభించాలని భావిస్తున్నారు. విద్యుత్ బస్సుల కోసం మొత్తం 11 డిపోల్లో ఏర్పాట్లు చేయనున్నారు.. సివిల్, విద్యుత్ పనులకు కేంద్రం నిధులు విడుదల చేసింది. విశాఖపట్నం, రాజమహేంద్రవరంలలో కొత్త డిపోల నిర్మించనున్నారు.

విజయవాడ విద్యాధరపురం నుంచి 200 ఎలక్ట్రికల్ బస్సులు నడపనున్నారు. అక్కడ వర్క్‌షాపులలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి.. వాటిని పరిష్కరించనున్నారు. అక్కడ డిపోను ఎత్తు పెంచి కొత్తగా నిర్మాణం చేయనున్నారు. గుంటూరు-2 డిపోకు 100 బస్సులు కేటాయిస్తారు.. ఆ డిపోను కూడా ఎత్తులో నిర్మిస్తారు. నెల్లూరు-2 డిపోకు కూడా 100 బస్సులు కేటాయించగా.. అక్కడ సివిల్ పనులు చేస్తారు. విశాఖపట్నానికి కేటాయించిన 100 బస్సుల్లో గాజువాక డిపోకు 50 కేటాయించారు. అక్కడ డిపోలో ఈ ఎలక్ట్రిక్ బస్సుల కోసం కొత్తగా నిర్మాణం చేయనున్నారు. మరో 50 బస్సుల కోసం సింహాచలం దగ్గర కొత్తగా నిర్మించే సింహపురి డిపోకు కేటాయిస్తారు. మిగిలిన కాకినాడ, మంగళగిరి, రాజమహేంద్రవరం, తిరుపతి మంగళం, కడప, కర్నూలు, అనంతపురం డిపోల్లో విద్యుత్ బస్సుల కోసం సివిల్ పనులు చేస్తారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియను ప్రారంభించనున్నారు.. కాంట్రాక్టర్ ఎంపిక పూర్తికాగానే పనులు ప్రారంభించనున్నారు. మొత్తం మీద రాష్ట్రానికి త్వరలోనే ఎలక్ట్రికల్ బస్సులు రాబోతున్నాయి.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# మచిలీపట్నంలో నౌకా నిర్మాణం... మరమ్మత్తుల కేంద్రం



మచిలీపట్నం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధిపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా రాష్ట్ర రాజధానికి సమీపంలో ఉన్న మచిలీపట్నం పోర్టు పనుల్ని కేంద్రం సహకారంతో మరింత వేగవంతం చేసింది. తాజాగా మచిలీపట్నంలో నౌకా నిర్మాణం (షిప్ బిల్డింగ్), మరమ్మతుల కోసం కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. మారిటైం బోర్డు సీఈవో ఆర్ఎఫ్‌పీ జారీ చేసేందుకు ప్రభుత్వాన్ని అనుమతి కోరగా.. గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏపీ మారిటైం బోర్డు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ) జారీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణం, మరమ్మతుల కేంద్రాన్ని డీబీఎఫ్‌వోటీ (డిజైన్, బిల్ట్, ఫైనాన్స్, ఆపరేటింగ్ అండ్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఏర్పాటు చేయనున్నారు.

మచిలీపట్నంలో ప్లాన్ చేస్తున్న నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఓ సంస్థ ప్రతిపాదించిందట. 200 ఎకరాలలో, సుమారు రూ.1,500 కోట్లతో గోవా షిప్‌యార్డు లిమిటెడ్ మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెబుతోందట. ఈ మేరకు భూమిని కేటాయించాలని కూడా కోరింది. అయితే రూ.7,600 కోట్లతో ప్రాజెక్టు చేపట్టేందుకు యునైటెడ్ పెట్రో గ్రూప్ కూడా అధికారులతో సంప్రదింపులు జరుపుతోందట. త్వరలోనే దీనిపై కూడా క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. మచిలీపట్నంలో పోర్టు నిర్మాణ పనులు రూ.4,735.18 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. మచిలీపట్నం పోర్టులో 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభించాలని భావిస్తున్నారు.

ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి స్పందించారు. 'మచిలీపట్నంలో నౌకా నిర్మాణం, మరమ్మత్తుల సదుపాయాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయడం బందరు అభివృద్ధికి కొత్త అధ్యాయం. పోర్ట్ రూపురేఖలు మారి, ఉపాధి అవకాశాలు విస్తరించే చారిత్రాత్మక నిర్ణయం. ఈ అంశానికి సంబంధించిన జీవోను జారీ చేసి అనుమతులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కి నా కృతజ్ఞతలు' అంటూ మచిలీపట్నం ఎంపీ బాలశౌరి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# చిన్నజీయర్ స్వామీజీకి ఎమ్మెల్యే చింతమనేని పాదపూజ



దెందులూరు (చైతన్యరథం): "రైతు సంక్షేమం కోసం తపిస్తూ, సహజ సిద్ధ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, భూసారాన్ని రక్షించాలంటూ శ్రీశ్రీశ్రీ మన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామీజీ చేపట్టిన సుఫల రైతు పాదయాత్ర ఎంతో అభినందనీయమని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదవేగి మండలంలోని వంగూరు, కవ్వగుంట, గార్లమడుగు, లక్ష్మీపురం గ్రామాల్లో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామీజీ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడిన సుఫల రైతు పాదయాత్ర కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని చిన్న జీయర్ స్వామిజి వారి పాద పద్మములకు పుష్పాలను సమర్పించి నమస్కరించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో శ్రీ చిన్న జీయర్ స్వామీజీ వారు ఎంతో ఆప్యాయంగా, అభిమానంగా కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక సందేశాలతో పాటు, రైతు సంక్షేమం కోసం తపిస్తూ, భూసారం పరిరక్షణ కోసం, ప్రకృతి సేద్యం కోసం, రసాయనాలను వాడకుండా సేంద్రియ ఎరువులు వాడే విధంగా ప్రోత్సహిస్తూ, గో సంరక్షణ కోసం ఇలా అనేక అంశాలను ప్రభావితం చేసేలా శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామీజీ వారు చేపట్టిన సుఫల రైతు పాదయాత్ర కార్యక్రమం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, చిన్న జీయర్ స్వామీజీ వారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు

● అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య హెచ్చరిక



గురువారం (చైతన్యరథం): నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలుస్తున్న గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావుపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య తీవ్రంగా హెచ్చరించారు. గురువారం అంబాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గన్నవరంలోని ఓ రైతు బజార్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తూ, అనుకూల మీడియా వేదికగా వైసీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని సీతయ్య ఖండించారు. ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మేస్తారని భావించడం వైసీపీ నాయకుల అపోహ మాత్రమేనన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న ప్రజానాయకుడిగా యార్లగడ్డ వెంకట్రావు పేరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఆయనకు పెరుగుతున్న ప్రజాదరణను తట్టుకోలేకే వైసీపీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తన వ్యక్తిగత వ్యాపారాలను పక్కనపెట్టి ప్రజాసేవకు అంకితభావంతో పని చేస్తున్న నాయకుడు యార్లగడ్డ వెంకట్రావు అని, రోజుకు 20 గంటలకు పైగా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పి వసూలు చేస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. నిజంగా ఎమ్మెల్యే తప్పుచేసి ఉంటే తగిన ఆధారాలు చూపాలని వైయస్సార్ సీపీ నాయకులకు సవాల్ విసిరారు. ఈ విలేకరుల సమావేశంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండల రాజేష్, మాజీ ఎంపీపీ తోడేటి రూబెన్, టిడిపి సీనియర్ నాయకులు చిలుకూరి ప్రభాకర్, వసంత్, ఎన్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడ్ని మోసగించిన సైబర్ నేరగాళ్లు

కోనసీమ (చైతన్యరథం): మామిడికుదురు మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్నాడు. ఫేస్బుక్లో కనిపించిన లింక్ని క్లిక్ చేయగా కేంద్ర ప్రభుత్వ పథకం పేరిట మోసగాళ్లు ఆయనను సంప్రదించారు. రూ.10 లక్షల విలువైన ఎరువులు అందిస్తామని, వాటిని విక్రయిస్తే రూ.5 లక్షలు కమీషన్ ఇస్తామని చెప్పారు. రకరకాల మాటలు చెప్పి విడతల వారీగా అతడి దగ్గరి నుంచి రూ.24 లక్షలు వసూలు చేయడమే గాక బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రూ.9.50 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు తీసుకోకుండా నియంత్రించగలిగారు.

# "కందుకూరి" చరిత్ర భవిష్యత్తు తరాలకు తెలియాలి

● రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు సమాజానికి చేసిన సేవ... ఆయన చరిత్ర మన ముందు తరాలకు తెలియాల్సి అవసరం ఎంతైనా ఉందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రూ. 30 లక్షలతో వకాయల వారి వీధిలోని కందుకూరి వీరేశలింగం పంతులు స్వగృహానికి చేపట్టిన రెనోవేషన్ పనులను ఆయన జనసేన పార్టీ రాజమండ్రి ఇంచార్జ్ అత్తి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగం పంతులు స్వగృహం శిథిలావస్థలో ఉందని, గత ఐదేళ్ల వైకాపా పాలనలో విస్మరించబడినట్టు ఆరోపిస్తూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ చారిత్రక ఆస్తిని పునరుద్ధరించేందుకు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సహకారంతో రూ. 30 లక్షల రూపాయలు మంజూరు చేసి, మరమ్మత్తు పనులు ప్రారంభమైనట్లు ప్రకటించారు.

**చారిత్రక ప్రాముఖ్యత :**

కందుకూరి వీరేశలింగం పంతులు బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాల నిషేధాలకు వ్యతిరేకంగా పోరాడి ఈ ఇంటిలోనే 1881 డిసెంబర్ 11న తొలి వితంతు పునర్వివాహం జరిపించారని గుర్తు చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం 1893లో ఆయనకు 'రావు బహదూర్' బిరుదు ప్రదానం చేసిందన్నారు. సమాజహితం కోరుతూ తన యావదాస్తిని దానం చేసిన కందుకూరి రచనలు, బట్టలు, కుర్చీ, మఫ్లర్‌లు ఇక్కడ భద్రంగా ఉన్నాయని, వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు.

**వైకాపా పాలనలో హీనావస్థ :**

గత ఐదేళ్లు వైకాపా కందుకూరి వీరేశలింగం పంతులు వారి ఆస్తులను నిర్లక్ష్యంగా వదిలేసిందని మండిపడ్డారు. ఆయన విద్యాసంస్థల్లో ఆశాస్త్రీయంగా కొన్నింటిని దేవాదాయ, విద్యా శాఖలోకి కలిపిందని, మరికొన్నింటిని గాలికి వదిలేవడం వల్ల వాటి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని వాపోయారు. గత పాలకులు ఈ ఇంటిని కూడా నిర్లక్ష్యంగా వదిలేశారని మండిపడ్డారు. టౌన్ హాల్ కు గత ఐదేళ్లు తాళాలు వేసి మూసేసారని విమర్శించారు. 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మరమ్మత్తులు చేసినా, అటు తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా కందుకూరి ఆస్తులపై నిర్లక్ష్యం చూపడం వీరేశలింగంపంతులుపై కక్ష కలిగిన చర్యలా ఉందన్నారు.

**కూటమి చొరవలు :**

ఎంపీ పురందేశ్వరి వారి ఎంపీ నిధుల నుంచి రూ. 30 లక్షలు మంజూరు చేసి, కాంపౌండ్ వాల్, టాయిలెట్లు, టేకువుడ్ బీమ్స్, ఫ్యాన్ టైల్స్‌తో మరమ్మత్తు పనులు జరుగుతున్నాయన్నారు. మరో రూ. 50 లక్షలతో పూర్తి చేసి, భవిష్యత్ తరాలకు అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. ప్రస్తుతం స్థానిక నాయకుల ద్వారా టౌన్ హాల్ కు మరమ్మతులు చేపట్టి దానిని కూడా తెరిచి, లైబ్రరీని, కళాకారులకు వేదికను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.

**ప్రజలకు పిలుపు :**

ప్రజలు, విద్యార్థులు, మునుపటి విద్యార్థులు ఈ చారిత్రక స్థలాన్ని సందర్శించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ ఆస్తులన్నీ కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పురావస్తు శాఖ, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం



ఉంగుటూరు (చైతన్యరథం): పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదనే దృఢ సంకల్పంతో విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చర్యలు తీసుకుంటున్నారని ఏలూరు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రెడ్డి చందు అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1200 కోట్లు మంజూరు చేసిన సందర్భంగా ఉంగుటూరు మండలం నారాయణపురంలోని శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంత్రి లోకేశ్ చిత్రపటానికి గురువారం విద్యార్థులు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థులను మోసం చేసిందన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఇచ్చిన హామీని లోకేశ్ నెరవేర్చారన్నారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ మహేశ్ యాదవ్, సర్పంచి దిద్ద అలకనంద, టీడీఐపీ సీనియర్ నాయకుడు బొమ్మిడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ చొరవతో కేసరపల్లికి కస్టమ్స్ కార్యాలయం



గన్నవరం (చైతన్యరథం): గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కృషితో కేసరపల్లిలో కస్టమ్స్ కార్యాలయాల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కస్టమ్స్ ప్రివెంటివ్ కమిషనరేట్, సెంట్రల్ ఎక్సైజ్ మరియు సర్వీస్ టాక్స్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు వీలుగా ప్రభుత్వం 3.84 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. కేసరపల్లిలోని సర్వే నంబర్ 29/8లో ఈ భూమిని కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం బుధవారం జరిగిన సమావేశంలో ఆమోదముద్ర వేసింది. ఇక్కడ కేవలం కార్యాలయ భవన సముదాయమే కాకుండా, అధికారులు మరియు సిబ్బంది కోసం నివాస గృహాలను కూడా నిర్మించనున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చేలా చేయడంతో, త్వరలోనే ఈ కార్యాలయాలన్నీ కేసరపల్లిలో కొలువుదీరనున్నాయి.

# గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ

●ఎన్.ఐ.ఆర్.డిలో హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్‌పై 4వ రోజు శిక్షణ

●స్క్రీన్ ప్రింటింగ్, పల్ప్, షీట్ నిర్మాణం తయారీలో శిక్షణ



విజయవాడ (చైతన్యరథం): గ్రామీణ మహిళలు తమ జీవనోపాధి అవకాశాలను విస్తరించుకుని ఆర్థికంగా స్వాలంబన సాధించే దిశగా నడిపించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ సారధ్యంలో కేశినేని ఫౌండేషన్, ఎన్.ఐ.ఆర్.డి సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎన్.ఐ.ఆర్.డి ప్రధాన కార్యాలయంలో హ్యాండ్ మేడ్ పేపర్ ప్రొడక్ట్స్ తయారీపై అందిస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎస్.హెచ్.జి మహిళలు అందిపుచ్చుకుంటున్నారు. ఫిబ్రవరి 9వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో నాలవ రోజు గురువారం ఎన్.ఐ.ఆర్.డిలో ఎస్.హెచ్.జి మహిళలు పొందిన శిక్షణ వివరాలను తెలియజేస్తూ ఎంపీ కేశినేని శివనాథ్, కేశినేని ఫౌండేషన్ కార్యాలయం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్.ఐ.ఆర్.డిలో హ్యాండ్ మేడ్ పేపర్ ఉత్పత్తుల తయారీకి సంబంధించి గాంధీ హ్యాండ్ మేడ్ పేపర్ యూనిట్ అధికారి జె.రవీంద్రరావు నేతృత్వంలో పల్ప్ తయారీ, షీట్ నిర్మాణం, స్క్రీన్ ప్రింటింగ్, ఎన్వలప్ కవర్స్, పెన్స్ స్టాండ్ తయారీపై అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు.

# ప్రభుత్వ సంకల్పానికి ప్రతిబింబం గవర్నర్ ప్రసంగం

● అసెంబ్లీలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (చైతన్యరథం): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంకల్పానికి ప్రతిబింబంగా ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం అసెంబ్లీలో రాష్ట్ర గవర్నర్ ప్రసంగంపై ఎమ్మెల్యే నసీర్ ధన్యవాదాలు తెలుపుతూ మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో విధ్వంసం నుంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకుంటున్న నిర్ణయాలు, పరిస్థితులు తెలియజేసేలా గవర్నర్ ప్రసంగం సాగిందని ఎమ్మెల్యే నసీర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో గాడితప్పిన పాలన, దిగజారిన పరిస్థితులను చక్కదిద్దేందుకు కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనవైపు అడుగులు వేస్తున్నామని వెల్లడించారు. ఈ క్రమంలో భారతదేశంలో ప్రపంచంలోనే అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా మారిందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి తెలియజేసేలా ప్రతి అంశంపై శ్వేతపత్రాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. జీరో పావర్టీ అనేది కేవలం నినాదం కాకుండా ఆచరణలో చేసిన చూపుతున్నామని చెప్పారు. దీని కోసం సంక్షేమంతోపాటు స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ ద్వారా సీఎం చంద్రబాబునాయుడు ఉజ్వల భవితకు బాటలు వేస్తున్నారని తెలిపారు. 1995లో విజన్ -2020 నినాదంతో అద్భుత ఫలితాలు సాధించారన్నారు. అప్పట్లో జన్మభూమి కార్యక్రమం ద్వారా విదేశాల్లో ఉన్న భారతీయులను సైతం మాతృభూమి వైపు తిరిగేలా చేశారని, ఇప్పుడు పీ4 కార్యక్రమం ప్రతి కుటుంబాన్నీ ఆర్థికంగా బలోపేతం చేయనున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఉన్నతంగా మార్చారని, పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ద్వారా విద్యార్థుల సామర్థ్యాల మదింపు చేపట్టారని, ఇదొక రికార్డని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారని అన్నారు.

# జిల్లా అభివృద్ధి... పార్టీ విస్తరణే మా లక్ష్యం : గద్దె అనురాధ



విజయవాడ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన గద్దె అనురాధ, బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఆటోనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలను సమగ్రంగా పరిశీలించి, పార్టీ కార్యకలాపాల నిర్వహణపై సవివరంగా సమాచారం తెలుసుకున్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు చేపడుతున్న ఎన్టీఆర్ జిల్లా నూతన పార్టీ కార్యాలయ నిర్మాణ పనుల పురోగతిపై ఆమె ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. త్వరలో జరగనున్న భూమిపూజ దృష్ట్యా గ్రౌండ్ క్లియరెన్స్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రణాళికలు, భవన రూపకల్పన, ప్రాథమిక వసతుల ఏర్పాటు తదితర అంశాలపై పార్టీ నాయకులు, సంబంధిత అధికారులతో చర్చించారు. నిర్మాణ పనులు వేగవంతం కావడానికి కాంట్రాక్ట్ సంస్థకు స్థానికంగా ఎదురవుతున్న ఇబ్బందులపై దృష్టి సారించి, అవసరమైన సహకారం అందించాల్సిందిగా స్పష్టమైన సూచనలు చేశారు. భవిష్యత్‌లో జిల్లా పార్టీ కార్యాలయం శక్తివంతమైన కార్యకలాపాల కేంద్రంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిని వ్యక్తిగతంగా పరిచయం చేసుకుని, రోజూ కార్యాలయానికి వచ్చే నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయంగా ముచ్చటించారు. ప్రతి కార్యకర్త, ప్రతి నాయకుడు సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేస్తే జిల్లాలో పార్టీ మరింత బలపడుతుందని ఆమె పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి- పార్టీ విస్తరణే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంట్ (ఎన్టీఆర్ జిల్లా) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పార్టీ నాయకులు, శ్రేణులు, అభిమానులందరికీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్తు కోసం రూ.1200 కోట్లు విడుదల హర్షణీయం

● విజయవాడలో కృతజ్ఞత ర్యాలీ నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా టీఎన్ఎస్ఎఫ్ సభ్యులు, విద్యార్థులు




విజయవాడ (చైతన్యరథం): విద్యార్థుల భవిష్యత్తు కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ. 1200కోట్లు విడుదల చేయడం హర్షణీయమని ఎన్టీఆర్ జిల్లా టీఎన్ఎస్ఎఫ్ సభ్యులు, విద్యార్థులు వ్యాఖ్యానించారు. ఈ మేరకు ప్రభుత్వానికి, రాష్ట్ర విద్యశాఖ మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు టీఎన్ఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.చరణ్‌సాయి యాదవ్ మాట్లాడుతూ... రాష్ట్ర విద్యాశాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి పెండింగ్లో ఉన్న 1200 కోట్ల రూపాయలను విడుదల చేసి చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థుల కష్టాలను అర్థం చేసుకొని, వారికి అండగా నిలిచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి విద్యాపట్ల నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. యువగళం కార్యక్రమంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్న ఆయనపై యువతకు మరియు విద్యార్థులకు విశ్వాసం మరింత పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం మాటలు చెప్పే ప్రభుత్వం కాదని చెప్పింది చెప్పినట్లే చేసి చూపిస్తోందనడానికి ఇది స్పష్టమైన నిదర్శనమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని విద్యార్థుల తరుపున విద్యార్థుల తల్లిదండ్రుల తరపున మంత్రి నారా లోకేష్‌కి కృతజ్ఞతగా ఈ కృతజ్ఞతా రాలిని నిర్వహించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అధ్యక్షుడు బంగారు సతీష్, వడ్లమూడి వంశీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకులు పద్ధతి మార్చుకోవాలి

●సనాతన ధర్మంతో రాజకీయాలు చేయొద్దు... ఏపీ అర్చక సేవా సంఘం హెచ్చరిక

అమరావతి (చైతన్యరథం): సనాతన ధర్మాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వరస్వామితో చెలగాటం మంచిది కాదని ఆంధ్రప్రదేశ్ అర్చక సేవా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణం వేణుగోపాల్, జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రిలు హెచ్చరించారు. ఈమేరకు వారు గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వైసీపీ నాయకుడు కరుణాకర్ రెడ్డి వ్యాఖ్యలను వారు తీవ్రస్థాయిలో ఖండించారు. కల్తీ నెయ్యి ఉపయోగించి తిరుమల శ్రీవారిని, భక్తులను మోసం చేయడమే కాకుండా వైసీపీ నాయకులు ఎదురుదాడి చేయడం దుర్మార్గమన్నారు. పవిత్ర లడ్డూలో నెయ్యికి బదులుగా రసాయనాలు కలిపి మహాపాపం చేశారని దాన్ని కప్పిపుచ్చుకునేందుకు వైసీపీ నాయకులు నానా యాగీ చేస్తున్నారని అన్నారు. తిరుమల క్షేత్రంలో కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి జరిపే నిత్య కైంకర్యాలు, సనాతన సంప్రదాయాలు పర్యవేక్షణ చేసే పెద జీయర్ స్వామిపై సైతం వైసీపీ నాయకుడు భూమన కరుణాకరరెడ్డి అడ్డగోలు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. సిట్ రిపోర్టుపై స్పందించిన పెద జీయర్ ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడుతున్నారని లాబీయింగ్, పైరవీలకు పాల్పడుతున్నారంటూ వైసీపీ నాయకులు మాట్లాడటం నీచాతి నీచమన్నారు. వైసీపీ హయాంలో టీటీడీని భ్రష్టుపట్టించారని, లడ్డూ ప్రసాదం, పాలల్లో కల్తీ, అన్నదానంలో పురుగులు పట్టిన బియ్యం వాడటం, తిరుమల కొండపై అన్యమత ప్రచారాలను నియంత్రించ లేకపోవటం వంటి తప్పిదాలు మరుగున పెట్టి పెదజీయర్ స్వామి మమల్ని విమర్శించారని అనటం హాస్యాస్పదమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా నిత్యం కోట్లాదిమంది సేవలు అందుకుంటున్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి సంప్రదాయాలను పర్యవేక్షించే పెద జీయర్‌స్వామివారిని, మఠాలను, పీఠాధిపతులను విమర్శించటం వాళ్ళని రాజకీయాలకు ముడిపెట్టడం హర్షణీయం కాదన్నారు. ఇప్పటికైనా సిట్ నివేదికను గౌరవిస్తూ తాము చేసిన తప్పులను అంగీకరిస్తూ కరుణాకర్‌రెడ్డి స్వామివారికి క్షమాపణలు కోరుకోవాలని సనాతన సాంప్రదాయాలని పీఠాధిపతులు, మఠాధిపతులను రాజకీయాల్లోకి లాగరాదని హితవు పలికారు.

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఏలూరు (చైతన్యరథం): పేదల ముంగిళ్లలో సంక్షేమ కాంతులు విరియాలనే తన సంకల్పానికి, ఆకాంక్షకు అద్దం పట్టేలా పుట్టినరోజును వేడుకలకు వేదికగా కాకుండా సేవా కార్యక్రమాల పరంపరకు వారసత్వంగా మార్చాలన్నదే తన జీవితాశయమని ఏలూరు ఎమ్మెల్యే, జిల్లా టిడిపి అధ్యక్షులు బడేటి చంటి స్పష్టం చేశారు. గురువారం తన జన్మదినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, బడేటి అభిమానులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ తన పుట్టినరోజు పేదలకు ఒక పండుగలా మారాలనే స్ఫూర్తితో ముందుకెళ్తున్నానన్నారు. దీనిలో భాగంగానే ఎక్కడా ఆడంబరాలకు పోకుండా అవసరార్థులకు సేవలు అందించాలనే సదాశయాన్ని తనవారందరిలోనూ నింపుతూ వచ్చినట్లు వెల్లడించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

- నెల్లూరు రూరల్‌లో రూ.27 కోట్ల అభివృద్ధి పనులు వేగవంతం
- 240 పనుల్లో 121 పూర్తి
- ట్రాన్స్‌ఫార్మర్లతో లో-వోల్టేజ్ సమస్యకు పరిష్కారం
- టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ.27 కోట్ల వ్యయంతో చేపట్టిన 240 అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. 29వ డివిజన్ గాంధీనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను నగర కార్పొరేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించి, పనుల నాణ్యత, పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గత నెల 24వ తేదీన స్థానిక ప్రజల చేత శంకుస్థాపనలు చేసి పనులను ప్రారంభించామని, ఇచ్చిన హామీ ప్రకారం 60 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. మొత్తం 240 పనుల్లో 121 కాంక్రీట్ పనులు పూర్తై ప్రస్తుతం క్యూరింగ్ దశలో ఉన్నాయని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా తీసుకుని ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. ఇదిలా ఉండగా, 27, 28, 29వ డివిజన్లలో రూ.37 లక్షల 10 వేల వ్యయంతో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను స్థానిక కార్పొరేటర్లు ప్రారంభించారు. ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా లో–వోల్టేజ్ సమస్యపై వచ్చిన ఫిర్యాదుల మేరకు, 11 డివిజన్లలో రూ.1 కోటి 40 లక్షల వ్యయంతో 100 కేవీఏ, 300 కేవీఏ సామర్థ్యాల 15 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గనున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమాలలో క్లస్టర్ ఇంచార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులు, టిడిపి, బీజేపీ, జనసేన నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకే పాలన

**- నెల్లూరు 43, 6వ డివిజన్లలో ఘనంగా 'ప్రజా దర్బార్'**

**- మంత్రి నారాయణ ఆదేశాలతో ప్రజల చెంతకు తాళ్లపాక అనురాధ**



నెల్లూరు (చైతన్యరథం): నగర ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మంత్రి నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరు 43వ మరియు 6వ డివిజన్లలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు, హౌసింగ్ పాస్ బుక్కుల మోసాన్ని ఎండగట్టారు.అర్హులైన ప్రతి పేదవాడికి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను ఆన్‌లైన్ ద్వారా ట్రాక్ చేస్తూ అక్రమాలకు చెక్ పెడుతున్నామని, డ్రైనేజీ, దోమల నివారణ, రోడ్ల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుకు జవాబుదారీతనం ఉండేలా అధికారులను సమన్వయం చేస్తూ, ప్రజలకు అండగా ఉంటామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 6 వ డివిజన్ ప్రెసిడెంట్ కొండా ప్రవీణ్ ,43 వ డివిజన్ టిడిపి ముఖ్య నేతలు హాజీ ,జమీర్, అఫీజ్, రబ్బాని, ఉస్మాన్, జహీర్, అష్రాఫ్, రియాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఏపీ బ్రాండ్ నిలబెట్టేలా కూటమి పాలన

- రాష్ట్రాన్ని అగ్రగామిగా చేసేందుకు సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు.
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు ఆయుధాలతో ముందుకు సాగుతున్నారు
- సూపర్ సిక్స్ పథకాలతో ప్రజల జీవితాల్లో కనిపిస్తున్న మార్పులు
- ఇది మాటల ప్రభుత్వం కాదు... చేతల ప్రభుత్వం
- గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



అమరావతి, (చైతన్యరథం): రాష్ట్ర సమగ్రాభివృద్దే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. గవర్నర్ ప్రసంగంపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ, 20 నెలల పాలనలో రాష్ట్రం తిరిగి అభివృద్ధి బాట పట్టిందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ హామీలలో 90 శాతం అమలు చేసి ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకువచ్చినట్లు చెప్పారు. తల్లికి వందనం పథకం ద్వారా 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు జమ చేసి విద్యార్థులకు అండగా నిలిచిందన్నారు. స్త్రీ శక్తి, ఉచిత బస్సు, దీపం–2 వంటి పథకాలతో మహిళా సాధికారతకు బలమైన పునాది వేసినట్లు తెలిపారు.

రైతులకు రెండు విడతల్లో రూ.6,310 కోట్లు జమ చేసి ఆదుకున్నారని, ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా 63 లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ నియామకాలు చేపట్టినట్లు వివరించారు. రూ.21 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగావకాశాలకు మార్గం సుగమం చేసినట్లు తెలిపారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తున్నారని, పల్లెపండుగ కార్యక్రమాల ద్వారా వేలాది అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, సూపర్ సిక్స్‌తో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర దిశగా ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు.

# ప్రజల స్రవంతి పథకాన్ని పునర్విద్దించండి

- 30 వేల కుటుంబాలకు సురక్షిత మంచి నీటిని అందించండి
- ఉదయగిరి సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్



అమరావతి, (చైతన్యరథం): గత టిడిపి ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సృజన స్రవంతి పథకం 90 శాతం వరకు పూర్తయిందని, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తిగా నిర్వీరం చేసిందని,ఈ పథకాన్ని తిరిగి పునర్విదించి, ఉదయగిరి నియోజకవర్గంలోని 30 వేల కుటుంబాలకు సురక్షిత మంచినీటిని అందించాలని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తమ గళం వినిపించారు.గురువారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ, యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ 2014 నుండి 19 వరకు ఉన్న టిడిపి ప్రభుత్వంలో కుప్పం నియోజకవర్గంలో మొదటిగా ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. అక్కడ సక్సెస్ కావడంతో, నెల్లూరు జిల్లాలో మొత్తం 16 మదర్ ప్లాంట్లు మంజూరు కాగా, ఫ్లోరిన్ అధికంగా ఉన్న ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు 8 మదర్ ప్లాంట్లను మంజూరు చేశారన్నారు. 90 శాతం పనులు పూర్తయినప్పటికీ మిగిలిన 10% పనులు పూర్తి చేయాల్సిన వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఆ పథకాన్ని మరుగున పడేసింది అన్నారు. ఈ విషయాన్ని గత అసెంబ్లీ సమావేశాల్లో కూడా సభ ముందుకు తెచ్చానని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈ పథకాన్ని పునర్విద్దించాలని అధ్యక్షుని ద్వారా కోరారు. లేని పక్షంలో ఈ పథకానికి సంబంధించిన వాహనాలు, సంబంధిత వస్తువులు శిధిలావ్యవస్థకు చేరుతున్నాయని, వాటిని ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఫ్లోరిన్ బారినపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించి వారి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత మన పైన ఉందని సభ దృష్టికి ఎమ్మెల్యే తీసుకువెళ్లారు. అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమశిల జలాలను మెట్ట ప్రాంతానికి అందించి శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు.

# శ్రీకాళహస్తి 'టెంపుల్ సిటీ'గా అభివృద్ధి కావాలి

**- నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో బొజ్జల సుధీర్ రెడ్డి గళం**



శ్రీకాళహస్తి (చైతన్యరథం): శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించిన కీలక సమస్యలపై ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గళం విప్పారు. పట్టణ అభివృద్ధి, ఆలయ సిబ్బంది సమస్యలు, 22ఎ చట్టం కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వంటి అంశాలను సభ దృష్టికి తీసుకువచ్చారు.

మొదటగా, శ్రీకాళహస్తిని "టెంపుల్ సిటీ"గా అభివృద్ధి చేయాల్సిన అవసరం వుందని అసెంబ్లీలో బొజ్జల ప్రస్తావించారు. తిరుమలకి ప్రతిరోజూ వచ్చే భక్తుల్లో సగం మంది శ్రీకాళహస్తి దర్శనార్థం వస్తున్నారని పేర్కొంటూ, భక్తుల రద్దీ రోజురోజుకు పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చిందని, శాశ్వత పరిష్కారంగా ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రిని కోరారు. రెండవ అంశంగా, శ్రీకాళహస్తి దేవస్థానంలో సుమారు 1100 మంది కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే తిరుమల, శ్రీశైలం దేవస్థానాలు ఆసుపత్రులను నిర్వహిస్తున్న విధానాన్ని ఉదాహరణగా చూపిస్తూ, శ్రీకాళహస్తిలోని ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని ఆలయంతో అనుసంధానం చేసి అభివృద్ధి చేయాలని సూచించారు. ఆలయ ఆదాయంతో ఆసుపత్రిని అభివృద్ధి చేస్తే భక్తులకు, స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అభిప్రాయపడ్డారు. మూడవ అంశంగా 22ఎ చట్టం కారణంగా పేదలు, రైతులు, పట్టాదారులు తమ సొంత భూములపై హక్కులు వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలనలో తీసుకున్న నిర్ణయాల వల్ల నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. 22ఎ చట్టాన్ని సవరించి అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ మంత్రిని విజ్ఞప్తి చేశారు.

# నెల్లూరులో రాకెట్ పరిశోధన కేంద్రం

**జిల్లా అభివృద్ధికి కీలక అడుగు - ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్**

నెల్లూరు (చైతన్యరథం): నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలంలో రూ.1000 కోట్ల పెట్టుబడితో రాకెట్ పరిశోధన కేంద్రం ఏర్పాటు దిశగా ముందడుగు పడటం జిల్లా కు గర్వకారణమని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ప్రీమియం ఎక్స్‌ప్లోజివ్స్ సంస్థ ప్రభుత్వంతో కీలక ఒప్పందం కుదుర్చుకోవడం జిల్లా పారిశ్రామిక రంగానికి కొత్త దిశ చూపుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా నెల్లూరుకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షిస్తున్న తీరు అభినందనీయమని, పరిశ్రమల ద్వారా ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలిపారు. జిల్లాకు మరిన్ని మెగా ప్రాజెక్టులు రావాలని ఆకాంక్షిస్తూ, ఈ పరిశోధన కేంద్రం విజయవంతం కావాలని అజీజ్ కోరుకున్నారు.



## రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులకు ప్రత్యేక వెసులుబాటు

**ప్రార్థనల కోసం సాయంత్రం ఒక గంట ముందుగా ఇంటికి వెళ్లే అనుమతి : మంత్రి ఫరూక్**



నంద్యాల (చైతన్యరథం): రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించి, ఫిబ్రవరి 16 నుంచి మార్చి 19 వరకు ముస్లిం ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సచివాలయాల్లో సాయంత్రం ఒక గంట ముందుగా ఇంటికి వెళ్లి రావచ్చు అని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ స్పష్టం చేసినట్లు, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ సిబ్బంది, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల సిబ్బంది అందరికీ ఈ వెసులుబాటు వర్తిస్తుంది.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చాబోలు ఇలియాస్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మరియు మంత్రి ఫరూక్ కు కృతజ్ఞతలు తెలిపారు. రంజాన్ మాసంలో ఈ నిర్ణయం మైనారిటీల పట్ల పార్టీ యొక్క నిబద్ధతకు నిదర్శనం అని పేర్కొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌కు కర్నూల్ విద్యార్థులు భారీ ర్యాలీ

**- మంత్రి లోకేశ్ ధన్యవాదాలు..**

కర్నూలు (చైతన్యరథం): ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేసినందుకు కర్నూలులో మంత్రి నారా లోకేశ్కు ధన్యవాదాలు తెలుపుతూ విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. గురువారం పాణ్యం నియోజకవర్గ నాయకులు గౌరు వెంకట రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ఐదేళ్ల నుంచి విద్యార్థుల ఫీజు చెల్లించకపోవడంతో వారి ధ్రువ పత్రాలు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన తెలిపారు. మంత్రి లోకేశ్ రూ.1200 కోట్ల నిధులు మంజూరు చేయడంతో విద్యార్థుల కష్టాలు తీరాయని విద్యార్థి యువజన నాయకుడు శ్రీరామ్ తెలిపారు.




# ప్రతి ఎకరాకు నీరు అందించాలి

**రాయలసీమ సాగునీటి సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తిన రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు**

రాయదుర్గం (చైతన్యరథం): రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల అంశంపై మాట్లాడే అవకాశం లభించిందని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సీమకు జీవనాడిగా ఉన్న అనేక కీలక సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్య ప్రాజెక్టులపై సరైన దృష్టి పెట్టకుండా నిధులను నిలిపివేయడం, పనులను ఆలస్యం చేయడం వల్ల రాయలసీమ రైతుల ఆశలు దెబ్బతిన్నాయని సభ దృష్టికి తెచ్చారు. రైతులకు ప్రత్యక్ష లాభం చేకూరే ప్రాజెక్టులను కూడా రాజకీయ ప్రయోజనాల కోసం నిర్లక్ష్యం చేశారని తెలిపారు.

తుంగభద్ర హెచ్చెల్సీ (HLC) కాలువ ఆధునీకరణ పనులు ముందుకు సాగకుండా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జారీ చేసిన జీఓ కారణమైందని కాల్వ శ్రీనివాసులు అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ



నిర్ణయం వల్ల వేలాది ఎకరాలకు సాగునీరు అందకపోవడం వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ, రాయదుర్గం నియోజకవర్గానికి అత్యంత కీలకమైన ఉంతకల్లు రిజర్వాయర్, బీటీపీ ప్రాజెక్ట్ పనులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రాయలసీమలో సాగునీటి కొరత కారణంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ, ప్రాంతీయ అసమానతలను తొలగించాలంటే నీటి ప్రాజెక్టులే ప్రధాన ఆధారం అని స్పష్టం చేశారు. సాగునీటి సదుపాయం మెరుగుపడితేనే వ్యవసాయం బలోపేతం అవుతుందని, రైతుల ఆదాయం పెరుగుతుందని కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాయలసీమకు న్యాయం చేసే దిశగా కట్టుబడి ఉందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి సాగునీటి ప్రాజెక్టును ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి, ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో సీమ అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని స్పష్టం చేశారు.

### తప్పు చేయకపోతే..

# అసెంబ్లీ నుంచి ఎందుకు పారిపోయారు

- **కూటమి ప్రభుత్వానికి నిజాయతీ ఉంది.. ఏ సమస్య మీద అయినా చర్చిస్తాం**
- **వైసీపీ నాయకులకు ఎమ్మెల్యే దగ్గుపాటి చురకలు**
- **ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదలపై ఎమ్మెల్యే హర్షం**



అనంతపురం (చైతన్యరథం): వైసీపీ నాయకులు తిరుమల లడ్డూ సహా పలు అంశాల్లో వారు తప్పు చేయకపోతే అసెంబ్లీ నుంచి ఎందుకు పారిపోయారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రశ్నించారు. అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో రెండవ రోజు ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం, అవినీతి విద్యార్థి లోకాన్ని నేటికీ వెంటాడుతున్నాయన్నారు. విద్యార్థుల్లో ఎవరూ ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతోనే రూ.1200కోట్ల బకాయిలను విడుదల చేసినట్లు చెప్పారు. దీనిపై ప్రస్తుతం విద్యార్థులంతా సంతోషంగా ఉన్నారన్నారు. మరోవైపు వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి తొలిరోజే వాకౌట్ చేయడంపై ఆయన విమర్శలు చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి చర్చిస్తే అన్ని అంశాల్లో నిజాలు బయటకొస్తాయని.. అందుకే వారు వాకౌట్ చేశారన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ లేదని చెబుతున్న నాయకులు ఎందుకు.. ధైర్యంగా అసెంబ్లీలో నిలబడలేకపోయారని ప్రశ్నించారు. వారి హయాంలో జరిగిందంతా అవినీతి, కల్తీ వ్యవహారాలేనని.. అందుకే అసెంబ్లీ నిలబడే ధైర్యం లేదన్నారు. అదే వారు అసెంబ్లీకి వస్తే ఏ సమస్య మీద అయినా చర్చించేందుకు ఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

# పుట్టపర్తిలో ఐఐఐటి ఏర్పాటు చేయాలి



**- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**
**- సీఎంతో చర్చించి పుట్టపర్తిలో ట్రిబుల్ ఐటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్**

పుట్టపర్తి(చైతన్యరథం): భగవాన్ శ్రీ సత్య సాయి బాబా చలువ వల్ల ప్రసిద్ధి గాంచిన పుట్టపర్తికి ప్రపంచ చరిత్ర పటంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. అలాంటి పవిత్ర పుణ్యక్షేత్రమైన పుట్టపర్తి ప్రాంతంలో ఐఐఐటి ఏర్పాటు చేసేందుకు పుట్టపర్తి లో అన్ని వసతులతో కూడిన సదుపాయాలు ,మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ట్రిబుల్ ఐటీ ఏర్పాటు చేయడం వల్ల సత్యసాయి జిల్లాతో పాటు అనంతపురం కర్నూలు ,చిత్తూరుమదనపల్లి,నంద్యాల , అన్నమయ్య,తిరుపతి జిల్లాలలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని విజయవాడ అమరావతిలో గురువారం జరిగిన అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

అదేవిధంగా ఒంగోలు ట్రిబుల్ ఐటీ, ఇడుపులపాయ శ్రీకాకుళం నూజివీడు ట్రిబుల్ ఐటీ విద్యార్థులు చదువుతున్న ప్రాంతంలోనే ఆయా కోర్సులు పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ ద్వారా రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా కోరారు. ఒంగోలులో ఐఐఐ టి చదువుతున్న విద్యార్థులు ఇడుపులపాయ,శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీ విద్యార్థులు నూజివీడు వచ్చి ఆయా కోర్సులు పూర్తిచేసుకుని తిరిగి ఆయా అదే ప్రాంతానికి వెళ్లి బీటెక్ మిగతా కోర్సులు కొనసాగించేలా ఇబ్బందులు ఉన్నాయని దీని వల్ల ఆయా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఎంతో శ్రమ తోపాటు ఎంతో ఇబ్బంది కరంగా పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. చదివే క్యాంపస్ లోనే ఆయా కోర్సులు పూర్తిచేసేలా విద్యా శాఖ ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా విన్నవించారు.

అదేవిధంగా పుట్టపర్తి నియోజకవర్గంలోఉన్న ఆరు మండలాలకు కలిపి కేవలం బుక్కపట్నంలో మాత్రమే ఒకే డిగ్రీ కళాశాల ఉందని ఇది 2018లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఈ ప్రాంత శాసనసభ్యులు అప్పటి మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో అప్పటి ప్రభుత్వం రూ.3 కోట్లతో డిగ్రీ కళాశాల నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేశారు. మొదటి విడతలో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.50 లక్షలు నిధులు మంజూరు చేయడంతో కొంతవరకు డిగ్రీ కళాశాల పనులు మొదలయ్యాయి. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టి ఈ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులకు నిధులు ఇవ్వకపోవడంతో కళాశాల నిర్మాణం పూర్తిగా ఆగిపోయిందని తెలిపారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం వల్ల అర్ధాంతరంగా ఆగిపోయిన డిగ్రీ కళాశాల నిర్మాణం పనులు చేపట్టే విధంగా సకాలంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసి త్వరగా వాటిని పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబును కోరారు.

ఈ సందర్భంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు స్పందిస్తూ, పుట్టపర్తి లో ట్రిబుల్ ఐటీ ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి హామీ ఇచ్చారు.

అదేవిధంగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి గారు చెప్పిన వాటిలో రాష్ట్రంలో ఐఐఐటి కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందని ,వీటిపై రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తో నిధుల మంజూరు విషయంపై చర్చించినట్లు మంత్రి నారా లోకేష్ బాబు పేర్కొన్నారు.ఏ క్యాంపస్ లో చదువుతున్న విద్యార్థులు అదే క్యాంపస్ లో ఆయా కోర్సులు పూర్తిచేసేలా నిధులు కేటాయింపు తోపాటు ప్రభుత్వం వీటిపై తప్పకుండా పూర్తి బాధ్యత తీసుకుంటుందని మంత్రి నారా లోకేష్ బాబు తెలిపారు.

# 114 రఫేల్ జెట్స్ కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్



- 6 పీ8ఐ విమానాలకు అమోదం



న్యూఢిల్లీ: ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన కీలకమైన డిఫెన్స్ డీల్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.3.25 లక్షల కోట్ల విలువైన డీల్ ఇది. ఈ డీల్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత నావికా దళం కోసం 6 పీ8ఐ విమానాలను కొనుగోలు చేసే డీల్‌ను కూడా ఆమోదించినట్టు తెలిపాయి. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు డీల్‌తో భారత వాయుసేన పోరాట సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈనెల ద్వితీయార్థంలో భారత్ పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగానే డిఫెన్స్ డీల్‌పై సంతకాలు జరిగే అవకాశా లున్నాయి. డీల్ ప్రకారం 18 రఫేల్ జట్లను 'ఫ్లై-అవే కండిషన్'లో నేరుగా తీసుకువస్తారు. తక్కిన 96 విమానాలు ఇండియాలో అసెంబుల్ చేస్తారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగం గా స్థానికంగా తయారీ, అసెంబెల్ కోసం రఫేల్ మాతృ సంస్థ దసో ఏవియేషన్, భారత్‌లోని ప్రైవేటు రంగ సంస్థలతో భాగస్వా మ్యం కుదుర్చుకుంటారు. భారత వాయుసేన వద్ద ప్రస్తుతం 36 రఫేల్ యుద్ధవిమానాలు ఉన్నాయి.

# స్పీకర్ ఛాంబర్‌లో కాంగ్రెస్ ఎంపీల రచ్చ

- వీడియో షేర్ చేసిన కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ: పార్లమెంటులో ఇటీవల విపక్షాల నిరసనల దృష్ట్యా ప్రధాని నరేంద్ర మోదీని సభకు రావొద్దని సూచించినట్టు స్పీకర్ ఓంబిర్లా వెల్లడించారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఛాంబర్‌లోకి దూసుకెళ్లి ఆయనను నిందించారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఇందుకు సంబంధించిన ఒక వీడియో క్లిప్‌ను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన తాజాగా షేర్ చేశారు. 'ఇది కాంగ్రెస్ ఎంపీ ఒకరు చట్ట విరుద్ధంగా తీసిన వీడియో. 20 నుంచి 25 మంది కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్ ఛాంబర్ లోకి ప్రవేశించి ఆయనను దుర్భాషలాడారు. ప్రధాని మంత్రి నరేంద్ర మోదీపై కూడా బెదిరింపు వ్యాఖ్యలు చేశారు. మా పార్టీ చర్చలను మాత్రమే ప్రోత్సహిస్తుంది. ఎంపీలు ఇలా బెదిరింపులకు పాల్పడటాన్ని ఎన్నడూ ప్రోత్సహించదు' అని రిజిజు ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. వీడియోలో పలువురు కాంగ్రెస్ ఎంపీలు, వీరిలో ఎక్కువ మంది మహిళా ఎంపీలు కనిపిస్తున్నారు. స్పీకర్ తన సీటులో కూర్చుని ఉండగా, ఆయన పక్కన కిరణ్ రిజిజు కూడా ఉన్నారు. కాగా, గత వారంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై రిజిజు వెంటనే మీడియాతో మాట్లాడుతూ, జరిగిన ఘటన తో స్పీకర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యారని చెప్పారు. 'వాళ్లు (కాంగ్రెస్ ఎంపీలు) స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లి ఆయనను దూషించారు. సభలో స్పీకర్ రూలింగ్ ఇచ్చినప్పుడు వాళ్లు పాటించలేదు. తాను మాట్లాడేందుకు ఎవరి అనుమతి తీసుకో వాల్సిన అవసరం లేదని రాహుల్ అంటున్నారు. అయితే స్పీకర్ అనుమతి లేకుండా సభలో ఎవరూ మాట్లాడకూడదు' అని అన్నారు. ఛాంబర్‌లో నిరసన తెలుపుతున్న ఎంపీలను ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రోత్సహించారని కూడా రిజిజు ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను ప్రియాంక గాంధీ తోసిపుచ్చారు. ఎంపీలు కేవలం తమ సమస్యలను చెప్పుకున్నారని, శాంతియుతంగానే ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు.



## జల్లికట్టులో యువకుడి మృతి

- 26 మందికి గాయాలు

జల్లికట్టు పోటీల సందర్భంగా తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పోటీలో పాల్గొన్న ఓ యువకుడు ఎద్దు దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉంది. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే బుధవారం దిండుగల్ జిల్లా పుగలైపట్టిలోని సెయింట్ సందియగప్పర్, సెయింట్ సెబాస్టియన్ చర్చ్ పండుగ సందర్భంగా జల్లికట్టు పోటీలు జరిగాయి. మధురై జిల్లాకు చెందిన 24 ఏళ్ల బాలరాజు అనే యువకుడు పోటీల్లో పాల్గొన్నాడు. ఎద్దు కారణంగా బాలరాజు తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడితో పాటు మరో 26 మందికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని ఆస్పత్రికి తరలిం చారు. బాలరాజు ప్రాణాలు కోల్పోగా.. 10 మంది పరిస్థితి విషమంగా ఉంది. కాగా, పుగలైపట్టిలో జరిగిన జల్లిక ట్టు పోటీల్లో 800 ఎద్దులు రంకెలేశాయి. 400 మంది ఆటగాళ్లు పాల్గొనగా.. 300 మంది పోలీసులతో భద్రత ఏర్పాటైంది.

**వారం క్రితం పుదుకోట్టైలోనూ ఘటన**

పుదుకోట్టై జిల్లా కులమంగలంలో జనవరి 2వ తేదీన తైపూసం ఉత్సవాల్లో భాగంగా జల్లికట్టు పోటీలు నిర్వహించారు. పోటీల ముగింపు సమయంలో 17 ఏళ్ల చిన్నయ్య అనే బాలుడిని ఎద్దు పొడిచింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని స్థానికులు పుదుకోట్టై ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించటంతో మెరుగైన వైద్యం కోసం తంజావూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నయ్య చనిపోయాడు.



# ఎనిమిదేళ్ల తర్వాత వీడిన మిస్టరీ

- మహిళా జర్నలిస్ట్ హత్య కేసు
- ప్రియుడే చంపాడని
  కోర్టులో ప్రత్యక్ష సాక్షి వాంగ్మూలం



ఛత్తీస్‌గఢ్: సల్మా సుల్తానా అనే మహిళా జర్నలిస్ట్ హత్య కేసుకు సంబంధించిన మిస్టరీ దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత వీడింది. ఈ హత్యకు సంబంధించిన ప్రత్యక్ష సాక్షి ఒకరు కోర్టులో కీలక విషయాలు వెల్లడించారు. సల్మా ప్రియుడే ఆమెను అత్యంత దారుణం గా చంపేశాడని, ఆ తర్వాత మృతురాలికి ఇష్టమైన పాటను వింటూ ఆ రాత్రంతా గడిపాడని సదరు సాక్షి కోర్టుకు తెలిపింది. ఇక ఈ ఘటనకు సంబంధించిన ప్రత్యక్ష సాక్షి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా నగరంలో 2018లో సల్మా సుల్తానా అనే జర్నలిస్ట్ హత్యకు గురైంది. అంతేకాక భవానీ దాబ్రీ సమీపంలో నిర్మాణంలో ఉన్న రోడ్డు కింద ఆమె మృతదేహాన్ని నిందితులు రహస్యంగా పూడ్చిపెట్టారు. దాదాపు ఐదేళ్ల తర్వాత 2023లో పోలీసులు గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్(జీపీఆర్) సాయంతో సల్మా మృతదేహాన్ని గుర్తించారు. ఈ క్రమంలో రోడ్డు తవ్వగా.. ఆమె మృతదేహం బయటపడింది. డీఎన్ఏ పరీక్షలు ఆ మృతదేహం సల్మాగా నిర్ధారించాయి. దీంతో అప్పటివరకూ మిస్సింగ్ కేసుగా ఉన్నది కాస్తా హత్య కేసుగా మారింది. ఈ క్రమంలో సల్మా హత్యను చూసిన కోమల్ సింగ్ అనే మహిళ కోర్టు ముందు వాంగ్మూలం ఇచ్చింది. సల్మాతో సహజీవనం చేసే మధుకర్ సాహు అనే వ్యక్తే.. ఆమెను దారుణంగా హత్య చేశాడని తెలిపింది. మధుకర్ జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. సల్మా, మధుర్ సహజీవనం చేస్తుండేవారు. ఇదే సమయంలో అనేక మంది యువతులు, మహిళల వ్యక్తిగత వీడియోలు తీసి బెదిరిస్తూ ఉండే వాడు మధుర్. ఈ విషయమై తరచూ సల్మా, మధుకర్ మధ్య గొడవలు జరుగుతుండేవి. అతడి నుంచి దూరంగా వెళ్లిపోయేందుకు సల్మా సిద్ధమైంది. ఈ క్రమంలోనే 2018 అక్టోబర్‌లో వారిద్దరి మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. మధుకర్.. సల్మాను బెడ్‌పై పడేసి గొంతు కోశాడు. మరో నిందితుడు కౌశల్ శ్రీవాస్.. సల్మా నోటిని దిండుతో నొక్కిపట్టాడు. తాను జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించగా చంపేస్తామని బెదిరించినట్టు కోమల్ కోర్టు ముందు వెల్లడించింది. సల్మాను చంపిన తర్వాత మధుకర్ సాహు సిగరెట్ తాగుతూ.. ఆమెకు ఇష్టమైన హిందీ పాటను విన్నాడని ప్రత్యక్ష సాక్షి కోమల్ సింగ్ తెలిపింది. పబ్లిక్ ప్రాసిక్యూ టర్ సునీల్ సోన్వానీ కోర్టులో ఇప్పటికే 41 మంది సాక్షులను విచారించారని, ఇంకా 10 మంది మిగిలి ఉన్నారని ధృవీకరించారు.



## డ్రోన్‌తో మాస్ కాపీయింగ్ గుట్టు రట్టు

డ్రోన్ కెమెరా ఫుటేజీతో మాస్ కాపీయింగ్ గుట్టురట్టయింది. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఈ ఘటన వెలుగుచూసింది. మహారాష్ట్రలో ఇటీవల 12వ తరగతి పరీక్షల్లో బీడ్ జిల్లా చౌశాలాలోని ఓ పరీక్ష కేంద్రంలో పెద్దఎత్తున మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఓ డ్రోన్ సాయంతో గుర్తించారు. దీంతో 17 మంది ఉపాధ్యాయులపై కేసు నమోదైంది.

# ఇదే చివరి అవకాశం

- పిటిషన్ విచారణకు నో
- మాల్యాకు బాంబే హైకోర్టు వార్నింగ్

పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా కేసు విషయంలో బాంబే హైకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. మాల్యా భారత్‌కు తిరిగి వచ్చే వరకూ ఆయన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేది లేదని పేర్కొంది. మాల్యాను పరారీలో ఉన్న ఆర్థికనేరస్థుడిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ ఆయన తరపు న్యాయవాదులు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ శ్రీచంద్ర శేఖర్, జస్టిస్ గౌతమ్ అఖండ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌కు తిరిగి రావడంపై స్పష్టతని చ్చేందుకు మాల్యాకు ఇదే చివరి అవకాశమని ధర్మాసనం పేర్కొంది. మాల్యా భారత్‌కు రానంటే ఈ పిటిషన్‌ను స్వీకరించలేమని తేల్చి చెప్పింది. నగదు అక్రమ రవాణా, లోన్‌లు చెల్లించకపోవడం తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్ మాల్యా 2016 నుంచి బ్రిటన్‌లో ఉంటున్న విషయం తెలిసిందే. ఆయనపై ఇప్పటికే పీఎంఎల్ఏ చట్టం కింద కేసు నమోదైంది. ఈ విషయమై విచారణ చేపట్టిన ప్రత్యేక న్యాయస్థానం 2019లో మాల్యాను పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది. ఇక మాల్యాను భారత్‌కు రప్పించేందుకు ఈడీ చేపట్టిన చర్యలు కీలక దశకు చేరుకున్నాయి. మరోవైపు విజయ్ మాల్యా కూడా కోర్టును ఆశ్రయించారు. తనను పరారీలో ఉన్న నేరస్థుడిగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఆర్థిక నేరస్థుల చట్టం-2018 రాజ్యాంగ బద్ధతను ప్రశ్నిస్తూ మరో పిటిషన్‌ను దాఖలు చేశారు.

# ఎప్‌స్టీన్‌తో ఎలాంటి సంబంధాలు లేవు


## - గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్



జెఫ్రీ ఎప్ స్టీన్ సెక్స్ రాకెట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇటీవల అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన ఫైళ్లలో ఎప్ స్టీన్, దాతృత్వ సంస్థ గేట్స్ ఫౌండేషన్ సిబ్బంది మధ్య సంభాషణ జరిగినట్టు వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ఫౌండేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. తాము అతడిని నియమించుకోలేదని, ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరపలేదని వెల్లడించింది.

"ఆరోగ్య సంరక్షణ, అభివృద్ధి కోసం విరాళాలు ఇచ్చే దాతలను సమకూరుస్తానని ఎప్ స్టీన్ చెప్పడంతో ఫౌండేషన్ సిబ్బంది కొందరు అతడితో సంభాషణలు జరిపారు. అయితే తర్వాత దీనిపై ముందుకువెళ్లలేదు. ఎలాంటి నిధి ఏర్పాటు చేయలేదు. విషయం ఏదైనా సిబ్బంది అతడితో మాట్లాడటంపై చింతిస్తున్నాం" అని తన ప్రకటనలో పేర్కొంది.

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్, మిలిందా (గేట్స్ మాజీ భార్య) 2000లో బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ స్థాపించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు చేపడుతోంది. దీనికి బిల్‌గేట్స్ చైర్మన్‌గా ఉన్నారు. కాగా.. ఇటీవల అమెరికా ప్రభుత్వం 30 లక్షల 'ఎప్ స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. జైల్లో చనిపోయిన మిలియనీర్ ఫైనాన్షియర్ ఎప్ స్టీన్ ఆధ్వర్యంలో మైనరు బాలికలపై జరిగిన లైంగిక వేధింపులకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నాయి. ఈ విషయంలో ఆయన ట్రంప్, బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూలతో జరిపిన సంభాషణలు ఉన్నాయి.



# నీల్ గ్రెహెల్స్‌కు నాసా బేకు

## - భూమివైపు దూసుకురావంతో అలెర్టయిన నాసా

నాసా టెలిస్కోప్ 'నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ' భూమి దిశగా దూసుకొచ్చింది. వాతావరణ రాపిడివల్ల ఇది తన కక్ష్యనుంచి భూమివైపు కదిలింది. 585 కిలోమీటర్ల ఎత్తునుంచి ఇది 400 కి.మీ కిందికి చేరింది. దీంతో అట్మాస్ఫెరిక్ డ్రాగ్ (స్పేస్ క్రాఫ్ట్ శక్తిని కోల్పోయేలా చేస్తుంది)ను తగ్గించేందుకు తాత్కాలికంగా సైన్స్ ఆపరేషన్లను నిలిపివేశారు. అలాగే మళ్లీ దానిని యథాస్థితికి చేర్చేందుకు నాసా రీబూస్ట్ మిషన్‌ను చేపట్టింది. విశ్వంలో చోటుచేసుకునే గామా కిరణాల పేలుళ్లను గుర్తించి, అధ్యయనం చేసేందుకు నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీని నాసా 2004లో దీన్ని ప్రయోగించింది. సోలార్ యాక్టివిటీవల్ల భూ ఎగువ వాతావరణం వేడెక్కి, ఈ అబ్జర్వేటరీ కక్ష్యనుంచి కిందికి రావడం ప్రారంభమైంది. దీనిని అలాగే వదిలేస్తే.. 2026 చివరినాటికి భూవాతావరణంలోకి ప్రవేశించి కాలిపోయేది. దాని వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. అయితే దాని సేవల్ని సాధ్యమైనంత ఎక్కువకాలం కొనసాగించాలని నాసా భావిస్తోంది. రీబూస్ట్ మిషన్‌ను చేపట్టేవరకు ఆ టెలిస్కోప్‌ను 300కి.మీ. ఎత్తులో ఉంచేందుకు.. అట్మాస్ఫెరిక్ డ్రాగ్‌ను తగ్గించేలా చర్యలు తీసుకుంటోంది.

కాగా.. రీబూస్ట్ మిషన్ కోసం ఆరిజోనాకు చెందిన కాటలిస్ట్ స్పేస్ టెక్నాలజీస్‌లో నాసా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ జూన్‌లో 30 మిలియన్ డాలర్లతో రోబోటిక్ లింక్ స్పేస్ క్రాఫ్ట్ (కక్ష్యలో సర్వీసింగ్ కోసం, ఉపగ్రహ మరమ్మతు, డాకింగ్ కోసం రూపొందించిన ఒక రోబో వ్యవస్థ)ను పంపించనుంది. ఇది స్విఫ్టను 600కి.మీ ఎత్తులో స్థిరమైన కక్ష్యలోకి చేరుస్తుంది. దాంతో అది మళ్లీ మరో పదేళ్లు సేవలు అందించడానికి వీలుకలుగుతుంది. ఈ ప్రయత్నం విజయవంతమైతే.. ఇప్పటివరకు సంగ్రహించిన డేటాను కాపాడుకునే వీలు కలుగుతుంది.

# మ్యాక్స్.. మన ప్రత్యామ్నాయం!

## - వాట్సాప్ మాధ్యమంపై రష్యా నిషేధం



సామాజిక మాధ్యమం వాట్సాప్‌ను రష్యా నిషేధించింది. స్థానిక చట్టాలను పాటించేందుకు వాట్సాప్ మాతృసంస్థ మెటా నిరాకరించిందన్న కారణంతో పుతిన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. అలాగే స్థానిక మెసెంజర్ 'మ్యాక్స్'కు మారాలని ప్రజలకు సూచించారు. "మనకు మ్యాక్స్ ఒక ప్రత్యామ్నాయం ఉంది. అది స్వదేశీ యాప్. ప్రస్తుతం అది మార్కెట్లో అందుబాటులో ఉంది" అని వెల్లడించారు. అయితే మ్యాక్స్‌పై దేశీయంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం దానిని నిఘా సాధనంగా వాడుతుందని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఆ వ్యాఖ్యలను రష్యా అధికారులు కొట్టి పారేశారు. ఇది ప్రజల దైనందిన కార్యకలాపాలు సులభతరంగా మారతాయని భరోసా ఇస్తుంది. కాగా.. స్థానిక చట్టాలను పాటించాలంటూ గత ఆరు నెలలుగా రష్యా ప్రభుత్వం వాట్సాప్‌పై ఒత్తిడి తీసుకువస్తోంది. రష్యాను మెటా ఇప్పటికే అతివాద సంస్థగా గుర్తించింది. "ప్రజలను ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిఘా యాప్ దిశగా మళ్లించేందుకు వాట్సప్‌ను పూర్తిగా బ్లాక్ చేసేలా రష్యా చర్యలు ప్రారంభించింది" అని గతంలో వాట్సాప్ ఆరోపించింది.

# కిమ్ వారసురాలు.. జు యే!

## అంచనా వేసిన దక్షిణ కొరియా నిఘా సంస్థ - తరచూ అధికారిక కార్యక్రమాలకు హాజరు



ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ కుమార్తే.. ఆయన వారసురాలని దక్షిణ కొరియా నిఘా సంస్థ 'నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్' అంచనా వేసింది. ఈ విషయాన్ని చట్టసభ సభ్యుల దృష్టికి తీసుకెళ్లింది. కిమ్ జు యే భవిష్యత్తు నాయకురాలిగా నియామకానికి చేరువలో ఉన్నట్లు తెలిపింది. ఈ నెలాఖరులో అతిపెద్ద రాజకీయ సదస్సును నిర్వహించేందుకు ఉత్తర కొరియా సన్నాహాలు చేస్తున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.

కిమ్ తన కుమార్తె కిమ్ జు యేను మొదటిసారిగా 2022లో ప్రపంచానికి పరిచయం చేశారు. 2023లో మిలిటరీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్యోంగ్యాంగులో మరోసారి కనిపించింది. నాటినుంచి పలు అధికారిక కార్యక్రమాలకు హాజరవుతోంది. గత నెలలోనూ తల్లిదండ్రులతో కలిసి దేశ మాజీ నేతల స్మారక ప్రదేశం 'కుమ్‌సుసన్ ప్యాలెస్ ఆఫ్ ది సన్'ను సందర్శించింది. ఇవన్నీ ఆమె కిమ్ వారసురాలన్న వార్తలకు బలం చేకూరుస్తున్నాయి.

ఉత్తర కొరియా పగ్గాలు ఆమెకే అప్పగిస్తారా? అని దక్షిణ కొరియా నిఘా అధికారులు మొదట్లో అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ దేశ సంప్రదాయవాద సంస్కృతి, పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుని ఈమేరకు అంచనాకు వచ్చారు. కానీ.. దేశ మీడియాలో ఆమె ప్రముఖంగా కనిపిస్తుండటంతో పునఃసమీక్ష చేశారు. ఈ క్రమంలోనే ఆమె వారసురాలిగా నియమాకం కీలక దశలో ఉన్నట్టు తెలిపారు. ఉన్నతస్థాయి సైనిక కార్యక్రమాల్లో పాల్గొనడం, కుముసన్ పర్యటనలో భాగం కావడం, కొన్ని విధానపరమైన విషయాల్లో తండ్రి ఆమె అభిప్రాయాలను కోరడం వంటివాటిని సంకేతాలుగా ఉదహరించినట్లు సమాచారం.

దక్షిణ కొరియా నిఘా వర్గాల ప్రకారం.. కిమ్‌కు ముగ్గురు పిల్లలు. కిమ్ జు యే రెండో సంతానం. ఆమెకు 13 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు. కిమ్ కూడా వంశపారంపర్యంగానే అధికారానికి వచ్చారు. తండ్రి కిమ్ జోంగ్ ఇల్ మరణానంతరం పగ్గాలు చేపట్టారు. ఫిబ్రవరి నెలాఖరులో కిమ్‌కు చెందిన వర్కర్స్ పార్టీ సదస్సు జరగనుంది. ఇదే వేదికగా ఆయన తన వారసత్వ ప్రణాళికలను పార్టీపరంగా ఆమోదముద్ర వేసుకునేందుకు అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# తెలిసీ విషం తిన్న ఫుడ్‌వ్లాగర్

## - డెవిల్ క్రాబ్స్ పీతలు తిని మృత్యువాత



పాపులార్టీ కోసం సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ తినకూడని పదార్థాలు తిని ప్రాణం వదిలేసింది. ఫిలిప్పీన్స్, ప్యూర్టో ప్రిన్సెసా, పలావాన్ ప్రాంతానికి చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, ఫుడ్ వ్లాగర్ ఎమ్మా అమిత్ (51) దగ్గర్లోని ఒక నదిలో డెవిల్ క్రాబ్స్‌ను పట్టుకుంది. డెవిల్ క్రాబ్స్ రకం పీతలు చాలా విషపూరితమైనవి. వీటిని ఎవరూ తినరు. ఆ విషయం కూడా ఆమెకు తెలుసు. అయితే, తను సోషల్ మీడియాలో పోస్ట్ చేసేందుకు వీడియో రూపొందించడం కోసం ఈ పీతల్ని తిన్నది. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం కోసం ఈ పీతల్ని పట్టుకుని, కొబ్బరి పాలతో కలిపి ఫిబ్రవరి 4న వంట చేసుకుని తిన్నది. అయితే, ఆ మరుసటి రోజే ఆమె తీవ్ర అనారోగ్యం పాలైంది. మూర్ఛ రావడం, పెదవులు నీలి రంగులోకి మారడంతోపాటు స్పృహ కోల్పోయింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో ఎమ్మా 6న ఆస్పత్రిలో మరణించింది. ఆమె మరణంపై స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఎమ్మా, ఆమె భర్త తీర ప్రాంతంలోనే ఉంటారని, వారికి చేపలు, ఇతర సీ ఫుడ్ గురించి బాగా తెలుసని వారు అంటున్నారు. ఇంత అవగాహన ఉన్నా కూడా ఆమె డెవిల్ క్రాబ్స్‌ను ఎందుకు తిన్నదో అని విస్మయం వ్యక్తం చేశారు. వీటిని వండినంత మాత్రాన అందులోని విషం తొలగిపోదని, ఇవి తింటే పక్షవాతం రావడంతోపాటు ప్రాణాలు కూడా పోతాయని వారు అంటున్నారు. ఏదేమైనా ఒక వీడియో కోసం ఎమ్మా అమిత్ విషాహారం తిని ప్రాణాలు కోల్పోయింది.

# ఇషాన్ కిషన్ విధ్వంసం..

## నమీబియాపై భారత్ ఘనవిజయం




ఢిల్లీ: టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ సత్తా చాటుతోంది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానం వేదికగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ ఇండియా.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (61, 24 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సులు), హార్దిక్ పాండ్యా(52; 28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) అర్ధశతకాలతో చెలరేగారు. సంజు శాంసన్ (22), తిలక్ వర్మ (25), శివమ్ దూబె (23) కీలక ఇన్నింగ్స్ ఆడారు. నమీబియా బౌలర్లలో గెర్హార్డ్ ఎరాస్మస్ 4 వికెట్లు పడగొట్టగా.. బెన్ షికాంగో, జేజే స్మిత్, బెర్నార్డ్ తలో వికెట్ తీశారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన నమీబియా 18.2 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. భారత్ బౌలర్ల దాటికి ప్రత్యర్థి బ్యాటర్లు నిలవలేకపోయారు. స్టీన్ కాంప్ (29) టాప్ స్కోరర్. ఫ్రెలింక్ (22), ఎరాస్మస్ (18) మినహా మిగతావారెవరూ చెప్పుకోదగ్గ స్కోరు చేయలేదు. భారత్ బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 3 వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య 2, బుమ్రా. శివమ్ దూబె, అర్షదీప్ సింగ్ తలో వికెట్ తీశారు. ఈ టోర్నీలో అమెరికాతో జరిగిన తొలి మ్యాచ్లో భారత్ 29 పరుగుల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. కొలంబో వేదికగా ఆదివారం పాకిస్థాన్‌తో భారత్ మూడో లీగ్ మ్యాచ్ ఆడనుంది.

# ఏపీ మద్యం కుంభకోణం.. రాజ్ కెసిరెడ్డే ఆర్కిటెక్ట్

### బెయిల్‌పై విచారణకు సుప్రీం నిరాకరణ



ఢిల్లీ: ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఏపీ మద్యం కుంభకోణం చాలా పెద్దదని.. అధికారులు కుమ్మక్కు కాకపోతే ఇలాంటివి జరగవని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. వారిని అరెస్ట్ చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వానికి రాజ్ కెసిరెడ్డి సలహాదారు మాత్రమేనని ఆయన తరపు న్యాయవాది తెలపగా.. ఆ వాదనను సీజేఐ ధర్మాసనం తోసిపుచ్చింది. కెసిరెడ్డి సలహాదారు మాత్రమే కాదని.. మొత్తం స్కామ్కు ఆయనే ఆర్కిటెక్ట్ అని వ్యాఖ్యానించింది. పదవిలో ఉన్నవారి అండ లేకుంటే అధికారులు ఇలా చేయలేరంది. కెసిరెడ్డి జైలులో ఉండి ఇప్పటికే 10 నెలలు గడిచిపోయానని.. సప్లిమెంటరీ ఛార్జ్ షీట్లు కూడా దాఖలు చేశా రని ఆయన తరపు న్యాయవాది తెలిపారు. ఏం కాదని.. మరికొంతకాలం జైలులో ఉండనీయండని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. కెసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు ధర్మా సనం ససేమిరా అంటూ పిటిషన్ డిస్మిస్ చేసేందుకు సిద్ధమైంది. అయితే పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కెసిరెడ్డి తరపు న్యాయవాది పేర్కొనడంతో అనుమతించింది.




# ఓపెనర్లు బాదేశారు..

### ఇటలీ చేతిలో నేపాల్‌కు పరాభవం

### వికెట్ కోల్పోకుండా విజయం

టీ20 ప్రపంచ కప్‌లో చిన్న జట్లు సత్తా చాటుతున్నాయి. గురువారం వాంఖడే వేదికగా నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇటలీ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి అదరగొట్టింది. నేపాల్ నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని వికెట్ కోల్పోకుండా 12.4 ఓవర్లలోనే ఛేదించారు. ఇటలీ ఓపెనర్లు జస్టిన్ మోస్కా(60), ఆంథోనీ మోస్కా(62) హాఫ్ సెంచరీలతో అజేయంగా నిలిచి వికెట్ కోల్పోకుండా విజయతీరాలకు చేర్చారు. ఎట్టకేలకు ఇటలీ జట్టు గ్రూప్ స్టేజిలో తన తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. ఇటలీ ఓపెనర్ల బ్యాటింగ్‌కు నేపాల్ బౌలర్ల దగ్గర సమాధానమే లేకపో యింది. నేపాల్ బౌలర్లు వారిని ఔట్ చేయడానికి విఫలయత్నం చేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన నేపాల్.. 19.3 ఓవర్లలో 123 పరుగులు చేసింది. ఆరిఫ్ షేక్(27) టాప్ స్కోరర్. ఆసిఫ్ షేక్ (20), రోహిత్ పాడెల్(23) మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ రాణించలేకపోయారు. ఇటలీ బౌలర్లలో క్రిషన్ 3, బెన్ మానేంటి 2, అలీ హసన్, స్మట్స్, జస్ప్రీత్ సింగ్ తలొక వికెట్ పడగొట్టారు. కాగా ఇంగ్లండ్‌పై అద్భుత ప్రదర్శన చేసి అందరి ప్రశంసలు అందుకున్న నేపాల్ జట్టు.. ఇటలీపై మాత్రం రాణించలేకపోయిం ది. ఇంగ్లండ్ చేతిలో పోరాడి 4 పరుగుల తేడాతో నేపాల్ ఓడిన విషయం తెలిసిందే. గ్రూప్ స్టేజిలో 2 మ్యాచ్‌లు ఆడేసిన నేపాల్.. ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేకపోయింది. దీంతో సెమీస్ ఆశలు దాదాపు గల్లంతు అయినట్లే.

# పాకిస్థాన్‌తో వివాదం..

### - పీఎస్ఎల్ వేలానికి అఫ్గాన్ ఆటగాళ్లు దూరం




లాహోర్ వేదికగా జరిగిన పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 11వ ఎడిషన్‌కు ముందు నిర్వహించిన ఆక్షన్‌లో అనూహ్య పరిణా మం చోటు చేసుకుంది. అఫ్గానిస్తాన్‌కు చెందిన పలువురు క్రికెట ర్లు తమ పేర్లను వేలం నుంచి ఉపసంహరించుకున్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావం వల్ల వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముజీబుర్ రెహ్మాన్, మహ్మద్ నబీ, ఫజల్ హక్ ఫారూఖీ, సిద్దికుల్లా అతల్, వకార్ సలామ్‌ఖేల్ వంటి ఆటగాళ్లు తొలుత వేలానికి రిజిస్టర్ అయినట్లు పీఎస్ఎల్‌లో ఓ ఫ్రాంచైజీ యజమాని వెల్లడించారు. అయితే పేషావర్ జల్మీ జట్టు రహ్మానుల్లా గుర్బాజ్‌ను నేరుగా తీసుకోవడంతో సోషల్ మీడి యాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో గుర్బాజ్ స్వయంగా పీఎస్ఎల్ నుంచి తప్పుకున్నాడు. ఆ తర్వాత మిగతా అఫ్గాన్ ఆట గాళ్లు కూడా వివాదాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో వేలం నుంచి తమ పేర్లు వెనక్కి తీసుకున్నట్లు సమాచారం. అయితే పీఎస్ఎల్ సీఈఓ సల్మాన్ నసీర్ మాత్రం ఈ విషయంపై భిన్నంగా స్పందించారు. 'వేలంలో కొంత మంది అఫ్గాన్ ఆటగాళు ఉన్నారు. కానీ ఏ ఫ్రాంచైజీ కూడా వారిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపలేదు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కూడా దీనికి కారణం అవ్వొచ్చు' అని తెలిపారు. కాగా గతేడాది పాకిస్థాన్ సైన్యం అఫ్గాని స్తాన్‌లోని కొన్ని ప్రాంతాలపై వైమానిక దాడులు జరిపిన సంగతి తెలిసిందే. దీంతో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించాయి. ఈ పరిణామాలపై అఫ్గాన్ ఆటగాళ్లు సోషల్ మీడి యాలో స్పందించగా పాకిస్థాన్ వర్గాల నుంచి కూడా ప్రతిస్పంద నలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పీఎస్ఎల్ వేలంలో అఫ్గాన్ ఆటగాళ్ల ఉపసంహరణ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# అర్ధ సెంచరీలతో హడల్

### ఒమన్‌పై శ్రీలంక భారీ విజయం




టీ20 ప్రపంచకప్‌లో భాగంగా గురువారం పల్లెకెలె వేదికగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 105 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. శ్రీలంక జట్టులో ముగ్గురు ఆటగాళ్లు అర్ధసెంచరీలతో రాణించడంతో భారీ స్కోరు చేసింది. దీంతో గ్రూప్-బీలో రెండు విజయాలతో శ్రీలంక అగ్రస్థానంలో కొనసాగు తోంది. మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి.. 225 పరుగులు భారీ స్కోర్ చేసింది. కుశాల్ మెండిస్ (45 బంతుల్లో 61), పవన్ రత్నాయకే (28 బంతుల్లో 60), దాసున్ శనక (20 బంతుల్లో 50) అర్ధ సెంచరీ లతో రాణించారు. దాసున్ అయితే కేవలం 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే అతడు భారీ షాట్‌కు ప్రయత్నించి జితేన్ రామానంది బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ఓపెనర్లు పాతుమ్ నిస్సాంక (13), కమిల్ మిషార (8) విఫలమ య్యారు. చివరల్లో కమిందు మెండిస్ (7 బంతుల్లో 19 పరుగులు) ఒమన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇక ఒమన్ బౌలర్లలో జితేన్ రామానంది 2, జే ఒడెద్రా, సుఫ్యాన్ మెహమూద్ తలో వికెట్ సాధించారు. 226 పరుగుల భారీ టార్గెట్‌తో బ్యాటింగ్‌కు దిగిన పసికూన ఒమన్ తడబడింది. 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 120 పరుగులు మాత్రమే చేయగలిగింది. మహ్మద్ నదీమ్ (53) చివరి వరకు పోరాడినా.. అది ఓటమి అంతరాని మాత్రమే తగ్గించగలిగింది. వసీమ్ అలీ (20 బంతుల్లో 27) ఫర్వాలేదనిపిం చాడు. మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. శ్రీలంక బౌలర్లలో చమీరా, తీక్షణ తలో రెండు వికెట్లు సాధించారు. హేమంత, కమిందు మెండిస్, దునిత్ వెల్లలాగే తలో వికెట్ తీసుకున్నారు.

# కొలంబో పిచ్‌ను భారత్‌కు అనుకూలంగా మార్చేస్తారు

### పాక్ క్రికెటర్ సక్లయిన్ ముస్తాక్ ఆరోపణలు..

ప్రస్తుతం ఐసీసీని బీసీసీఐ తీవ్రంగా ప్రభావితం చేస్తోందని, కొలంబోలోని పిచ్‌ను ఏ క్షణంలోనైనా టీమిండియాకు అనుకూలం గా మార్చవచ్చని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ సక్లయిన్ ముస్తాక్ సంచలన ఆరోపణలు చేశాడు. టీ-20 ప్రపంచకప్‌లో భాగంగా భారత్, పాకిస్థాన్ మధ్య ఆదివారం కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో మ్యాచ్ జరగబోతోంది. ఈ మ్యాచ్‌లో ఉపయోగించ బోయే పిచ్ గురించి ముస్తాక్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. 'ప్రస్తుతం ఐసీసీ ఎవరి ఒత్తిడికి తలొగ్గి పని చేస్తోందో అందరికీ తెలుసు. ఇప్పుడు ఉన్న టెక్నాలజీతో మనకు తెలియకుండానే కొద్ది గంటల్లో గ్రౌండ్స్‌మెన్ పిచ్ స్వరూపాన్ని మార్చొచ్చు' అని ఓ టీవీ కార్యక్రమంలో సక్లయిన్ ముస్తాక్ అన్నాడు. అలాగే పాక్ బౌలింగ్ ఆర్డర్ గురించి కూడా మాట్లాడాడు. భారత్‌తో మ్యాచ్‌కు పేసర్ ఉస్మాన్ తారిక్ కీలకం అవుతాడని, చివరి ఓవర్లు ఎవరు వేస్తా రనేది అతి ముఖ్యమని ముస్తాక్ అన్నాడు. పాక్ బౌలింగ్ ఆర్డర్ పైనే విజయం ఆధారపడి ఉందని ముస్తాక్ అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం పాకిస్థాన్ టీ-20 ప్రపంచకప్‌లో తన మ్యాచ్‌లన్నింటినీ శ్రీలంకలోనే ఆడుతోంది. ఇప్పటికే ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ పాక్ విజయం సాధించింది. ఆదివారం భారత్‌తో తలపడనుంది. మరోవైపు భారత్ ఇప్పటికి ఆడిన ఒక్క మ్యాచ్‌లో విజయం సాధిం చింది. మరికొద్ది సేపట్లో ఢిల్లీ వేదికగా జరగబోయే మ్యాచ్‌లో



# చైతన్య రథం సినిమా









## శ్రీవిష్ణు.. డబుల్ బొనాంజా

టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు కెరీర్‌లో అరుదైన ఫీట్ నమోదు చేస్తున్నాడు. శ్రీవిష్ణు నటించిన రెండు వైవిధ్యమైన చిత్రాలు ఒకే నెలలో విడుదలకు సిద్ధమవ్వడమే కాదు, వాటి డిజిటల్ రైట్స్ భారీ ధరకు అమ్ముడవ్వడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యింది. శ్రీవిష్ణు హీరోగా నటిస్తున్న 'విష్ణు విన్యాసం' చిత్రానికి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. అలాగే, ఆయన నటిస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ 'మృత్యుంజయ' ఓటీటీ డీల్ కూడా క్లోజ్ అయ్యింది. ఈ సినిమా ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో ఈ రెండు సినిమాల ఓటీటీ డీల్స్ ఫ్యాన్సీ రేటుకు కుదరడం విశేషం. సినిమా ఇండస్ట్రీలో ప్రస్తుతం సాగుతున్న డ్రై పీరియడ్‌లో కూడా శ్రీవిష్ణు సినిమాలకు ఇంతటి క్రేజ్ ఉండటం చూస్తుంటే, ఆయన మార్కెట్ స్టామినా అర్థమవుతోంది. రెండు చిత్రాలు ఈ నెలలోనే థియేటర్లలో సందడి చేయబోతున్నాయి. తనదైన కామెడీ టైమింగ్‌తో 'విష్ణు విన్యాసం' అలరిస్తుందని, 'మృత్యుంజయ'తో ఒక డిఫరెంట్ థ్రిల్లర్ అనుభూతిని ఇస్తానని శ్రీవిష్ణు ఫ్యాన్స్‌కు ప్రామిస్ చేస్తున్నాడు.

### ఓటీటీకి ప్రిడేటర్ సిరీస్..
## బ్యాడ్‌ల్యాండ్స్




వరల్డ్ వైడ్‌గా మంచి పాపులార్టీ ఉన్నటువంటి హాలీవుడ్ యాక్షన్ ఫ్రాంచైజ్‌లలో ప్రిడేటర్ సిరీస్ ఒకటి. అప్పట్లో ఆర్నాల్డ్ స్టార్ట్ చేసిన తర్వాత వచ్చిన ఒకటీ రెండు సినిమాలు తప్పితే ఈ ఫ్రాంచైజ్‌లో మంచి కిక్ ఇచ్చే సినిమా మళ్లీ రాలేదు. మధ్యలో కొన్నేళ్ల క్రితం వచ్చిన 'ప్రే' సినిమా మాత్రం ఫర్వాలేదనిపించింది. కానీ రీసెంట్‌గా వచ్చిన ఓ సినిమా మాత్రం మళ్లీ ఈ 'ప్రిడేటర్' సిరీస్‌లో మంచి కిక్ తీసుకొచ్చింది. గత ఏడాది నవంబర్‌లో రిలీజ్‌కి వచ్చిన ఆ చిత్రమే 'ప్రిడేటర్: బ్యాడ్ ల్యాండ్స్'. ఈసారి ఫుల్ యాక్షన్‌తో వచ్చిన సినిమా.. ఆ జోనర్ లవర్స్‌కి మంచి ట్రీట్‌ని ఇచ్చింది. దర్శకుడు ట్రాచెన్ బర్గ్ తెరకెక్కించిన సినిమా సిరీస్‌లో హయ్యస్ట్ గ్రాసర్‌గా నిలిచి ఫైనల్‌గా ఇప్పుడు ఓటిటిలో స్ట్రీమింగ్‌కి వచ్చేసింది. ఈ సినిమాని ప్రస్తుతం జియో హాట్ స్టార్ వరల్డ్ వైడ్‌గా అందుబాటులోకి తీసుకొచ్చారు. సినిమా కేవలం ఇంగ్లీష్‌లోనే కాకుండా రీజనల్‌గా తెలుగులో కూడా డబ్బింగ్ అయ్యి అందుబాటులో ఉంది. సో ఈ వీకెండ్‌కి ఓటిటిలో మంచి హాలీవుడ్ యాక్షన్ సినిమా చూడాలి అనుకునేవారు ఈ చిత్రాన్ని చూడొచ్చు.

## నవ్వించే మేన్షన్ హౌస్ మల్లేష్

టాలీవుడ్‌లో ప్రస్తుతం రూరల్ బ్యాక్‌డ్రాప్ కామెడీ సినిమాలకు మంచి ఆదరణ లభిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడూ అదే కోవలో తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న చిత్రం 'మేన్షన్ హౌస్ మల్లేష్'. శ్రీనాథ్ మాగంటి హీరోగా బాల సతీష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాను కనకమేడల ప్రొడక్షన్స్ పతాకంపై రాజేష్ నిర్మించారు. తాజాగా సినిమా టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. టీజర్ చూస్తుంటే.. 'శంకరమ్మ టెంట్ హౌస్' నడుపుకుంటున్న కథానాయకుడు (శ్రీనాథ్ మాగంటి) పెళ్లి జరుగగా.. శోభనం రోజు రాత్రి పెళ్లి కూతురు సడన్ షాక్ ఇస్తుంది. మరి పెళ్లి కూతురు ఇచ్చిన షాక్ ఏంటి? ఈ షాక్ తిన్న మన హీరో ఏం చేశాడు? అనేది ఈ సినిమా కథ. ఈ చిత్రం మార్చి 6న ప్రేక్షకుల ముందుకు రానున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. చిత్రంలో శ్రీనాథ్ మాగంటితోపాటు, గాయత్రి రమణ, సాయికామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలు పోషిస్తుండగా.. మురళీధర్ గౌడ్, రాజ్‌కుమార్ కసిరెడ్డివంటి సీనియర్ ఆర్టిస్టులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అమ్మ ముత్తు సినిమాటోగ్రఫీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.



## అదే.. భారతీయ సంస్కృతి

ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల తర్వాత సినిమా వేడుకల్లో మహిళలందరూ చీరలోనే కనిపిస్తున్నారని సీనియర్ నటుడు నరేశ్ అన్నారు. అలా ఉండటం భారతీయ సంస్కృతిగా పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన 'హే భగవాన్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నరేష్ మాట్లాడారు. వేడుకలో.. వాలంటైన్ వీక్‌లో భాగమైన 'హగ్ డే' సందర్భంగా టీంలోని పురుషులను ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలిపిన నరేశ్.. శివానీ నాగారం, చొక్కారపు స్రవంతికి కేవలం విషెస్ చెబుతూ వారి వస్త్రధారణను ప్రస్తావించారు. "మిమ్మల్ని కూడా హగ్ చేయాలనే వచ్చా. కానీ, మీరు లక్షణంగా చీరలు ధరించారు. కొన్ని పరిణామాల తర్వాత వేదికలపై చాలామంది చీరలోనే కనిపిస్తున్నారు" అని అన్నారు. సుహాస్ హీరోగా దర్శకుడు గోపి తెరకెక్కించిన కామెడీ ఎంటర్టైనర్ 'హే భగవాన్'. శివానీ హీరోయిన్. యాంకర్ స్రవంతి కీలక పాత్ర పోషించారు. సినిమా ఈనెల 20న విడుదల కానున్న సందర్భంగా ఏర్పాటైన ఈవెంట్‌కు హీరో సాయి దుర్గాతేజ్ ముఖ్య అతిథిగా హాజరై, సినిమా మంచి విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. "నా 'సుప్రీమ్' సినిమా ప్రమోషన్స్ సమయంలో సుహాస్‌ను చూశా. ఆయన అప్పుడెలా ఉన్నారో ఇప్పుడూ అలాగే ఉన్నారు. నరేశ్ అంకుల్ ఎప్పుడూ స్నేహపూర్వకంగా ఉంటారు. ఈ సినిమా మీ అందరికీ వినోదం పంచుతుందని అనుకుంటున్నా" అని సాయి దుర్గాతేజ్ ఆకాంక్షించారు.



## అప్పలసూరిగా జగ్గుభాయ్..

రామ్‌చరణ్, బుచ్చిబాబు సానా కాంబోలో వస్తున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ ఫిలిం 'పెద్ది'. ఈ ప్రాజెక్టునుంచి విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ ఫ్యాన్స్ అంచనాలను పీక్స్‌కి తీసుకెళ్లింది. తాజాగా చిత్ర యూనిట్ మరో ఆసక్తికర అప్‌డేట్‌ను పంచుకుంది. వెర్సటైల్ యాక్టర్ జగపతి బాబు పుట్టినరోజును పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ.. మేకర్స్ క్రేజీ పోస్ట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. సినిమాలో జగపతి బాబు 'అప్పలసూరి' అనే ఊరమాస్ పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఆయన ఫస్ట్ లుక్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. గుర్తుపట్టలేనంతగా ఉన్న ఆయన మేకోవర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచింది. తాజాగా, షూటింగ్ సెట్‌లో దర్శకుడు బుచ్చిబాబు సానా.. జగపతిబాబుకు ఒక కీలకమైన సీన్ వివరిస్తున్న ఫోటోను టీమ్ విడుదల చేసింది. ఈ చిత్రంలో అప్పలసూరి పాత్రలో జగ్గుభాయ్ నటన సినిమాకే మేజర్ హైలైట్ కాబోతుందని టీమ్ భరోసా ఇచ్చింది. జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్టును వృద్ధి సినిమాస్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ, సత్యవంటి స్టార్స్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న విలేజ్ స్పోర్ట్స్ డ్రామా ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## గతం గతః.. అదే కరెక్ట్

ఓ ప్రాజెక్టు విషయంలో సీనియర్ యాక్టర్ అర్జున్ -యంగ్ హీరో విశ్వక్సేన్ మధ్య గతంలో భేదాభిప్రాయలు తలెత్తిన సంగతి తెలిసిందే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆ వివాదం ప్రస్తావనకు రాగా 'గతం గతః' అన్న అభిప్రాయం వ్యక్తం చేశారు అర్జున్. విశ్వక్ కొత్త సినిమా 'ఫంకీ' విజయం సాధించాలని ఆకాంక్షించారు. దీనిపై విశ్వక్సేన్ తాజాగా స్పందించారు. అర్జున్ తీరు తనకు బాగా నచ్చిందన్నారు. జీవితమంటే ఇదే అనుకుంటున్నానని అన్నారు. ఈరోజు ఉన్న కోపం రేపు ఉండదు అన్నారు. అర్జున్ దర్శకత్వం వహించిన 'సీతాపయనం'తోపాటు ఈవారం విడుదల కానున్న 'కపుల్ ఫ్రెండ్లీ' తదితర సినిమాలూ విజయం సాధించాలని విశ్వక్ కోరారు.

విశ్వక్సేన్ హీరోగా, తన కుమార్తె ఐశ్వర్య హీరోయిన్‌గా అర్జున్ 2022లో ఓ సినిమా ప్రారంభించారు. కొన్ని రోజుల తర్వాత విశ్వక్, అర్జున్ మధ్య అభిప్రాయ భేదాలు వచ్చాయి. దీంతో, ఆ చిత్రాన్ని రద్దు చేశారు. దీంతో ఐశ్వర్య- నిరంజన్ (కన్నడ నటుడు ఉపేంద్ర సోదరుడి తనయుడు) ప్రధానపాత్రల్లో 'సీతాపయనం' తెరకెక్కించారు అర్జున్. ఈ మూవీ ప్రమోషన్స్‌లోనే 'ఫంకీ' విజయం అందుకోవాలని కోరుకుంటున్నానన్నారు. "అప్పుడప్పుడు అనుకోనివి జరుగుతుంటాయి. ఎవరినీ కోపగించుకోకుండా ముందుకెళ్లిపోవడమే. మా కాంబినేషన్ కుదరలేదంతే. అందరి సినిమాలు బాగా ఆడాలి" అని పేర్కొన్నారు. విశ్వక్ ఇంట్లో భోజనం కూడా చేశానని నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు.

వేర్వేరు సినిమాలతో.. రోజు వ్యవధిలో

ఒకే ప్రాజెక్టుతో బాక్సాఫీసు ముందుకు రావాల్సిన అర్జున్-విశ్వక్.. ఇప్పుడు వేర్వేరు చిత్రాలతో వస్తున్నారు. కామెడీ ఎంటర్టైనర్‌గా అనుదీప్ కేవీ తెరకెక్కించిన 'ఫంకీ' ఈనెల 13న, లవ్, ఫ్యామిలీ ఎమోషన్ ప్రధానాంశాలుగా రూపొందిన 'సీతా పయనం' ఈనెల 14న థియేటర్లకు రానున్నాయి.

